ఆదివారం
గత వారంరోజులపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
8-1-2026 గురువారం సంపుటి: 31 సంచిక: 338 పేజీలు: 8+4 వెల: 6.50

## చట్టాలు ఉల్లంఘిస్తే వీసాలు రద్దు చేస్తాం

## ఉస్మాన్ హాదీ హత్యకు సింగపూర్‌లో ప్రణాళిక

5లో

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సహకరించండి

కేంద్రమంత్రి అమిత్‌షాతో సిఎం విజ్ఞప్తి

కేబినెట్ విస్తరణలోనూ రాష్ట్రానికి అవకాశమివ్వండి

ఆర్థికమంత్రి నిర్మలతోనూ చంద్రబాబు భేటీ



# ఎపిని ఆదుకోండి!

**విజయవాడ,జనవరి7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాన్ని అన్ని విధాలుగా ఆదుకోండి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సహకరించాలని ఏపీ సీఎం చంద్రబాబు కేంద్రమంత్రి అమిత్‌షాను కోరారు. బుధవారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణపనులు పరిశీలన అనంతరం ఆయన రాజమండ్రి నుంచి ప్రత్యేక విమానం ఢిల్లీ బయలుదేరి వెళ్ళారు. అక్కడ ఆయన అమిత్‌షా ఆహ్వానం మేరకు డిన్నర్ బేటీకి వెళ్ళారు. ఈ సందర్బంలో తెలంగాణా, ఆంధ్రాల నడుమ జలవివాదాల గురించి ప్రస్తావించారు. తెలుగు రాష్ట్రాల నడుమ వివాదాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే సందర్భంలో వచ్చే నెలల్లో జరగునున్న కేంద్ర మంత్రి వర్గంలో ఏపీ ఎంపీలకు కనీసం రెండు మంత్రి పదవుల కేటాయింపు. అమరావతి పోలవరం ప్రాజెక్టులకు త్వరితగతిన నిధుల కేటాయింపు అంశాలు, ఏపీ రాజకీయ పరిస్ధితులపై అమిత్‌షాతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. సీఎం ఈ రోజే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కలిసి, ఫిబ్రవరిలో పార్లమెంటులో ప్రవేశపెట్టే ఆర్థిక ప్రణాళికలో ఏపీలో ఆయా రంగాలకు సంబంధించి నిధుల కేటాయుంపుపై మాట్లాడే అవకాశం ఉందంటున్నారు.

# భావోద్వేగాలతో ఆటలొద్దు

## నదీజలాలపై రాజకీయాలు చేయొద్దు

ఎపి జీవనాడి పోలవరం కలను సాకారం చేస్తున్నాం

వృధా జలాలను సద్వినియోగం చేసుకుందాం..

నదుల అనుసంధానంతో తెలంగాణకూ లబ్ధి

పోలవరం కుడి కాల్వ ద్వారా కొల్లేరు ప్రాంతాలకు నీరు

వచ్చే యేడాది మార్చికి పూర్తయ్యేలా చర్యలు

రాయలసీమ లిఫ్ట్ పేరుతో రాజకీయం సిగ్గు చేటు

మీడియా సమావేశంలో సిఎం చంద్రబాబు

పోలవరం నిర్మాణ పనులు, పరిశీలన, ఉన్నత సమీక్ష



పోలవరంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సిఎం చంద్రబాబు

**ఏలూరు/పోలవరం, జనవరి 7 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టును ఏదో ప్రాంతానికి పరిమితమైన ప్రాజెక్టుగా చూడకూడదని ఈ ప్రాజెక్టు తెలుగు జాతికి నెర్వ్ సెంటర్ లాంటిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బుధవారం సిఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు సైట్ మొత్తం పర్యటించారు.. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న టన్నెళ్లను.. డయాఫ్రం వాల్, ఇసిఆర్ఎఫ్ డ్యాం పనులను పరిశీలించారు. ప్రాజెక్టు సైటులో అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ సందర్శించారు. నిర్మాణ పనులు ఎలా జరుగుతున్నాయోననే అంశాన్ని క్షేత్రస్థాయిలో పర్యటించిన అనంతరం ముఖ్యమంత్రి ఇరిగేషన్ శాఖ అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు అధికారులకు, కాంట్రాక్టు సంస్థకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో వివిధ సూచనలు చేశారు. అనుకున్న సమయానికంటే ముందుగానే పోలవరం నిర్మాణ పనులు పూర్తి చేసి జాతికి అంకితం చేసేలా ప్రణాళికలు సిద్దం చేయాలని ఆదేశించారు. అనంతరం సిఎం చంద్రబాబు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ వీలైనంత త్వరగా పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తాం. గతంలోనే డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తై ఉంటే రూ.440 కోట్లతోనే నిర్మాణం జరిగేది. ప్రాజెక్టు కూడా త్వరితగతిన పూర్తి అయ్యేది. 2019లో ప్రభుత్వం మారాక పోలవరం ప్రాజెక్టుకు చాలా నష్టం జరిగింది. డయాఫ్రం వాల్ దెబ్బతిన్నా కూడా నాటి ప్రభుత్వం దానిని గుర్తించడానికి చాలా సమయం తీసుకుంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి ఆరేడేళ్ల జాప్యం అయింది. జాప్యంకావడం వల్ల ఖర్చులు పెరిగాయి. డయాఫ్రం వాల్ నిర్మాణానికి అదనంగా రూ.1000 కోట్ల భారం పడింది. వచ్చే ఫిబ్రవరి 15 నాటికి డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి చేస్తాం. పోలవరం మెయిన్ డ్యాం దాదాపు పూర్తి అయింది. ఎంబాంక్‌మెంట్ పనులు ఈఏడాది జూన్ నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈసీఆర్ఎఫ్ డ్యాం గ్యాప్2 పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని ఆదేశించాం. ఇక పోలవరం ప్రాజెక్టులో ప్రధాన పనులను అన్నింటినీ వచ్చే ఏడాది మార్చి >>2



# అదుపులోకి బ్లోఅవుట్

## రంగంలోకి ఓఎన్‌జిసి నిపుణుల బృందం

**రాజోలు, జనవరి 7,ప్రభాతవార్త:** మల్కిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో ఓఎన్జిసి మోరి 5 బోరుబావి నుండి గ్యాస్ లీకేజీ మంటలు అదుపులోకి వస్తోండగా ప్రజారక్షణ పై ఓఎన్జీసి నిరక్ష్యం పై ప్రజల్లో ఆగ్రహవేశాలు పెలుబుకుతోన్న పరిస్థితి డాక్టర్ బిఆర్ అంబెద్కర్ కోన సీమ జిల్లాలో నెలకొంది. బ్లోఔట్ ప్రాంతానికి రోడ్డు అవసరమని ఓఎన్జీసీ నిపుణుల బృందం కోరడంతో తక్షణమే స్పందించిన అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి రాత్రికి రాత్రి రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. దీంతో ప్రమాద స్థలంలోని శకలాలను తొలగించే ప్రక్రియను వేగవంతం చేశారు. ఇరుసుమండలో గ్యాస్ లీకేజీ ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ నెల 9న కోనసీమ బ్లో ఔట్ ప్రాంతాన్ని సందర్శించి... ఏరియల్ సర్వే చేయనున్నట్టు తెలిసింది. ఓఎన్జిసి మోరి 5 బోరుబావి నుండి గ్యాస్ లీకేజీ మంటలు అదుపులోకి వచ్చాయని త్వరలో క్యాపింగ్ పనులు పూర్తవుతాయని ఇరుసుమండ గుబ్బల వారి పాలెం, చింతల పల్లి లక్కవరం గ్రామ ప్రజా నీకానికి పూర్తిగా ముప్పు బెడద తప్పిందని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ రాజోలు శాసనసభ్యులు దేవవరప్రసాద్, ఓఎన్జిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు విక్రమ్ సక్సేనా, శాంత నూరు దాస్ లు సమావేశం నిర్వహించి గ్యాస్ లీకేజ్ సంఘటన ప్రస్తుత స్థితిగతులపై వివరించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ నరసాపురం నుండి ప్రత్యేక రిగ్గును స్థానికంగా తీసు కుని వచ్చి నియంత్రణ చర్యలు 5 పంపులతో వాటర్ అంబ్రెల్లా గా ఏర్పరచి ముందుగా వేడి తీవ్రతను అరికట్టడం జరి గిందని, నేటి సాయంత్రానికి పూర్తిగా >>2

## భూ మాతను రక్షించుకుంటూ

# రైతుల ఆదాయం పెంచాలి

ఉద్యాన సాగులో వైవిధ్యం.. భూమికి రక్షణ కవచం

విభిన్న రకాల పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి

గ్రీన్ కవర్ ప్రణాళికల అమలులో ఉద్యానశాఖ కీలకం

అటవీ, ఉద్యాన శాఖ ఉన్నతాధికారులతో డి.సిఎం పవన్



**విజయవాడ, జనవరి 7 ప్రభాతవార్త ప్రతినిధి:** భూ మాతను రక్షించుకుంటూ, రైతుల ఆదాయం పెంచే విధంగా ప్రణాళికలకు రూపకల్పన చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పండ్ల తోటల్లో విభిన్న జాతుల మొక్కలు సాగు చేయడం ద్వారా భూసారాన్ని పెంచడంతోపాటు వాతావరణాన్ని రక్షించుకోవచ్చని తెలిపారు. బుధవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో 50శాతం గ్రీన్ కవర్ ప్రణాళికలపై అటవీ, ఉద్యాన శాఖల ఉన్నతాధికారులతో చర్చించారు. గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 50శాతం గ్రీన్ కవర్ అంశాలపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చర్యల్లో భాగంగా ఈ సమావేశం జరిగింది. గ్రీన్ కవర్ పెంపులో ఉద్యాన శాఖ పాత్ర, పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యం తదితర అంశాలపై పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ "గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 2047 నాటికి రాష్ట్రంలో 50శాతం గ్రీన్ కవర్ సాధన అంశాలను కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అందుకోసం అన్ని ప్రభుత్వ రంగ శాఖలు అటవీ శాఖతో సమన్వయంతో ముందుకు వెళ్లాలి. గ్రీన్ కవర్ ఏర్పాటులో ఉద్యానవన శాఖ పాత్ర కీలకం. ఉద్యాన పంటల సాగులో వైవిధ్యం తీసుకురావడం ద్వారా అటు రైతుకీ, ఇటు భూమికీ ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలి. ఒకే పంటలో వివిధ రకాల జాతుల మొక్కలు అంతర పంటలుగా సాగు చేసే విధంగా రైతులను పోత్సహించాలి. సింథటిక్ మందుల వినియోగం తగ్గించేలా అవగాహన కల్పించాలి. తద్వారా భూమికి చేవ పెరుగుతుంది. జీవవైవిధ్యాన్ని రక్షించుకోవచ్చని అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, రైతు సాధికారిత సంస్థ ఎగ్జికూటివ్ డైరెక్టర్ విజయ్ కుమార్, నాచురల్ ఫార్మింగ్ సొసైటీ డైరెక్టర్ శ్రీనివాసులు, పిసిసిఎఫ్ పి.వి. చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## వెనిజులా చమురు మేమే అమ్ముతాం

రష్యా, చైనా ఇరాన్‌తో సంబంధాలు తెంచుకోండి: వెనిజులాకు ట్రంప్ వార్నింగ్

యుఎస్ నుంచి చమురు నౌకలను రక్షించడానికి రష్యా జలాంతర్గామి ఎంట్రీ

5లో



బుధవారం విశాఖలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

## శాంతిభద్రతలలో

# రాజీలేదు

కఠినంగా వ్యవహరిస్తాం, మహిళలను కించపరిస్తే సహించేది లేదు

అమరావతి, విశాఖ, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల సమగ్ర అభివృద్ధి

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రాఫిట్‌లో నడవాలి, మీడియా సమావేశంలో మంత్రి లోకేష్

**విశాఖపట్నం, జనవరి 7 ప్రభాతవార్త:** రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. 'చట్టాన్ని ఉల్లంఘించిన వారిని ఎవరినీ వదిలిపెట్టేది లేదు. ఆ మేరకు మేం ప్రజలకు హామీ ఇచ్చాం. హామీ మేరకు ప్రజలు మమ్మల్ని గెలిపించారు. దానిని అమలుచేయాల్సిన బాధ్యత మాపై ఉంది. మహిళలను గౌరవించేలా కేజీ నుంచి పీజీ వరకు కరిక్యులమ్‌లో మార్పులు చేస్తున్నాం. అత్యాచారాలు, దాడులకు పాల్పడినా, మహిళలను కించపరిచినా వదిలిపెట్టేదిలేదు. రాష్ట్రవ్యాప్తంగా రౌడీషీటర్లను ఊరేగిస్తున్నాం. గంజాయి స్మగ్లర్లను కూడా హెచ్చరిస్తున్నా. మేం ఎవరినీ వదిలిపెట్టేది లేదు. శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. అలాగే మహిళలను కించపరిస్తే సహించేది లేదు'అని అన్నారు. బుధవారంనాడిక్కడ మంత్రి లోకేష్ మీడియాతో మాట్లాడుతూ 'మాకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే వైఎస్ భారతిపై పరుష వ్యాఖ్యలు చేసిన మా కార్యకర్తపై చర్యలు తీసుకున్నాం. అతను జైలుకు వెళ్లాడు. వైసీపీ ఐదేళ్ల పాటు నాపైన, మా కుటుంబంపైనా సోషల్ మీడియాలో బురద జల్లారు. శాసనసభ సాక్షిగా నా తల్లిని అవమానించారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మహిళను కించపరిస్తే ఎంత ఇబ్బంది పడతారో నేను కళ్లారా చూశా. అవి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సోషల్ మీడియాకు రావాలంటే ఒక వయస్సు అనేది ఉంటుంది. అది పాటించడం లేదు. అవన్నీ మేం చర్చిస్తున్నాం' >>2

# నేటి నుంచి 'ఆవకాయ్'

## అమరావతి ఉత్సవాలు

తెలుగు సినిమా, సాంస్కృతిక, కళా, సాహిత్య వైభవాన్ని ప్రపంచానికి చాటడమే లక్ష్యం

**విజయవాడ,జనవరి7,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నగరం అద్భుతమైన కళా సంబరానికి ఆతిథ్యం ఇచ్చేందుకు ముస్తాబైంది. సాహిత్యం, కళాకారులు, సాంస్కృతిక సంప్రదాయాలకు నిలయంగా విరా జిల్లుతోన్న ఆంధ్రప్రదేశ్ రాజధాని అమ రావతిలో ఘనమైన వారసత్వాన్ని, భాషా ప్రాభవాన్ని, కళా వైభవాన్ని జరుపుకోవడానికి "ఆవకాయ్ " అమరావతి సినిమా, సంస్కృతి, సాహిత్యోత్సవంఖ సిద్ధమైంది. సీఎం నారా చంద్రబాబు నాయుడు చొరవతో, మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో రాష్ట్ర పర్యాటకశాఖ, టీమ్‌వర్క్ ఆర్ట్స్ సంయుక్తంగా తెలుగు సినిమా, సాంస్కృతిక, సాహిత్య వైభవాన్ని ప్రపంచానికి చాటడమే లక్ష్యంగా విజయవాడ వేదికగా కృష్ణా నది తీరాన ఉన్న పున్నమి ఘాట్ మరియు భవానీ ఐలాండ్ లో నేటి (జనవరి 8) నుండి ఆవకాయ్ అమరావతి ఉత్సవాలు 3 రోజుల పాటు(జనవరి 10 వరకు) ప్రజలను కనువిందు చేయనున్నాయి. సినిమా ప్రదర్శనలు, సాహిత్యచర్చలు, కవితా పఠనాలు, సంగీతం, నృత్యం, నాటకాలు, వర్క్ షాప్ లు, సాంస్కృతిక భాషణలు, ఆధునిక కళా ప్రదర్శనలతో కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాద >>2



కోనసీమ జిల్లా రావులపాలెంలో ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో భోగిపండ్ల ఉత్సవం

# పల్లెల్లో సంక్రాంతి శోభ షురూ!

గోదావరి జిల్లాల్లో ప్రారంభమైన హడావిడి

గ్రామాల్లో, మండల కేంద్రాల్లో సంబరాలు

పందెం కోళ్లు సిద్ధం... బరులు రెడీ

విదేశాల నుంచి సైతం రాక మొదలు

కోడిపందాలు అరికట్టడంపై పోలీసుల నజర్

డ్రోన్ కెమెరాలు, ప్రత్యేక బృందాలతో నిఘా

**ఏలూరు, జనవరి, 7 పశ్చిమగోదావరి జిల్లా ప్రభాతవార్త బ్యూరో:** గోదావరి జిల్లాలో సంక్రాంతి శోభ ఇప్పటికే ప్రారంభమైంది గ్రామాల్లో హరిదాసుల ఆలాపనలు, గుమ్మం ముందు గంగిరెద్దుల పలకరింపులు, వాకిట్లో రంగురంగుల ముగ్గులతో ఏడాదికి ఒకసారి వచ్చే పల్లె పండుగ సంక్రాంతి హడావిడి ఇప్పటికే ప్రారంభమైంది. సంక్రాంతి వస్తుందంటే చాలు గోదావరి జిల్లాలంతా పండుగ రంగుల్లో మునిగిపోతాయి. ఇళ్ల ముందే కాదు, గ్రామాల వీధుల్లోనూ, మండల కేంద్రాల్లోనూ సంబరాల సందడి కనిపిస్తుంది. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు అన్నీ ఒకదానికొకటి పోటీపడుతూ ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తుంటాయి.



ఈ ఏడాది కూడా సంక్రాంతి రాకముందే గోదావరి జిల్లాలు పండుగకు స్వాగతం పలుకుతున్నాయి. ఈకోవలోనే అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెం పట్టణం సంక్రాంతి సంబరాలతో మురిసి పోయింది. రావులపాలెంలోని ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో భోగి పండ్ల ఉత్సవం, సంక్రాంతి వేడుకలు అత్యంత సంప్రదాయ >>2



బుధవారం పోలవరం ప్రాజెక్టు పనులపై మీడియాతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు

# భావోద్వేగాలతో ఆటలొద్దు

>> నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. వినియోగంలోకి తెచ్చే ప్రయత్నం చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. **పునరావాస పనులకు యాక్షన్ ప్లాన్:** పునరావాసం, ఆర్ అండ్ ఆర్ పనులను 12 నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు యాక్షన్ ప్లాన్ పెట్టుకుని దానికి అనుగుణంగా పనులు చేపడ్తారు. పునరావాసం కోసం అవసరమైన భూ సేకరణ కూడా త్వరితగతిన చేపట్టాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు కేంద్రంగా అతిపెద్ద ఐకానిక్ ల్యాండ్ వాటర్ బేస్ ఏర్పాటు చేయబోతున్నాం. పోలవరం కుడి, ఎడమ కాలువలు, టన్నెల్ ద్వారా కనెక్టివిటీ పెంచుతాం. ఎడమ కాలువ పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. విశాఖ వరకు పోలవరం నీళ్లను తీసుకెళ్తాం. విశాఖ, అనకాపల్లి జిల్లాలను సస్యశ్యామలం చేస్తాం. అలాగే పోలవరం కాలువల ద్వారా పారే గోదావరి జలాలతో దారి పొడుగునా ఉన్న మైనర్ ఇరిగేషన్, చెక్ డ్యాంలను నింపుతూ వెళ్తాం. ఇక పోలవరం కుడి కాల్వ ద్వారా గోదావరి జలాలను కొల్లేరు వరకు తీసుకెళ్లేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. ఐదేళ్ల కాలంలో గత ప్రభుత్వం కేవలం 2 శాతం పనులు మాత్రమే పూర్తి చేసింది. పట్టిసీమ ప్రాజెక్టుపై విమర్శలు చేశారు. పట్టిసీమ లేకుంటే కృష్ణా డెల్టాకు నీళ్లు ఇచ్చే పరిస్థితి ఉండేది కాదు. ఉద్యాన రంగం అభివృద్ధి చెందుతోంది. పోలవరం పూర్తి కావాలి నదులు అనుసంధానం చేయాలి. కరువు రహితంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలి ఇది నా కల అని సిఎం వివరించారు.

**ప్రజా ప్రయోజనాల విషయంలో రాజకీయాలు తగదు:** "2014-19 మధ్య కాలంలో ఇరిగేషన్ కోసం రూ.65 వేల కోట్లు ఖర్చు పెట్టాం... వైసిపి కేవలం రూ. 12 వేల కోట్లు ఖర్చుపెట్టింది. రాయలసీమలో 2014-19 మధ్య కాలంలో రూ.12 వేల కోట్లు ఖర్చుపెట్టాం... వాళ్లు కేవలం రూ.2 వేల కోట్లు ఖర్చు పెట్టారు. ప్రాజెక్టులను నిర్వీర్యం చేస్తున్నారని ప్రతిపక్షంలో ఉండగా తాను పర్యటనలు చేస్తుంటే... నాటి ప్రభుత్వం అరెస్ట్ చేసింది. పోలవరం ప్రాజెక్టు ద్వారా రాష్ట్రం నలుమూలలకు నీటిని అందించేలా ప్రణాళిక చేసుకోవచ్చు. సమగ్ర నీటి నిర్వహణతో 368 టిఎంసిల నీళ్లు రాయలసీమ రిజర్వాయర్లల్లో ఉన్నాయి... చాలా సంతోషంగా ఉంది. ఒక పంటకు నీళ్లివ్వలేని నెల్లూరు జిల్లాలో రెండు పంటలకు నీరు ఇచ్చే పరిస్థితి వచ్చింది. రెండు రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజకీయాలు చేయడం సరికాదు. తెలంగాణలో దేవాదుల, కల్వకుర్తి, మాధవరెడ్డి లిఫ్ట్ స్టార్ట్ చేశాను. కృష్ణా డెల్టా ఆధునికరణతో 20 టిఎంసిల నీటిని పొదుపు చేసి... బీమా లిఫ్ట్ పూర్తి చేశాం. ఆర్డీఎస్‌కు నీళ్లు రాకపోతే... జూరాల నుంచి లింక్ కెనాల్ ద్వారా మహబూబ్ నగర్ జిల్లాలో 40 వేల ఎకరాలకు నీళ్లందించాం. గోదావరి పైనా తెలంగాణలో అలీసాగర్, గుత్ప ప్రాజెక్టులు చేపట్టాం. హైదరాబాద్ నగరానికి సాగర్ జలాలు అందించాం. తెలుగుజాతి కోసం హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేశాం. గోదావరిలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి... దేవాదుల ప్రాజెక్టు విస్తరించుకుంటే ఇబ్బంది లేదు. పోలవరం నీళ్లను మేం వాడుకుంటే అభ్యంతరం వ్యక్తం చేయడం సబబేనా..? పోలవరం నీళ్లను వినియోగించుకుని కృష్ణా జలాలను పొదుపు చేసుకుంటున్నాం. ఈ పొదుపు చేసిన నీటిని సీమకు మళ్లిస్తున్నాం... అన్నీ కలిసి వస్తే... అవసరమైతే తెలంగాణ కూడా నీళ్లు ఇవ్వవచ్చు." అని చంద్రబాబు వెల్లడించారు.

**అబద్దాన్ని వందసార్లు చెబితే నిజమవుతుందా...?**

"రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుపై కొందరు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. ఓ అబద్దాన్ని వందసార్లు చెబితే నిజం అవుతుందా.? రూ.3825 కోట్లను రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుకు మంజూరు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా రాయలసీమ లిఫ్ట్ ప్రాజక్టు పనులను ప్రారంభించారు. సరైన అనుమతులు లేకుండా పనులు ప్రారంభించారని జరిమానా కూడా పడింది. ఆ పనులను ఆపేయాలని ఎన్జీటీ ఆదేశించింది. రూ.900 కోట్లు కాంట్రాక్టరుకు చెల్లించారు. అనుమతుల్లేని ప్రాజెక్టులు మొదలు పెట్టి రూ.2500 కోట్లు చెల్లింపులు జరిపారు. విచ్చలవిడిగా, అడ్డగోలుగా పనులు చేశారు. ముచ్చుమర్రి ప్రాజెక్టు ద్వారా సీమకు నీటిని తరలించే అవకాశం ఉన్నా... 34 టిఎంసిల నీటిని తరలిస్తామంటూ మరో ప్రాజెక్టు చేపట్టారు. వ్యవస్థలను ట్రాక్‌లో పెట్టే చేస్తే బురద జల్లుతున్నారు. హంద్రీ-నీవా ద్వారా అన్ని చెరువులకు నీళ్లు ఇచ్చాం... కుప్పం వరకు నీళ్లు పారించాం. సీమలో ప్రాజెక్టులన్నింటికీ నీళ్లతో నింపాం. ఎప్పుడూ నీళ్లు చేరని బ్రహ్మం సాగర్ రిజర్వాయర్ కూ నీళ్లను పంపించాం. నాపై బురద జల్లితే..వారికే నష్టం. దేశంలో నదుల అనుసంధానం జరగాలనేది నా కోరిక. సముద్రంలోకి వృధాగా పోయే నీళ్లను వాడుకోగలిగితే.. మేలు జరుగుతుంది. తెలంగాణలో వరదలు వస్తే ఎపిని ముంచెత్తుతాయి. సముద్రంలోకి పోయే నీళ్లను వినియోగించుకుంటే ఆటో పైలెట్ విధానంలో అభివృద్ధి జరుగుతుంది. నా రాజకీయ జీవితంలో చాలా ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి.. పూర్తి చేశాను. ఎపిలో 90శాతం ప్రాజెక్టులు తెలుగుదేశం చేపట్టినవే. కొంత మందికి ప్రాజెక్టులు అర్ధం కావు... కానీ రాజకీయం మాత్రం చేస్తారు. తెలుగుజాతి అంతా ఒకటే. ఇచ్చి పుచ్చుకునే ధోరణితో వ్యవహరించాలి." అని ముఖ్యమంత్రి కోరారు. సిఎం చంద్రబాబు పోలవరం పర్యటనలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్ధసారధి, నాదెండ్ల మనోహర్, స్థానిక ఎంపి, ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**నిర్వాసితులపై పూర్తి ఫోకస్ పెట్టాలి**

పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై సిఎం చంద్రబాబు దృష్టి సారించారు. బుధవారం ఆయన ప్రాజెక్టు సైట్ వద్ద జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీర్లతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టులో మిగిలిన పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులో ఇప్పటికే 87శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పనులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఆదేశించారు. దీనికోసం ప్రత్యేకంగా ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. అదేవిధంగా పోలవరం ఎడమ కాలువ పనులను వేగవంతం చేయాలని సిఎం తెలిపారు. కుడి కాలువ ద్వారా కొల్లేరు ప్రాంతానికి కూడా నీరందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కీలక సూచన చేశారు. వచ్చే మే నెల మొదటి వారంలో తాను మళ్లీ పోలవరం ప్రాజెక్టుపనుల పురోగతిని స్వయంగా తనిఖీ చేస్తానని చంద్రబాబు వెల్లడించారు.

# శాంతిభద్రతలలో రాజీలేదు

>> అని స్పష్టం చేశారు. క్రమశిక్షణ, పట్టుదలతో ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చాను. ప్రజలు ఏ నమ్మకంతో గెలిపించారో ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రాఫిట్‌లో నడవాలని మేం అందరం కోరుకుంటున్నాం. విశాఖ స్టీల్ కోసం రూ.14వేల కోట్లు ఖర్చుచేయడం జరిగింది. మూడో బాయిలర్ కూడా మేం యాక్టివేట్ చేశాం. ఫుల్ ప్రొడక్షన్‌కు మేం తీసుకువచ్చాం. గతంలో కూడా ఇదే పరిస్థితి వస్తే వాజ్‌పేయి, చంద్రబాబు కలిసి విశాఖ ఉక్కును కాపాడారు. ఈ రోజు మోడీ, చంద్రబాబు కలిసి విశాఖ ఉక్కును కాపాడుతున్నారు. అపోహాలు అవసరం లేదు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగదు, జరగనివ్వం. కానీ విశాఖ ఉక్కు ప్రాఫిట్‌లో నడవాలని మేం అందరం కోరుకుంటున్నాం. సిపిఎం సోదరులకు స్క్రిప్ట్ ఎక్కడి నుంచి వచ్చిందో వారే దానికి సమాధానం చెబితే బాగుంటుంది. ఆర్థిక రాజధాని విశాఖపట్నం. ఇందులో ఎలాంటి సందేహం లేదు. నాడు, నేడు, ఎప్పుడూ అదే మా నినాదం. దానికి కట్టుబడి ఉన్నాం. అందుకే పెద్దఎత్తున పెట్టుబడులు ఇక్కడకు వస్తున్నాయి. క్లస్టర్ బేస్ డెవలప్ మెంట్ మా విధానం. అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తున్నాం.

అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలనేది కూటమి ప్రభుత్వ నినాదం. అమరావతి, విశాఖ, తిరుపతి ఎకనామిక్ రీజియన్ లను సమగ్రంగా అభివృద్ధి చేసే బాధ్యత మేం తీసుకుంటాం. టాప్100 ఐటీ కంపెనీలను విశాఖకు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. చేసి చూపిస్తాం. డేటా సెంటర్ పనులు రెండు, మూడు నెలల్లో ప్రారంభమవుతాయి..

మధురవాడలో డేటా సెంటర్ పనులు రెండు, మూడు నెలల్లో ప్రారంభమవుతాయి. భోగాపురం ఎయిర్ పోర్ట్‌కు రోడ్డు కనెక్టివిటీని అభివృద్ధి చేయడం జరుగుతోంది. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం పూర్తి అయినప్పుడు రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తికాలేదు. అలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తాం. ఇది నిరంతర ప్రక్రియ. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్‌ను ట్రిలియన్ డాలర్ ఎకానమీగా మార్చాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. వైసిపి హయాంలోనే 108 వాహనాలు మూతపడ్డాయి తప్ప కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కటి కూడా మూసివేయలేదు. చట్టబద్ధత ఉంది కాబట్టే గత ప్రభుత్వం రాజధాని అమరావతిని తరలించలేకపోయింది.

చట్టబద్ధత ఉంది కాబట్టే గత ప్రభుత్వం రాజధాని అమరావతిని తరలించలేకపోయింది. ఆనాడు ముందు చూపుతో చంద్రబాబునాయుడు భూముల విషయంలో రైతుల పక్షాన అగ్రిమెంట్ చేశారు. అందుకే రాజధానిని తరలించలేకపోయారు. ఈ రోజు అమరావతి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అమరావతిలో కూడా అద్భుతమైన ఎయిర్ పోర్ట్ చాలా అవసరం. అందుకే భూములు తీసుకుని మౌలిక సదుపాయాలు, స్పోర్ట్స్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

ఫీజు రీయింబర్స్ మెంట్ విషయంలో విద్యార్థులు ఆందోళనకు గురికావద్దు. విద్యార్థులకు, ఫీజు రీయింబర్స్ మెంట్ కు ఎలాంటి సంబంధం లేదు. వారు హాయిగా వెళ్లి చదువుకోవచ్చు. మేం కాలేజీ అకౌంట్లకే నేరుగా నగదు జమచేస్తున్నాం. రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఇండియన్ ఉమెన్ క్రికెట్ టీమ్‌ను అందరికంటే ముందు కలిశాను. మిథాలీ రాజ్‌ని ఎసిఎ అడ్వైజర్‌గా నియమించాం. "షీ ప్లేస్" అనే కార్యక్రమాన్ని రూపొందించాం. ఇదో నిరంతర ప్రక్రియ. క్రీడల కోసం ఆస్ట్రేలియాలో గ్రిఫిట్ అనే యూనివర్సిటీ ఉంది. ఇక్కడున్న యూనివర్సిటీలతో గ్రిఫిట్ యూనివర్సిటీని అనుసంధానించి ఎకో సిస్టమ్ ఏర్పాటుచేస్తామన్నారు.

# పల్లెల్లో సంక్రాంతి శోభ షురూ!

>> బద్ధంగా, నయనమనోహరంగా నిర్వహించారు. నిజానికి సంక్రాంతి అంటే ఇంత అందంగా ఉంటుందా? అనిపించేలా మహిళలు ఆడుతూ పాడుతూ ఈ వేడుకలను జరిపారు. ఇదిలా ఉండగా పశ్చిమ గోదావరి జిల్లాలో సంక్రాంతి సందర్భంగా కోడి పందాలకు ముమ్మర సన్నాహాలు జరుగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో పందెం లక్ష రూపాయలు నుంచి ప్రారంభమయ్యే భారీ బరులు (అరెనాలు) 200 నుంచి 250కి పైగా ఏర్పాటు చేస్తున్నారని సమాచారం. ప్రధానంగా భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు, దుగ్గిరాల వంటి ప్రాంతాల్లో మినీ స్టేడియం తరహాలో వేదికలు సిద్ధమవుతున్నాయి. పందెం రాయుళ్లు మరియు నిర్వాహకులు సకల హంగులతో ఏర్పాట్లు చేస్తున్నారు. భీమవరంలో అయితే సెలబ్రిటీలు పాల్గొనే కోడి పందేల బరుల్లో ఎల్ఇడి స్క్రీన్లు, విఐపి గ్యాలరీలు, బఫే భోజనాలు, లైవ్ కామెంటరీతో హంగులు ఉంటాయి. దగ్గరగా చూసేందుకు కొన్ని చోట్ల టికెట్లు (రూ.1500 వరకు) కూడా విక్రయిస్తారు. గతేడాది ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే రూ.150 నుంచి 200 కోట్ల పందేలు జరిగినట్టు అంచనా, ఉభయ గోదావరి జిల్లాలు కలిపి రూ250-700 కోట్లు, రాష్ట్రవ్యాప్తంగా రూ.1000 కోట్లకు పైగా పందెలు జరిగిందని అంచనా. ఈసారి అంతకంటే ఎక్కువగా ఉండవచ్చుని అంచనా.

**విదేశాల నుంచి సైతం...**

ఎప్పటిలాగే గోదావరి జిల్లాల్లో జరిగే సంక్రాంతి పండుగకు విదేశాల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక నుంచి పందెం రాయుళ్లు రావడం విశేషం.రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు, ఎన్నారైలు,



కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రులో గంగిరెద్దుల పలకరింపు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పాల్గొనే బరులు కోనసీమ జిల్లాల్లో కొబ్బరి తోటలు, పొలాల్లో రహస్యంగా ఏర్పాటు చేస్తారు. కోడి పందాలు భారతదేశంలో చట్టవిరుద్ధం. ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాల్టీ టు యానిమల్స్ యాక్ట్ 1960 సెక్షన్ ప్రకారం పక్షులను జంతువులను హింసించకూడదని చట్టం. సుప్రీం కోర్టు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాలతో నిషేధం ఉన్నప్పటికీ, సంప్రదాయం పేరుతో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. పోలీసులు కట్టడి చేయడానికి ప్రయత్నిస్తున్నారు, కానీ పూర్తిగా ఆపడం వారి వల్ల కావడంలేదు. ఇదిలా ఉండగా ఈ కోడి పందేలు కొన్ని ప్రాంతాల్లో కత్తులు లేకుండా (కాలి గోరుతో మాత్రమే) పందాలు నిర్వహించే విధానం ఉన్నప్పటికీ దాదాపు అన్నిచోట్ల కత్తులు కట్టి జరుగుతాయి.

**కుటీర పరిశ్రమగా పందెం కోళ్ల పెంపకం**

పశ్చిమగోదావరి జిల్లాల్లో పందెం కోళ్ల పెంపకం కుటీర పరిశ్రమగా భావిస్తారు. ఒక్కో వ్యక్తి దగ్గర సుమారు పదుల్లో, వందల్లో కూడా అన్ని జాతుల కోడి పుంజులు ఉంటాయి. ప్రధానంగా భీమవరంతో పాటు చుట్టుపక్కల గల ప్రాంతాలు వెంప, మొగల్తూరు, పేరుపాలెం, మంచిలి, నరసాపురం, కైకలూరు, ఆకివీడు ప్రాంతాల్లో లక్షలు విలువ చేసే కోడి పుంజులను పెంచుతారు. వీటిలో నెమలి, అబ్రస్, రెడ్ ఈగిల్, కక్కెర వంటి రకాలకు మంచి డిమాండ్ ఉంటుంది. వాటి ధరలు రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకూ ఉంటుంది. కోళ్ల పెంపకందారులు పుంజులకు దసరా నుంచే శిక్షణ, ప్రత్యేక ఆహారం ఇస్తారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసు శాఖ నుంచి పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఈసారి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కోడి పందేలను నిలువరించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. కొన్నిచోట్ల డ్రోన్లు, స్పెషల్ టీములతో నిఘా, రైడ్లు, బరులు ధ్వంసం, నోటీసులు, బైండోవర్ కేసులు వంటి చర్యలతో సిద్ధంగా ఉన్నారు. ఏది ఏమైనా చట్ట ప్రకారం కోడిపందాలను అడ్డుకుంటారో లేక ఎప్పటిలాగే చేతులెత్తేస్తారో అనేది వేచి చూడాలి.



## అప్పలనాయుడు కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి లోకేష్

**విశాఖపట్నం, జనవరి 7 ప్రభాతవార్త:** ఇటీవల అనారోగ్యంతో మరణించిన టిడిపి నేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాగవంశం అధ్యక్షులు గాడు అప్పలనాయుడు కుటుంబాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలోని అప్పలనాయుడు నివాసానికి మంత్రి వెళ్లారు. ఈ సందర్భంగా గాడు అప్పలనాయుడు చిత్రపటం వద్ద పూలు ఉంచి నివాళి అర్పించారు. అనంతరం గాడు అప్పలనాయుడు సతీమణి, జివిఎంసి రెండో వార్డు కార్పోరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గాడు చిన్ని కుమారి లక్షి  ్మతో పాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. భవిష్యత్‌లో కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# అదుపులోకి బ్లోఅవుట్

>> మంటలు అదుపు లోకి వచ్చాయని త్వరలో బోరు బావికి క్యాపింగ్ పనులు చేపడతారని ఆయన వెల్లడించారు. 10 మీటర్ల వ్యాసార్థం లో బృందాల నియంత్రణ చర్యలు కొనసా గుతున్నాయన్నారు. బ్లో అవుట్ మూలంగా ఏర్పడిన ఆస్తి నష్టాలపై అంచనాలు గణన ప్రారంభమైందని, అదేవిధంగా నాలుగు గ్రామాల ప్రజలకు సహాయం అందించేందుకు గణాంకాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాజోలు శాసన సభ్యులు దేవ వరప్రసాద్ ప్రసంగిస్తూ గ్యాస్ లీక్ అయిన ఇరుసుమండ ప్రక్క మూడు గ్రామాల ప్రజలు భీతావాహులై భయాందో ళనలకు గురికా బడ్డారని, వీరిలో 102 సంవ త్సరాల వయసున్న వృద్ధులను గర్భిణీ స్త్రీలను, కాలు విరిగి సిమెంట్ కట్టలతో జీవిస్తున్న వారు హుటా హుటీనా ప్రాణ భయంతో అర్థగంట పక్క గ్రామా లకు భద్రతా పరంగా చేరు కోవ డం ఆశ్చర్యాన్ని కలిగించింద న్నారు. ఇరుసమండ బ్లో అవుట్ ప్రాంతం వద్ద బుధవారం సాయంత్రం స్థానిక ప్రజలు నిరసనకు దిగడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. గో బ్యాక్ ఓయిన్జీసీ, గో బ్యాక్ ఓయిన్జీసీ అంటూ నినాదాలు స్థానిక మహిళలు, పలు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తొలుత ఇరుసుమండ గ్రామ పంచాయతీ వద్ద గ్రామస్తులు సమావేశం అయ్యారు . ఓయిన్జీసీ వాళ్లు ఇచ్చే నష్టపరిహారంపై చర్చించుకున్న గ్రామస్తులు, పరిహారం కంటే ముఖ్యంగా ఈ ప్రాంతం నుంచి ఓఎన్జీసి తరలి వెళ్లిపోయేలా ఒత్తిడి చేయాలని నిర్ణయించారు. అనంతరం మహిళలు, స్థానికులు ప్రజలు బ్లో అవుట్ ప్రాంతానికి వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఈ ప్రమాదం జరిగిన సమయంలో తీవ్ర ఆందోళన చెందామని, ప్రాణ భయంతో అన్ని వదులుకొని పరుగులు తీశామని తెలిపారు. వెంటనే ఇక్కడ ఓయిన్జీసీ కార్యకలాపాలు మానేసి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. ఈ ఓయిన్జీసీ కార్యకలాపాలు వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు.

# ఫిబ్రవరి ఒకటినే కేంద్ర బడ్జెట్..

## తేదీని మార్చకూడదని కేబినెట్ కమిటీ నిర్ణయం

**న్యూఢిల్లీ, జనవరి 7:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈనెల 28నుంచి ప్రారంభం కానున్నాయి. రెండు విడతలుగా ఈసమావేశాలు జరుగుతాయి. ఏటా జరిగినట్లుగానే ఈసారి కూడా ఫిబ్రవరి ఒకటవ తేదీ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ప్రవేశపెట్టాలనినిర్ణయించింది. దీనిపై కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆధ్వర్యంలోని పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్‌కమిటీ నిర్ణయం తీసుకోవాలి. ఫిబ్రవరినెల చివరిరోజు బడ్జెట్‌ప్రవేశపెట్టే సాంప్రదాయం నుంచి 2017నుంచి ఫిబ్రవరి ఒకటవ తేదీకి మార్చారు. ఈ సారి ఒకటవ తేదీ ఆదివారం కావడంతో బడ్జెట్ తేదీపై ఆసక్తి నెలకొంది. స్టాక్‌మార్కెట్‌సహా ఇతర ఆర్థిక కార్యకలాపాలేవీ కూడా ఆరోజు జరగవు. అయితేఈ తేదీని మార్చకూడదని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. 28న ప్రారంభించి ఆరోజు ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం ఉంటుంది. 29న ఆర్థికసర్వే ప్రవేజవపెట్టే అవకాశం ఉంది. జనవరి 30,31 తేదీల్లో సెలవులున్నాయి. రెండోదశ సమావేశాలు మార్చి 9 నుంచి ఏప్రిల్ రెండువరకూ జరుగుతాయనిచెపుతున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్‌నుప్రవేశపెట్టానున్నారు. అత్యధిక బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రిగా మొరార్జీ దేశాయ్‌రికార్డు ఉంది. రెండు దఫాల్లో ఆయన పదిసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు పార్లమెంటు రికార్డు ఉంది.

# నేటి నుంచి 'ఆవకాయ్'

>> కరంగా సాగనుంది. సందర్శకులకు ప్రవేశం ఉచితం..మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి కాట, అధికారులు ఏర్పాట్లను దగ్గరుండి పూర్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్, ఎండి ఆమ్రపాలి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ  శ, టీం వర్క్స్ ఆర్ట్స్ ప్రతినిధి సయ్యద్ శ్యామ్స్ జావిద్ తదితరులు పున్నమి ఘాట్, భవాని ఐలాండ్ లలో పర్యటించి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా హౌస్ బోట్లు, రొమాంటిక్ ఫ్లోట్ అండ్ డైన్ ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రయల్ రన్ గా ప్రారంభించిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నదీ తీరాల్లో ఈ తరహా హౌస్ బోట్స్ ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రాన్ని ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ లక్షమన్నారు. సాంకేతికతతో కూడిన ఆర్థిక వృద్ధిని సాధిస్తూనే, రాష్ట్ర సంస్కృతిని కాపాడుకోవాలనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దూరదృష్టికి ఈ ఉత్సవం ఒక నిదర్శనమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ ఫెస్టివల్ లో సినిమా, సాహిత్య రంగాలకు చెందిన దిగ్గజాలు, ప్రపంచవ్యాప్త కళాకారులు పాల్గొననున్నారు. ప్రధానంగా హెరిటేజ్ వాక్ తో పాటు ఘాట్ ఫెర్రీ ప్రయాణం, ఫుడ్ ఫెస్టివల్ తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. ప్రముఖ గాయకులు జావేద్ అలీతో సంగీత కచేరి ఉండనుంది. వైవిధ్యభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు, సినిమా చర్చలు మరియు సాహిత్య గోష్టులు సందర్శకులను అలరించనున్నాయి.

## వారం - వర్జ్యం

08-01-2026, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయనం
హేమంత ఋతువు, కృష్ణపక్షం, పూర్వాషాఢ రాత్రి
షష్ఠి పూర్తి
పూర్వఫల్గుణి మ.12.28
వర్జ్యం : రా.8.04-9.44
దు.ము.10.23-11.08, 2) మ.2.52-3.37
రాహుకాలం - మ.1.30-3.00

## వారఫలం

మేషం : జీవిత భాగస్వామి సహాయ సహకారాలను అందుకుంటారు. కొత్త పెట్టుబడులు అనుకూలంగా వుంటాయి.

వృషభం: భూములకు సంబంధించి వివాదాలు తొలుగుతాయి. నూతన ఒప్పందాలు కుదురుతాయి.

మిథునం: వ్యాపారస్తులకు లాభాలు రాబోతున్న రూపంలో ఉంటాయి. ఉద్యోగస్తులకు బదిలీలు.

కర్కాటకం: రాజకీయ రంగప్రవేశం చేయాలనుకునే మీ ఆలోచనలు ఫలిస్తాయి. క్రయ విక్రయాలలో లాభాలు.

సింహం: మీకు రావలసిన ప్రయోజనాలను పోరాడి సాధించుకోవలసి వస్తుంది. స్థలాలు కొనుగోలు యత్నాలు.

కన్య : ఆకస్మిక విషయాల ప్రభావం వృత్తి, వ్యాపారాల పైన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోగలుగుతారు.

తుల : సహోదర వర్గం వలన చికాకులు ఏర్పడతాయి. రచనా వ్యాసంగాలను సాగిస్తారు. కోర్టు కేసులు వాయిదాపడతాయి.

వృశ్చికం: స్వార్థ బుద్ధితో మీతో స్నేహం నటిస్తున్న వారిని గుర్తించి, వారిని దూరంగా ఉంచుతారు క్రయ విక్రయాలలో లాభాలు.

ధనుస్సు: కాంట్రాక్టు పనులలో ప్రత్యక్ష పర్యవేక్షణ అవసరమవుతుంది, పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

మకరం: ముఖ్యులతో చర్చలు. సంతానము భవిష్య కార్యక్రమాలకు సంబంధించిన అంశాలు ముఖ్యమైన అంశాలతో ముడిపడ్డాయి.

కుంభం: విజ్ఞాన సంబంధిత అంశాల వల్ల ఆకర్షితులవుతారు. రహస్యమైన ఒప్పందాన్ని కుదుర్చుకుంటారు.

మీనం : దాన, ధర్మాలు చేస్తారు. నేత వృత్తి పనివారికి అనుకూలంగా ఉంటుంది. రాజకీయ విజయాలు.

- శ్రీమతి ముదునూరు శ్రీలక్ష్మి, బీకాం, హైదరాబాద్

## అమరావతికి చట్టబద్ధత కల్పించండి


### జిరామ్‌జి స్కీం నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఆర్థిక సాయం అందించండి

### కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీలో సిఎం చంద్రబాబు విజ్ఞప్తి

**విజయవాడ, జనవరి 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ఖరారుచేస్తూ పార్లమెంటులో బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను సీఎం చంద్రబాబు నాయుడు కోరారు. బుధవారం పోలవరం పర్యటన ముగించుకుని ఢిల్లీ వెళ్లిన ఏపీ సీఎం కేంద్ర హోం మంత్రితో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై వీరిద్దరూ చర్చించుకున్నారు. అమరావతికి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని ఈ సందర్భంగా సీఎం కోరారు. దీని వల్ల రాష్ట్రంలో మరింత అభివృద్ధి జరగడంతో పాటు... రాష్ట్ర ప్రజల ఆశ నెరవేర్చినట్టు అవుతుందని చెప్పారు. అలాగే ఇటీవల ఉపాధి హామీ పథకం స్థానంలో తెచ్చిన జీ రామ్ జీ పథకంలోని కొన్ని అంశాల నుంచి రాష్ట్రానికి వెసులుబాటు కల్పించాలని ముఖ్యమంత్రి కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటాను 60:40 నిష్పత్తికి మార్చడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఏపీపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అమిత్ షాకు సీఎం వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ ఆర్థిక వెసులుబాటు కల్పించాలని కోరారు. ఆర్థికంగా కుదేలైన రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు కేంద్రం ఇప్పటికే సహకరిస్తోందని... ఇదే తరహా సహకారాన్ని కొనసాగించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఇక రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రామాలు, తాజా పరిణామాలపై వీరిద్దరు చర్చించుకున్నారు.

## నైతిక విలువలతో కూడిన విద్య అత్యంత అవసరం: ఉప శాసనసభాపతి

**విజయవాడ,జనవరి7,ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తమ,నైతిక విలువలతో కూడిన విద్య ఇప్పటి సమకాలీన సామాజిక వ్యవస్థకు అత్యంత అవసరమని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనమూరి రఘురామకృష్ణరాజు అన్నారు.గ్రామీణ ప్రాంతాలు విద్యాపరంగా అభివృద్ధి సాధించినప్పుడే సుస్థిర ప్రగతి సాధ్యమన్నారు.విద్యను అభ్యసించడానికి పడిన కష్టాలు గుర్తెరిగిన ఉపాధ్యాయులే మంచి వ్యక్తిత్వంతో తీర్చిదిద్దుతున్నారన్నారు.ఎన్టీఆర్ జిల్లా నందిగామలో కాకతీయ,అపోలో విద్యాసంస్థల 40వ దశాబ్ది ఉత్సవాలను ఆయన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.ఈ సందర్భంగా రైతాంగం అధికంగా ఉండే ప్రాంతాల్లో విద్యావ్యాప్తి అవసరమన్నారు.దీని వలన ఉన్నత స్థాయి ఫలితాలు సాధించవచ్చునన్నారు. అత్యంత విలువలతో కూడిన బోధనను అందించినందు వలనే కాకతీయ-అపోలో పాఠశాల విద్యార్థులు ప్రపంచంలోని అన్ని కీలక దేశాల్లో అడుగుపెట్టి,వారి అభిరుచికి అనుగుణమైన రంగాల్లో స్థిరపడ్డారన్నారు.శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య ఈ పాఠశాల విద్యార్థిని కావడాన్ని బట్టే ఇక్కడ మానవీయ విలువలుతో పాటు ప్రశ్నించే తత్వాన్ని పెంచుతారని అర్ధమైందన్నారు.గ్రామీణ ప్రాంతానికి చెందిన ఒక విద్యాలయం ఏటా వందలాది మంది విద్యార్థుల టెన్త్ పరీక్షలకు పంపి,రాష్ట్రస్థాయిలో ఫలితాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకులు కాపా రవీంద్ర బాబు, పాఠశాల పూర్వ విద్యార్థిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, కెవిఆర్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ కేజీ తిలక్ తదితరులు మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులు తీర్చి దిద్దిన ఘనత కాకతీయ విద్యాసంస్థలు దక్కింది.భారత దేశంలో కాకుండా ప్రపంచ నలుమూలల అమెరికా, లండన్, కెనడా, ఆస్ట్రేలియా ఇలా ఎన్నో దేశాల్లో మా విద్యార్థులు స్థిరపడ్డారు.



కాకతీయ- అపోలో నాలుగు దశాబ్దాల ఉత్సవాలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన రఘురామ

ఇంజినీర్లుగా, డాక్టర్లుగా. చలనచిత్రరంగంలోను. రాజకీయాల్లో రాణిస్తున్నారన్నారు. వ్యవస్థాపకులు రవీంద్రనాథ్, భారతీ నాథ్ మాట్లాడుతూ కాకతీయ విద్యాసంస్థలు ఇంతా అభివృద్ధి చెందింది. ఉపాధ్యాయులకు కృషి ప్రాధాన్యత ఎంతో ఉంది.2019 కాకతీయ విద్యాసంస్థలను విద్యార్థుల తల్లిదండ్రుల మేరకు సిబిఎస్ ప్రవేశం పెట్టాడం జరిగింది. కుటుంబం కాకతీయ అపోలో సంస్థల విద్యార్థులు అభివృద్ధికి ఎంతో కృషి చేశారు.కాకతీయ విద్యాసంస్థల్లో చదవే పిల్లలు అందరూ రైతు కుటుంబంలో నుంచి వచ్చిన వారు ఉన్నారు.కాకతీయ అపోలో విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు ఎక్కడ ఉన్న ఒక బ్రాండ్ ఇమేజ్ ఉందన్నారు. స్కూల్ తరపున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో పిల్లలు ప్రదర్శించిన ఆటలు పాటలు.సంప్రదాయక నృత్యాలు,ఆధునీక డాన్సులు, నాటకాలు ఎంతగానో అలరించాయి.



## అమరావతి రాజధాని విస్తరణ, నిర్మాణం కోసం భూములు ఇస్తున్న రైతులకు రుణాల మాఫీ

### - మంత్రి పి.నారాయణ

**విజయవాడ.జనవరి7ప్రభాతవార్తప్రతినిధి:**అమరావతి రాజధాని విస్తరణ,నిర్మాణం కోసం భూములు ఇస్తున్న రైతులకు వాటిపై ఉన్న రుణాలను మాఫీ చేస్తామని పురపాలక పట్టణాభివృద్ధిశాఖా మంత్రి పొంగూరు నారాయణ అన్నారు.రాజధాని అమరావతిలో రెండో విడత భూ సమీకరణ బుధవారం ప్రారంభమైంది. తుళ్లూరు మండలం వడ్డమానులో స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తో కలిసి మంత్రి నారాయణ ఈ ప్రక్రియను ప్రారంభించారు. రైతుల నుంచి అంగీకార పత్రాలను అధికారులు స్వీకరిస్తున్నారు. అమరావతి మండలం ఎండ్రాయిలో సాయంత్రం గ్రామ సభ నిర్వహించనున్నారు. తుళ్లూరు, అమరావతి మండలాల్లోని ఏడు గ్రామాల రైతుల నుంచి ప్రభుత్వం 16,666.57 ఎకరాలను సర్కార్ సమీకరించనుంది. తుళ్లూరు మండలంలోని వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి, అమరావతి మండలంలోని వైకుంఠపురం, పెదమద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి గ్రామాల్లో ప్రభుత్వం ఇప్పుడు భూసమీకరణ చేపట్టింది. అంతర్జాతీయ విమానాశ్రయం, క్రీడానగరం, స్మార్ట్ పరిశ్రమలు, రైల్వేట్రాక్, ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం ఈ భూములు తీసుకుంటోంది. రైతులకు స్థలాలు కేటాయించే లే ఔట్ల అభివృద్ధికి అథారిటీ ఈసారి కీలక నిర్ణయం తీసుకుంది. లే ఔట్లలో మొదట రెండు వరుసల రహదారులు, విద్యుత్ లైన్లు వేసి వీలైనంత త్వరగా రైతులకు స్థలాలు అప్పగించనుంది. గతంలో భూసమీకరణలో భాగంగా స్థానిక రైతులకు రుణమాఫీ చేశామన్నారు. ఇప్పుడు కూడా రుణమాఫీ చేయాలని ఎమ్మెల్యే శ్రావణ్ అడిగారని, సిఎం చంద్రబాబుతో ఈ విషయమై మాట్లాడానని తెలిపారు. ముఖ్యమంత్రి దీనికి అంగీకరించారనీ, 6 వరకు రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయనున్నారు.

# మిర్చి ధరల స్థిరీకరణకు ముందస్తు చర్యలు

### - మిరప రైతులకు భరోసా.. ఇక్రాప్ 100 అమలుకు చర్యలు - రసీదులు, మౌలిక వసతులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి: మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ,జనవరి7,ప్రభాతవార్తప్రతినిధి:**మిర్చి ధరల విషయంలో గతేడాది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో, ఈసారి అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడానికి కార్యాచరణ చేపడుతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇందు కోసం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించామని ఈ ఏడాది మిర్చి ధరలు ఆశాజనకంగా ఉన్నాయని చెప్పారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. గతేడాది ధరలు అధికంగా ఉండటంతో రైతులు విపరీతంగా మిర్చి సాగు చేశారని, దాని ప్రభావంతో మార్కెట్లో సమస్యలు ఏర్పడ్డాయని వివరించారు. ఎంత విస్తీర్ణంలో మిర్చి సాగు చేస్తే ధరలు నిలకడగా ఉంటాయో రైతులకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టంగా సూచించారని మంత్రి తెలిపారు. గత ఏడాది క్వింటాల్ కు రూ.11,750 మద్దతు ధర ఉందని చెప్పారు. ఈ ఏడాది 44 శాతం వరకు ఉత్పాదకత తగ్గిందన్నారు. క్రయ విక్రయాలకు అనుకూల వాతావరణం ఏర్పాటుకు సమావేశం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. గత ఏడాది 1.96 లక్షల హెక్టార్లలో పండించడం జరిగిందని, ఈ ఏడాది 1.06 లక్షల హెక్టార్లలో పండించడం జరిగిందని వివరించారు. డిసెంబర్ నుండి జూన్ వరకు పంట మార్కెట్ కు వస్తుందని తెలిపారు. 13.88 లక్షల మెట్రిక్ టన్నుల నిలువ సామర్థం ఉందన్నారు. గత ఏడాది 6.62 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పాదకత ఉండగా, ఈ ఏడాది 5.39 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పాదకత ఉందని చెప్పారు. సీజన్ లో 45 వేల నుండి 55 వేల బస్తాలు మొత్తంగా లక్ష బస్తాలు వస్తాయని తెలిపారు. తేజ రకం మినహా మిగిలిన రకాలకు ధరలు ఆశాజనకంగా ఉందన్నారు. మార్కెట్ ఫీజు రూ.85.37 కోట్లు వసూలైందని తెలిపారు. కొంతమంది రైతులు మిర్చి నుంచి మొక్కజొన్న సాగుకు మళ్లారని తెలిపారు. రైతులు పండించే పంటలకు సరైన ధరలు రాక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించి ధరలను బట్టి పంటలను పండించేలా ఒక క్లస్టర్ విధానాన్ని తీసుకొచ్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారని తెలిపారు. వీటిపై రైతులకు పూర్తి అవగాహన కార్యక్రమాలు అధికారులు చేపట్టాలని సూచించారు. ఈ ఏడాది కోల్డ్ స్టోరేజీలలో నిల్వ ఉంచిన మిర్చికి రుణాలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా మిర్చి మార్కెట్ యార్డులకు వస్తోందని, స్థానిక రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా లావాదేవీలపై పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు.

మిర్చి సాగు చేసిన రైతుల వివరాలను పూర్తిగా రికార్డు చేస్తున్నామని, నూటికి నూరు శాతం ఇ-క్రాప్ నమోదు జరుగుతోందని మంత్రి స్పష్టం చేశారు. అలాగే నల్లి తామర వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు తగిన నివారణ చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

# తిరుమల సమాచారం

## టిటిడి జూనియర్ కళాశాలల్లో డేస్కాలర్స్‌కు మధ్యాహ్న భోజనం



**తిరుమల,జనవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న డేస్కాలర్స్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకం అమలుచేశారు. ఈ పథకాన్ని తొలిరోజు బుధవారం ఉదయం తొలుత ద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ప్రారంభించారు. పద్మావతీ మహిళా జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు చేసుకుంటూ విద్యను అభ్యసించాలని ఛైర్మెన్ నాయుడు కోరారు. పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన టిటిడి ఛైర్మెన్ డే స్కాలర్స్ కి మధ్యాహ్న భోజన పథకాన్ని అందించారు. ఈ దశలో మీరు వేసే ప్రతి ప్రయత్నం, తీసుకునే ప్రతి నిర్ణయం జీవితాన్ని ఉన్నత స్థాయిలో నిలబెడుతుందన్నారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టినా నిరాశపడకుండా కష్టంతో టిటిడి ఛైర్మెన్ స్థాయికి వచ్చానన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని, అవి సాధించే వరకు ప్రయత్నం ఆపరాదని విద్యార్థినులకు సూచించారు. వందశాతం ఫలితాలు సాధించి టిటిడి సంస్థకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. పద్మావతీ మహిళా జూనియర్ కళాశాలలో డే స్కాలర్స్ కు కల్పించిన సదుపాయం ద్వారా 436 మంది విద్యార్థినులకు లబ్ధి చేకూరుతుందని ఛైర్మన్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ,జి. భానుప్రకాష్ రెడ్డి, శాంతారామ్,నరేష్ కుమార్, టిటిడి డిఇఒ డాక్టర్ టి. వేంకట సునీలు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. భువనేశ్వరి కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు ఆనందం

### - మారిషస్ అధ్యక్షుడు ధరమ్‌బీర్‌గోకుల్



రంగనాయకుల మండపంలో టిటిడి ఆలయ అధికారులతో మారిషస్ అధ్యక్షుడు గోకుల్

**తిరుమల,జనవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దివ్య మంగళ రూపం దర్శనంతో మనసు ఆనందంగా ఉందని మారిషస్ దేశ అధ్యక్షుడు ధరమ్ బీర్‌గోకుల్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఆనంద నిలయంలో పవిత్రమైన వైకుంఠ ద్వార దర్శనంలో కలియుగప్రత్యక్ష దైవాన్ని దర్శించుకోవడం సంతోషకరమన్నారు. స్వామివారి ఆశీస్సులతో తెలుగు ప్రజలకు. మారిషస్ దేశప్రజలందరికీ శుభాలు కలగాలని, మంచి జరగాలని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. 2026 నూతన ఆంగ్ల సంవత్సరం అందరికీ మంచి జరగాలని, ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలని ఆకాంక్షిం చారు. బుధ వారం ఉదయం మారిషస్ దేశ అధ్యక్షుడు ధరమ్ బీర్‌గోకుల్ దంపతులు, అనుచర గణంతో ఆలయం లోనికి ప్రవేశించారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో మహద్వారం వద్ద టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు,రాష్ట్రమంత్రి ఆనంరామ నారాయణరెడ్డి, టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఇఒ చిరూమామిళ్ళ వెంకయ్య చౌదరి, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉద్యోగస్తురాలి కుటుంబసభ్యులకు రూ.కోటి బీమా చెక్కు అందచేసిన మంత్రి పయ్యావుల



ఉద్యోగస్తురాలి కుటుంబసభ్యులకు బీమా చెక్కు అందజేస్తున్న మంత్రి పయ్యావుల

**విజయవాడ, జనవరి 7 ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రాష్ట్ర సచివాలయం ఆర్థిక శాఖలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసరుగా విధులు నిర్వర్తిస్తున్న ఎన్. కుసుమ కరుణ కుమారి 2025 మే 3న రోడ్డు ప్రమాదంలో అకాల మృతి చెందిన నేపథ్యంలో ఉద్యోగి కుటుంబ సభ్యులకు వ్యక్తిగత ప్రమాద బీమా పథకం క్రింద రూ.1 కోటి బీమా సొమ్ము చెక్కును రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అందజేశారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో పలు ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఎస్బీఐ అధికారులతో జరిగిన సమావేశంలో మంత్రి మృతురాలి కుటుంబ సభ్యులకు బీమా సొమ్ము చెక్కును అందజేసి ప్రభుత్వం తరుపున ప్రగాడ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ. కోవిడ్ సమయంలో పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఏడాదికి సగటున 150 మంది వరకూ మరణించడం తమ ప్రభుత్వం గుర్తించిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అన్ని రకాల లబ్ది చేకూర్చినప్పటికీ, ప్రైవేటు రంగ పరంగా కూడా మరింత లబ్దిని చేకూర్చితే బాగుంటుందనే విషయాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అందరికీ వ్యక్తిగత ప్రమాద భీమా పథకాన్ని వర్తింపచేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఉద్యోగుల సమగ్ర జీత ప్యాకేజీపై గత ఏడాది మార్చి మాసంలో ఎస్‌బీఐ, యుబిఐ, యాక్సిస్ మరియు ఇండియన్ తదితర బ్యాంకులతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. ఈ బ్యాంకులకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను అన్నింటినీ అందజేస్తూ వారి ఖాతాలను అన్నింటినీ శాలరీ ఖాతాలుగా ఆటోమేటిక్ గా మార్చడం జరిగిందన్నారు. ఉద్యోగుల వ్యక్తిగత ప్రమాద బీమా పథకం పై గత ఏడాది మార్చిలో బ్యాంకులతో ఒప్పందం కురుర్చుకున్న రెండు మాసాల్లోనే ఆర్థిక శాఖలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసరుగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీమతి ఎన్. కుసుమ కరుణ కుమారి రోడ్డు ప్రమాదంలో మరణించడం దురదృష్టకరమన్నారు.

# రూ. 3,380 కోట్ల వ్యయంతో రహదారుల నిర్మాణం

## మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి



మీడియా సమావేశంలో మంత్రులు బిసి జనార్ధన్ రెడ్డి, కొల్లు రవీంద్ర

**విజయవాడ. జనవరి 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకే సంవత్సరం రూ.3,380 కోట్ల వ్యయంతో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రహదారుల నిర్మాణము, మరమ్మతు పనులు చేపట్టామని రాష్ట్ర రహదారులు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో రాష్ట్ర రహదారులు భవనాలు, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల శాఖ మంత్రి రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావులతో కలిసి బందరు ఓడరేవు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పనులు రహదారులు భవనాలశాఖ పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తద్వారా రాష్ట్రానికి పలు పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు రావడానికి మార్గం సుగమం చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,081 కోట్ల రూపాయల వ్యయంతో 16వేల కిలోమీటర్ల మేరకు రహదారుల మరమ్మతులు, గుంతలు పూడ్చే కార్యక్రమం పూర్తి చేశామన్నారు. రాష్ట్ర చరిత్రలో ఒకే సంవత్సరం రూ.3,380 కోట్ల వ్యయంతో రహదారుల నిర్మాణం చేపట్టామని, ఇందుకోసం టెండర్లు ఇప్పటికే పిలిచామని, మరికొన్ని ఒప్పందాలు జరుగుతున్నాయని, మరికొన్ని పనులు మొదలయ్యాయనీ చెబుతూ అన్ని కూడా నాణ్యతలో ఏమాత్రం లోటు లేకుండా వచ్చే మే నెల ఆఖరిలోగా పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో 160 కోట్ల రూపాయల వ్యయంతో 1,518 కిలోమీటర్ల మేరకు గుంతలు పడిన రహదారులను పూడ్చటంతో పాటు ఇతర మరమ్మతులను పూర్తి చేయడం జరిగిందన్నారు. అందులో మచిలీపట్నం నియోజకవర్గంలో 33 కోట్ల రూపాయల వ్యయంతో 166 కిలోమీటర్ల రహదారుల మరమ్మతు పనులు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే జిల్లాలో రహదారుల మరమ్మతుకు గాను పామర్రు నియోజక వర్గానికి 28 కోట్ల రూపాయలు, గన్నవరం నియోజకవర్గానికి 27 కోట్ల రూపాయలు, గుడివాడ నియోజకవర్గానికి 16 కోట్ల రూపాయలు, అవనిగడ్డ నియోజకవర్గానికి 20 కోట్ల రూపాయలు, పెనమలూరు నియోజక వర్గానికి 15 కోట్ల రూపాయలు, పెడన నియోజక వర్గానికి 26 కోట్ల రూపాయలు మంజూరు చేశామన్నారు. ఈ నిధులతో పనులు రహదారుల మరమ్మతు పనులు ముమవరంగా ముమ్మరంగా చేపట్టి త్వరలో పూర్తి చేస్తామన్నారు. బందరు ఓడరేవు నిర్మాణాన్ని 50 శాతం పైగా పూర్తయిందని, ఇప్పటిదాకా 1760 కోట్ల రూపాయలు ఖర్చు అయినదని, ఈ సంవత్సరం డిసెంబర్ నాటికి కచ్చితంగా పూర్తి చేస్తామన్నారు. ఇంకా 1700 కోట్ల రూపాయల మేరకు 42 శాతం పని మిగిలి ఉందని ఉందన్నారు.ఇకపై ప్రతినెలా సమీక్షి ంచి ఎంత శాతం మేరకు పని పూర్తయిందో తెలుసుకుంటామన్నారు. గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ నిర్మాణంలో. సాంకేతిక పరంగా కొన్ని సమస్యలు వచ్చాయ, ఈ సంవత్సరం జూన్ నెలాఖరికి పూర్తి చేస్తామన్నారు.. ఈ ప్రాంత వాసి హార్బర్ కోసం కృషిచేసిన పూర్వపు మంత్రి నడికుదుటి నరసింహారావు పేరును హార్బర్ కు పెట్టేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేసి ప్రభుత్వ ఉత్తర్వులను కూడా జారీ చేశారన్నారు.మచిలీపట్నంతో పాటు జిల్లా ప్రజలందరి తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలుపుతున్నామమన్నారు.

## సంక్రాంతి సెలవుల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం

**విజయవాడ,జనవరి7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వ సంక్రాంతి సెలవుల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. కనుమ పండుగకు కుడా పబ్లిక్ హాలీడే ఇస్తూ నిర్ణయంగా తీసుకుంది.జరాష్ట్ర ప్రభుత్వం ఈనెల 16న కనుమ పండుగ రోజును నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం - 1881 కింద సెలవుదినంగా ప్రకటించింది. ఈ మేరకు సాధారణ పరిపాలనా విభాగం మంగళవారం జిఒఆర్‌టి నెంబరు 32ని విడుదల చేసింది. ఈ నెల 14న బోగి,ఈ నెల 15న సంక్రాంతికి ఇప్పటికే ప్రభుత్వం శెలవు ప్రకటించింది.

## లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం

### సిట్ చేతికి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నివేదిక

**విజయవాడ,జనవరి7,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుల మొబైల్ ఫోన్లకు సంబంధించిన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నివేదిక న్యాయస్థానానికి చేరింది. బుధవారం కోర్టు నుంచి ఆ రిపోర్టును సిట్ తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ఆ రిపోర్ట్ ద్వారా ఏం బయట పడుతుందో అని నాయకులు, అధి కారులు ఆందోళన చెందుతున్నారు. లిక్కర్ స్కామ్ బయటపడటంతో గతంలో ఫోన్లను నిందితులు నాశనం చేశారు. ఫోన్లలోని డేటా, కాల్ రికార్డులు, డిలీట్ చేసిన ఫైల్స్ డిజిటల్ ఆధారాలపై ఫోరెన్సిక్ విశ్లేషణ పూర్తయింది.

## శ్రీవాణి టిక్కెట్లు ఇక ఆన్‌లైన్ లోనే రేపటి నుండి తిరుమలలో ఆఫ్‌లైన్‌కు బ్రేక్

**తిరుమల,జనవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో శ్రీవాణి బ్రేక్ దర్శనాలు ఆఫ్‌లైన్‌లో జారీచేసే టిక్కెట్లు ఈనెల 9వతేదీ నుండి ఆన్‌లైన్‌లోకి మార్చేశారు. భక్తులు ఈ టిక్కెట్లను 9వతేదీ నుండి 1+3 విధానంలో టిక్కెట్ బుకింగ్‌కు అనుమతి ఉంటుంది. ఈ ఆన్‌లైన్‌లో 800 టిక్కెట్లను ఉదయం 9గంటలకు విడుదల చేస్తే మధ్యాహ్నం 2గంటల వరకు అందుబాటులో ఉంచుతారు. టిక్కెట్ పొందిన భక్తులు అదేరోజు సాయంత్రం 4గంటలకు దర్శనానికి వెళ్ళాల్సి ఉంటుంది. అదేరోజు ఆన్‌లైన్‌లో ఎక్కడ నుండి పొందాలనేది ఇప్పుడు భక్తులు కొంత అయోమయంలో ఉఆన్నరు. అదేగాక టిక్కెట్ల బుకింగ్‌లో దుర్వినియోగం గాకుండా ఆధార్ ధృవీకరణ, ఫోన్‌నంబర్ వంటి వివరాలు తప్పనిసరి.శ్రీవాణికోసం భక్తులు క్యూలైన్లో నిలబడే అవస్థలు ఉండవు. ఇకవిమానాశ్రయంలో జారీచేసే ఆఫ్‌లైన్ 200 టిక్కెట్లు యధావిధిగా అమలులో ఉంటుంది.

## హైవేల నిర్మాణంలో 2 గిన్నిస్ రికార్డులు నమోదు

### సిఎం చంద్రబాబు హర్షం



**విజయవాడ,జనవరి7.ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి రెండు గిన్నిస్ వరడల్డ్ రికార్డులు నమోదయ్యాయి. ఈ విషయాన్ని ఏపీ సీఎం చంద్రబాబు " ఎక్స్" వేదికగా వెల్లడించారు. భారత జాతీయ రహదారుల సంస్థ రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌లో అద్భుతమైన ఘనతను సాధించింది. బెంగళూరు -కడప -విజయవాడ ఎకనామిక్ కారిడార్ నిర్మాణంలో భాగంగా, కేవలం 24 గంటల వ్యవధిలో నిరంతరాయంగా 28.95 లేన్‌కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించి, 10,675 మెట్రిక్ టన్నుల బిటుమినస్ కాంక్రీటును వేయడం ద్వారా రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సృష్టించింది. ప్రపంచస్థాయి రహదారి మౌలిక సదుపాయాలను నిర్మించాలనే భారత ప్రభుత్వ సంకల్పానికి మరియు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మార్గదర్శకత్వానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. ఈ అసాధారణ విజయం ఇంజనీర్లు, కార్మికులు మరియు ఫీల్డ్ టీమ్‌ల అంకితభావంతో సాధ్యమైందని చంద్రబాబు అన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ నిర్దేశించిన అత్యంత కఠినమైన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూనే ఈ రికార్డును నెలకొల్పడం విశేషం.

# గండికోట ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

## గండికోట ఉత్సవాలపై ప్రచార వీడియో, పోస్టర్ల ఆవిష్కరణ

### జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఇంచార్జి మంత్రి సవిత

**కడప, జనవరి 7 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి పాటుపడాలని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖామంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారసులుగా ఉన్న అధికారులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా తుడిచి పెట్టే లక్ష్యంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకవైపు సంక్షేమ పథకాలను సంతృప్త స్థాయిలో ప్రజలకు అందిస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతోందన్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా స్థాయిలో సక్రమంగా, విజయవంతంగా అమలు చేయడం అధికారుల బాధ్యత అన్నారు. ప్రభుత్వంలో భాగస్వాములైన జిల్లా కలెక్టర్ నుంచి అధికారులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అందరూ జిల్లా అభివృద్ధిలో భాగస్వాములై అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలి. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇరువురూ సమన్వయంతో పనిచేసి పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలు అందించాలన్నారు. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ శాఖల వారీగా జిల్లాలో సాధించిన ప్రగతిని ఇంచార్జి కలెక్టర్ పవర్ పాయింట్ ద్వారా ఇంఛార్జి మంత్రికి వివరించారు. జిల్లాను రాష్ట్రంలోనే మోకా ప్రధాన హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే దిశగా అడుగులేస్తున్నామన్నారు. ప్రస్తుతం రాజంపేట నియోజకవర్గం కూడా జిల్లాలో విలీనం కావడంతో 40 మండలాలతో రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లాగా వైఎస్ఆర్ కడప జిల్లా మారిందన్నారు. జిల్లాలో ప్రధానంగా చీనీ, అరటి, పసుపు, పలు రకాల పూల తోటలు, కూరగాయలు విస్తారంగా సాగు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో అత్యంత విలువైన భూగర్భ గనులు నాపరాయి, ముగ్గు రాళ్ళ గనులు, ఐరన్ ఓర్, ఇసుక వంటి గనులు విస్తారంగా ఉన్నాయన్నారు. జిల్లా ఆర్థిక వ్యవస్థలో ఈ మైన్స్ కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. దేశానికే ఆదర్శవంతంగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ వ్యవస్థ ఒక స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ ద్వారా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అనేక అంశాలపై అధికారులతో సమీక్షి ంచడం జరిగింది. సమస్యాత్మకంగా ఉన్న అనేక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురావడంతో పరిష్కరిస్తామన్నారు. గండికోట ఉత్సవాలపై పోస్టర్, వీడియో ఆవిష్కరణ ఈ నెల 11, 12, 13వ తేదీల్లో గండికోట పర్యాటక క్షేత్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గండికోట ఉత్సవాలకు సంబంధించి జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్. సవిత జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గండికోట ఉత్సవాలు మన జిల్లా సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబింపజేసే వారసత్వ పండుగ అన్నారు. ఈ మూడురోజుల మహోత్సవంలో మన జిల్లా సంస్కృతి, కళలను ప్రపంచ ప్రఖ్యాతం చేసేలా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించారు.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
టెండర్ ప్రకటన నెం. 17/TO/2025-26, తేది: 02.01.2026
కాకినాడ (R&B) డివిజన్‌లో 3 నం. యొక్క పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. అంచనా విలువ: రూ.8.00 లక్షలు 3 పనుల కొరకు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ తేదీ మరియు స్వీకరణ: 11.01.2026 నుండి మ.2.00 గం. తదుపరి వివరాలకు www.eprocurement.gov.in వీక్షించండి. ఫోన్ నెం. 0884-2367626.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, (R&B) డివిజన్, కాకినాడ
DIPR.No.18697/CL/Advt/1/1/2022-23, తేది: 07.01.2026



ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Rayapudi, Amaravati- 522 237 (A.P.)
NIT No. MAU61-USI0HB(OTH)/513/2025-HB/01 Dated: 07.01.2026
E PROCUREMENT SHORT TENDER NOTICE
Name of Work: APCRDA-"Preparation of Parade ground, Parking area & formation of approach roads to venue for Republic Day celebrations-2026 in Amaravati Capital City, Amaravati, APCRDA"- Estimate Cost:Rs.7.80 Crores.
The bid can be downloaded on AP e-procurement portal from 08.01.2026 to 12.01.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid is 12.01.2026 up to 15.00 Hrs, Technical bid opening 12.01.2026 @16.00 Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Chief Engineer,
H & B Offices, APCRDA, Amaravati.



ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ
ప్రాజెక్ట్ ఆఫీసు, రాయపూడి గ్రామం, తుళ్ళూరు మండలం, అమరావతి – 522237
ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత భూ సమీకరణ పథకము
(రూపొందించడం మరియు అమలు) నియమావళి, 2025
నోటిఫికేషన్-I (నిబంధన 19(1) ప్రకారం)
భూ సమీకరణ పథకమును చేపట్టాలనే ఉద్దేశ్యపు బహిరంగ ప్రకటన
ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ.
కాంపిటెంట్ అధికారి అథారిటీ వారి కార్యాలయము భూ సమీకరణ యూనిట్,పెదమద్దూరు గ్రామము.
నోటిఫికేషన్ నెం. 1/2026-LPS తేదీ: 07.01.2026.
ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ చట్టం, 2014 (చట్టం నం. 11 ఆఫ్ 2014) మరియు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత భూ సమీకరణ పథకము నియమావళి, 2025 లోని నియమము 19(1) ప్రకారం సంక్రమించిన అధికారాలను పురస్కరించుకొని కాంపిటెంట్ అధికారి వారు ఈ నోటిఫికేషన్ షెడ్యూల్లో తెలియపరచు విస్తీర్ణం / ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు మరియు పట్టణం ప్రాంత సౌకర్యాల అభివృద్ధి కోనము రాజధాని ప్రాంత భూ సమీకరణ పథకము చేపట్టాలనే ఉద్దేశ్యాన్ని ఇందుమూలంగా తెలియచేస్తున్నారు.
1. ఈ పథకం క్రింద సమీకరించడానికి ప్రతిపాదించబడిన భూములు రాజధాని ప్రాంత పరిధిలోకి వస్తాయి. పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల పథకాలు / రాజధాని ప్రాంత భూ సమీకరణ పథకము కొరకు ఈ భూములు కావలసినందున భూ సమీకరణ ప్రతిపాదించడమైనది. ఈ పథకము ముఖ్య ఉద్దేశ్యము ఒక క్రమబద్ధమైన మరియు భాగస్వామ్య అభివృద్ధి, సమానమైన పునఃపంపిణీ మరియు ప్రణాళికాబద్ధమైన మౌలిక సదుపాయాలు కల్పించే విధముగా చూడడం. 2. ఈ నోటిఫికేషన్ చట్టంలోని సెక్షన్ 55(4) ప్రకారం ఈ పథకాన్ని చేపట్టాలనే ఆసక్తితో జారీ చేయబడినది.
అందువల్ల ఇప్పుడు అథారిటీ ఇందు మూలముగా తెలియజేయడమేమనగా:
3. ఈ భూ సమీకరణ పథకము ప్రయోజనాల కోసం దిగువ షెడ్యూల్లో వివరించిన ప్రాంతాన్ని కేటాయించడం.
4. చట్టంలోని సెక్షన్ 55(4) ప్రకారం భూ యజమానులు, వాటాదారులు మరియు సాధారణ ప్రజల నుండి అభ్యంతరాలు మరియు సూచనలను తీసుకొనుట.
5. ల్యాండ్ పూలింగ్ పథకంలో పాల్గొనడానికి ఇష్టపడుతున్న భూయజమానులు ఈ నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి 30 రోజులలోపు వారి సమ్మతి, ఆధార్-ప్రామాణీకరించబడిన గుర్తింపు మరియు వారి వద్దనున్న భూ యాజమాన్య పత్రాలతో పాటు సక్రమంగా (అన్ని గడులను పూర్తిగా) నింపిన ఫారం-1 ని సమర్పించవలసినదిగా తెలియచేయటమైనది.
బహిరంగ విచారణ మరియు అభ్యంతరాల పరిగణన
6. చట్టంలోని సెక్షన్ 55(5) మరియు 2025 నియమాలలోని 19(3) ప్రకారం, ఈ క్రింద ఇవ్వబడిన 30 రోజుల వ్యవధిలో అథారిటీ ద్వారా విచారణ నిర్వహించబడుతుంది.

| తేదీ | సమయము | గ్రామము | గ్రామ పంచాయతి | ఆవాసము పేరు | విచారణ స్థలము |
|---|---|---|---|---|---|
| 23.01.2026 | 10.00 AM | పెదమద్దూరు | పెదమద్దూరు | పెదమద్దూరు | APCRDA యూనిట్ కార్యాలయము, పెదమద్దూరు |

7. లిఖితపూర్వకంగా లేదా మౌఖికంగా తెలియపరచిన అన్ని అభ్యంతరాలు / సలహాలు పరిగణనలోనికి తీసుకోబడును. అదేవిధముగా ఈ సలహాలను లేదా అభ్యంతరాలను ప్రణాళిక హేతుబద్ధత మరియు ప్రజా ప్రయోజనాల ఆధారంగా అథారిటీ వీటిని అంగీకరించవచ్చును. సవరించవచ్చును లేదా తిరస్కరించవచ్చును.
షెడ్యూల్ - ఎ : భూ సమీకరణ పథకము క్రింద ప్రతిపాదించిన భూ విస్తీర్ణం

| జిల్లా : పల్నాడు జిల్లా | | | మండలం: అమరావతి | | |
|---|---|---|---|---|---|
| వరుస సంఖ్య | గ్రామం పేరు | RSR విస్తీర్ణం (ఎకరాలు) | గ్రామ పంచాయతి పేరు | ఆవాసము పేరు | జనాభా లెక్కల ప్రకారము ఆవాసము కోడ్ నెం. |
| 1 | పెదమద్దూరు | 1145.00 | పెదమద్దూరు | పెదమద్దూరు | 589948 |

షెడ్యూల్ - బి: భూ సమీకరణ పథకము క్రింద గ్రామాల వారీగా ప్రతిపాదించిన భూ విస్తీర్ణం

| జిల్లా : పల్నాడు జిల్లా | | | మండలం : అమరావతి | | | | గ్రామం : యండ్రాయి | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| వరుస సంఖ్య | సర్వే నెం. | సబ్ డివిజన్ నెం. | మొత్తం విస్తీర్ణం (ఎకరాలు) | భూమి వివరము | LPS క్రింద విస్తీర్ణం (ఎకరాలు) | భూ యజమాని పేరు | హద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర |
| భూ సమీకరణ పథకము క్రింద పెదమద్దూరు గ్రామములో ప్రతిపాదించిన భూ విస్తీర్ణం యొక్క వివరములు వెబ్ ల్యాండ్ పోర్టల్ లో అందుబాటులో కలవు. | | | | | | | | | | |

సమర్పించవలసిన వివరములు
8. సమర్పించవలసిన పద్ధతి: కాంపిటెంట్ అథారిటీ కార్యాలయం / గ్రామ సచివాలయం / ఆన్‌లైన్ ద్వారా కూడా (ఈ సౌకర్యం ఉంటే) మీ అభ్యంతరాలు / సలహాలు/ సూచనలు, తెలియజేయవచ్చును.
9. గడువు: ఈ నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి 30 రోజులలోపు.
సంప్రదించవలసిన వారి వివరాలు:
1. పేరు: కె.లలిత
2. హోదా: కాంపిటెంట్ అథారిటీ
3. కార్యాలయ చిరునామా: ఇంటి నెం:3-55, MPP స్కూల్ ఎదురుగా, పెదమద్దూరు గ్రామము, అమరావతి మండలం
4. ఫోన్: 9676257793
జారీ చేసినవారు
కాంపిటెంట్ అధికారి ( అధికృత అధికారి)
ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత భూ సమీకరణ పథకము
పెదమద్దూరు యూనిట్, అమరావతి మండలం, పల్నాడు జిల్లా.

వార్త

వ్యక్తులు ఇతరుల బోధన ద్వారా కంటే తమ కష్టాల ద్వారానే ఎక్కువ నేర్చుకుంటారు.

-వివేకానందుడు

# కోనసీమలో చమురు కుంపటి!

పచ్చని కోనసీమను మరో బ్లోఅవుట్ భయపెడుతోంది. భూగర్భంలో దాగిన సహజవాయు పెల్లుబికినప్పుడు ఎక్కడ ఏమాత్రం లీకయినా మంటలే మంటలు. ఊళ్లకు ఊళ్లు ఖాళీ చేయాల్సిందే. ఆ ప్రాంతంలో జనజీవనం స్తంభించిపోతుంది. చమురు సహజవాయువుల సంస్థ ఆప్రాంతంలో చమురు నిక్షేపాలను వెలికి తీసిన తర్వాత ఎప్పుడో అప్పుడు ఎక్కడో అక్కడ గ్యాస్ లీకై మంటలు వెదజల్లడం సహజం. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలోని మోరి 5 డ్రిలింగ్ సైటులో సోమవారం ఉదయం భీకర ధ్వనితో పేలుళ్లు వెంటవెంటనే ఎగసిన మంటలతో జనం చెల్లాచెదురయ్యారు. అగ్నిజ్వాలలు 30మీటర్ల ఎత్తుకు చేరాయి. వాటినదుపులోకి తేవడానికి పడే కష్టం ఇంతా అంతా కాదు. పట్టపగలు పదకొండున్నర గంటల సమయంలో ఈఉత్పాతం జరిగింది కనుక జనం జాగ్రత్త పడ్డారు కానీ లేకుంటే వారు ఆదమరచి నిద్రిస్తున్న వేళ జరిగి ఉంటే ఏమయ్యేదో ఊహించుకుంటేనే భయమేస్తోంది. కోనసీమ గర్భాన చమురు సహజవాయువులు కొన్ని తరాల వరకు సరిపడే సహజసంపద ఉంది. దీనికోసం కన్నేయని అంతర్జాతీయ సంస్థలు లేవంటే నమ్మాలి. కొన్ని కార్పొరేట్ సంస్థలు కూడా అమాంతం కోనసీమను కబళించాలని చూసాయి. అక్కడ భూగర్భంలో నిక్షిప్తమైన సహజ వనరుల కోసమే. గతంలో ఇదే ప్రాంతంలోని కొమరాడ బావి నుంచి బ్లో అవుట్‌లు జరిగినప్పుడల్లా కోనసీమ ప్రాంత ప్రజానీకం నిద్రలేని రాత్రులు గడిపేది. 1993లో ఆ తర్వాత 1995లో పాశర్లపూడి 19ఎ బావిలో డ్రిల్లింగ్ చేస్తుండగా బ్లో అవుట్ సంభవించింది. మూడోసారి జరిగిన బ్లో అవుట్ పర్యవసానం ప్రాణాలను బలితీసుకొంది. పాశర్లపూడి బ్లోఅవుట్‌లో 65 రోజుల పాటు దేశ విదేశాల్లోని నైపుణ్య సంస్థలన్నీ అక్కడే ఉండి బ్లో అవుట్‌ను లొంగదీసుకునేందుకు విశ్వప్రయత్నం చేశాయి. ఎప్పటికో కానీ లొంగిరాలేదు. ఆ తర్వాత 2014లో మామిడి కుదురు మండలం 'నగరం' గ్రామంలో గెయిల్ కంపెనీపైపు పగిలింది. గ్యాస్ లీకైంది. 22మంది కాలిబుగ్గిపాలయ్యారు. తరచు జరిగే బ్లో అవుట్‌లకు కోనసీమ అలవాటు పడిపోయింది. అయినా చమురు సహజవాయువులసంస్థ గుణపాఠాలు నేర్వలేదు. బ్లో అవుట్‌లు వల్ల జరిగే ఆర్థిక నష్టం ఎంతో చెప్పనలవికాదు. ప్రస్తుతం జరిగిన బ్లో అవుట్ వలన నష్టపోయిన మొత్తం వందల కోట్లలోనే ఉంటుంది. అగ్నికీలలకు ఎన్నో కొబ్బరిచెట్లు మాడి మసైపోయాయి. ఒక్కసారిగా బయటికొచ్చిన మంటలు కార్చిచ్చులా వ్యాపించడం వల్ల ఇరుసుమండ, లక్కవరం గ్రామస్తులు తీవ్ర భయభ్రాంతులైనారు. కొన్ని రిగ్‌లు, లాగింగ్ టూల్స్, భారీ వాహనాలు కాలిపోయాయి. పరిసరాల్లోని పంటలు, ఆక్వా సాగుకు భారీగానే నష్టం వాటిల్లింది.


గ్యాస్ బావి నుంచి ఉధృతంగా బయటికొచ్చిన మంటలు అర్ధరాత్రి కూడా కొనసాగాయి. వీటన్నిటిని అదుపు చేసేందుకు స్థానిక సాంకేతికత ఏమాత్రం సరిపోదు. ఒకప్పుడు 'బాంబేహై'గా ప్రసిద్ధి చెందిన ఆ ప్రాంతంలో బ్లో అవుట్‌లు జరగకుండా సన్నద్ధమయ్యే యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేయలేకపోయింది. బ్లో అవుట్ జరిగిన ప్రాంతంలో అరకిలోమీటరు వరకు '50'డిగ్రీల ఉష్ణోగ్రత వ్యాపించి ఉంది. ఈ సందర్భంగా విద్యుత్‌వైర్లు మాడిపోయి విద్యుత్ ఘాతాల వంటి ప్రమాదాలు జరుగకుండా కరెంటు ఆపారు. బావిలో గ్యాస్ పీడనస్థాయి తగ్గి, మంటలు అదుపులోకి వచ్చే వరకు నియంత్రణ చర్యలు జరుగుతూనే ఉంటాయి. ఆపై బావుల శుద్ధి పునరుద్ధరణ వంటి పనులు పూర్తయ్యేసరికి కనీసం వారం రోజులు పట్టే అవకాశముంది. 1993లో గ్యాస్ నిల్వలు ఏ మేరకు నిక్షిప్తమయ్యాయో తెలుసుకునేందుకు మోరి 5 వెల్‌ని తవ్వారు. 2024లోనే ఈ బావిని డీప్ ఇండస్ట్రీస్‌కు సబ్‌లీజ్‌కు ఇచ్చారు. ఘటన జరిగిన రోజున ఇదే బావిలో 2500మీటర్ల లోతులో ఒక లేయర్‌లో ఎక్స్‌ప్లరేషన్ (వర్క్ ఓవర్ రిగ్)కు ప్రయత్నించారు. దాంతో బావిలో పీడనం పెరిగిపోయింది. ఆ సమయం లోనే పీడనం ఎక్కువై క్రూడాయిల్‌తో కలిసి ఒక్కసారిగా గ్యాస్ ఎగజిమ్మింది. బ్లో అవుట్‌లో కనీసం 500,600 కొబ్బరిచెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రస్తుతం మంటల విస్తరణ ఆగింది. డ్రిలింగ్ నిలిపివేశారు. ప్రస్తుతం ఈ బావిలో 20వేల నుంచి 40వేల క్యూబిక్ వరకు గ్యాస్ ఉందని అంచనా వేస్తున్నారు. ఏ మేరకు మండిపోయిందో తెలిస్తే తప్ప నష్టాన్ని అంచనా వేయలేరు. 1995లో జరిగిన మామిడి కుదురు మండలం పాశర్లపూడిలో అతి పెద్ద బ్లోఅవుట్ జరిగింది. దేశచరిత్రలో ఇదే పెద్ద బ్లో అవుట్. ఎలా అదుపు చేయాలో తెలియక నిపుణులు సైతం తలలు పట్టుకుకూర్చున్నారు. ఎన్నో కోట్ల వ్యయమయ్యింది కూడా. నాలుగైదు దశాబ్దాల క్రితం కోనసీమ అంతర్భాగంలో బావులున్నాయని తెలుసుకోగానే ఆ ప్రాంతం విశ్వవ్యాప్త ఖ్యాతి పొందింది. అప్పట్లో ఎన్నో బావులు తవ్వినా నిరుపయోగంగా ఉన్న వాటిని తర్వాత తర్వాత వినియోగంలో లేని బావులను మూసివేయలేదు. అవి కూడా ప్రమాదమేనని భావించినా అలాంటి రక్షణ చర్యలేవీ ఓఎన్‌జిసి చేపట్టలేదు. ఆనాటి పైప్‌లైన్లే ఇప్పటికీ వినియోగిస్తున్న సందర్భాల్లో వాటిని ఏ సందర్భంలోనూ క్లీన్ చేయలేదు. అలా కాల దోషం పట్టిన బావుల్లోంచి లీకయిన సందర్భాలు ఎన్నోఉన్నాయి. అయినా ఖర్చుకు భయపడి వాటి మరమ్మతులు చేయించలేదు. వాటి తాలూకు ఆ లీకులే ఇప్పుడు ఎన్నో కోట్ల నష్టాలను తెచ్చిపెడుతున్నాయి. ముందు జాగ్రత్తగా పురాతన పైప్‌లైన్‌లను మారిస్తే కోనసీమ కార్చిచ్చు దావానంలా వ్యాపించి ఉండేది కాదు.

విజయం వల్ల లాభాలు ఆశించేవారు ఆ విజయాన్ని పొందేందుకు తిప్పలు పడక తప్పదు.



డబ్ల్యు ఎమర్సన్

ఇతరులలో మంచి చూడలేకపోవడం మనలో మంచితనం లేకపోవడాన్నే సూచిస్తుంది.



సోక్రటీస్

## ప్రజావాక్కు



### కొబ్బరి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

కోనసీమ జిల్లాలోని మలికిపురం మండలం సమీపంలోని ఇరుసుమండ మోరీఫిల్డ్5వద్ద డ్రిల్లింగ్ చేస్తున్న సమయంలో జరిగినబ్లోఅవుట్ మంటల వల్ల ప్రాణాపాయం లేకపోయినా వందల కొబ్బరిచెట్లు మాడిపోయాయి. కొడుకు ఆసరా లేకపోయినా కొబ్బరి చెట్టును నమ్ముకుని బ్రతకవచ్చని కోనసీమ వారు అంటుంటారు. కొన్నేళ్ళ క్రితం ఇదేకోనసీమలో పాశర్లపుడి బ్లోఅవుట్‌నుగుర్తుకు తెస్తోంది. అప్పుడు విదేశాల నుండి నిపుణులను మంటలు ఆర్పే పరికరాలనుతీసుకువచ్చారు. గ్యాస్ లీకేజీలుసరైన రక్షణ చర్యలుముందుగా తీసుకోకపోవడమే కారణమనిపిస్తోంది. కొన్నివందల కోట్ల రూపాయలు నష్టం జరిగిందని ఇప్పటికేఅంచనావేశారు. కొబ్బరి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి. అక్కడి ప్రజలకు సరైన పునరావాసం కల్పించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### నకిలీ రూపాలతో మోసాలు

డిజిటల్ యుగంలోసాంకేతికత జీవితంసులభతరం చేస్తున్న కొద్దీ, అదే సాంకేతికతను ఆయుధంగా మలచుకుని మోసాలకు పాల్పడేశక్తులు కూడా పెరుగుతున్నాయి. ఇటీవలికాలంలో అత్యంతప్రమాదకరంగా మారుతున్న సైబర్ నేరాలలో కృత్రిమ మేధ ఆధారిత నకిలీ రూపకల్పన మోసాలు ముఖ్యమైనవిగా నిలుస్తున్నాయి. మనిషి ముఖం, స్వరం, మాటతీరు, భావప్రకటనలను అసలైనట్లే అనుకరించి నకిలీ దృశ్యాలు, ధ్వనులు సృష్టించడం ఇప్పుడు నేరగాళ్లకు సులభమైంది. వినోదం, పరిశోధన కోసం ఉపయోగించాల్సిన ఈ సాంకేతికత, ప్రజల నమ్మకాన్ని దోచుకునే సాధనంగా మారడం ఆందోళనకరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అమెరికా ఆధిపత్యం

బ్రిటిష్ వలస కాలం మళ్లీ వచ్చిందా అంటే అవుననే అనిపిస్తుంది. అమెరికా ఆధిపత్యంతో వివిధ దేశాలను తమ చెప్పుచేతల్లో పెట్టుకోవాలి. వెనిజులాకు పట్టిన గతే రేపు క్యూబా కొలంబియా మెక్సికో దేశాలకు పడుతుందని చెపుతున్న ఆ ట్రంపరికి అడ్డు ఆపు లేకుండా పోతోంది. వలస కాలంలో మూడు దశలున్నాయి. ఒకటి వ్యాపార పెట్టుబడి దారి దశ , పారిశ్రామిక పెట్టుబడి దారి దశ లాంటి పోకడలు మనం ట్రంప్ కాలంలో చూస్తున్నాం.

- భారత అవినాష్, జనగామ

### ఇంధన స్వేచ్ఛ - తెలంగాణ ప్రయోజనం

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మోడీకి నేను అసంతృప్తిగా ఉన్నానని తెలుసు అన్నవ్యాఖ్యలు, భారత్‌పై టారిఫ్‌ల హెచ్చరికలతో కలిసి అంతర్జాతీయ వాణిజ్య రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. రష్యానుంచి భారత్ చమురు కొనుగోళ్లను తగ్గించాలన్న ఒత్తిడే ఈవ్యాఖ్యల వెనుక ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అయితే ఈ అంశాన్ని కేవలం విదేశాంగ కోణంలోనే కాకుండా, రాష్ట్రాల ఆర్థిక ప్రయోజనాల పరంగా కూడా చూడాల్సిన అవసరం ఉంది. తెలంగాణ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రానికి ఇంధన ధరలు అత్యంత కీలక అంశం. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలు, ఐటీ రంగం, రవాణావ్యవస్థలు పెద్దఎత్తున ఇంధనంపై ఆధారపడి ఉన్నాయి. చమురు ధరలు పెరిగితే నేరుగా ప్రభావం పడేది రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాలపైనే. అలాంటి సమయంలో తక్కువ ధరకు లభించే రష్యా చమురును భారత్ దిగుమతి చేసుకోవడం తెలంగాణకు కూడా ప్రయోజనకరం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### దుష్ట రాజకీయాలు

ముడుచుకుని మూలన కూర్చుంటె పదవులు రావు అధికారం అందదు. వీటికోసం వ్యూహాలు రచించాలి. ఎత్తులు, పైఎత్తులు, కుట్రలు, కుతంత్రాలు చేయాలి. అధికార పదవిలో కూర్చోవాలనుకునేవారు మిత్రుడు, హితుడు చుట్టం అని చూడకూడదు. ఎవరినైనా ముంచేయాలి. వంచించాలి. వ్యతిరేకించేవారిని తన వైపుతిప్పుకోవాలి. ప్రతికూలపరిస్థితులను అనుకూలంగా మార్చుకోవాలి. సినీరంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన ఎన్టీఆర్‌కి ఇవేమీ తెలియవు. మంచి వారిలాగా నమ్మకస్తుల్లాగా నటిస్తూ తన వెనుక గోతులు తవ్విన వారిని కనిపెట్టలేకపోయారు. అందుకే రెండుసార్లు వెన్నుపోట్లకి గురై పదవిని కోల్పోయారు.

- మిథునం, హైదరాబాద్

### దివంగత ప్రధానులపై విమర్శలు

నెహ్రూ కుటుంబ సభ్యులు స్వార్థపరులే అయితే దేశం ఎలా పోతే మాకేంటి? బ్రిటిషువాళ్లు పాలిస్తేమాకేంటి మరో దేశంవాళ్లు పాలిస్తే మాకేంటి. మేమ్ బాగానే ఉన్నాం. మాకు అంతులేని సంపద ఉంది. దాన్ని అనుభవిస్తూ సుఖంగా ఉంటాం అనుకునే వాళ్లు దేశ స్వాతంత్ర్య పోరాటాల్లో వారి కుటుంబం ఎందుకు పాలుపంచుకుంటుంది. వ్యవసాయ పారిశ్రామిక రంగాల అభివృద్ధి కోసం ఎందుకు పాటుపడుతుంది.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆదివాసీ సాంస్కృతిక వైభవం.. మేడారం జాతర

**ఈ మహాజాతరను 'తెలంగాణా కుంభ మేళా'గా పేర్కొంటారు. కోరిక కోర్కెలు తీర్చే అమ్మవార్లకు ఘనమైన పూజలు చేస్తారు. ఇంత పెద్ద ఎత్తున జరిగే జాతరకు ఈసారి మేడారం పున:నిర్మాణం పనుల వలన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. తెలుగు జాతి చరిత్రలో కాకతీయ సామ్రా జాన్ని స్వర్ణయుగంగా, మహోజ్వల ఘట్టంగా పేర్కొంటారు. చరిత్ర పరిశీలిస్తే కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు ఓరుగల్లును రాజధానిగా చేసుకొని పరిపాలించిన కాలంలో ఆదివాసీలు తమ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కొరకు పోరాటం చేసి తమ ప్రాణాలను పణంగా పెట్టి ఆదివాసీ హక్కులను కాపాడిన వీరవనితలుగా సమ్మక్కసారలమ్మలు చరిత్రలో ప్రసిద్ధిపొందారు. వారి బలిదానాలనే నేడు 'మేడారం మహా జాతరగా'నిర్వహిస్తూ తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు.**



జి. లక్ష్మణ్ కుమార్

ఆసియా ఖండంలోనే అతి పెద్ద ఆదివాసీ జాతరగా 'సమ్మక్క సారలమ్మ మేడారం మహా జాతర' ప్రతి రెండేళ్లకోసారి మాఘ పౌర్ణమి రోజుల్లో జరిగే క్రతువు. దశాబ్దాల కాలం నుండి బుధ, గురు, శుక్ర, శనివారాలలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. ఈ మహా జాతరను 'తెలంగాణా కుంభ మేళా'గా పేర్కొంటారు. కోరిక కోర్కెలు తీర్చే అమ్మవార్లకు ఘనమైన పూజలు చేస్తారు. ఇంత పెద్ద ఎత్తున జరిగే జాతరకు ఈ సారి మేడారం పున:నిర్మాణం పనుల వలన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. తెలుగు జాతి చరిత్రలో కాకతీయ సామ్రాజ్యాన్ని స్వర్ణ యుగంగా, మహోజ్వల ఘట్టంగా పేర్కొంటారు. చరిత్ర పరిశీలిస్తే కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు ఓరుగల్లును రాజధానిగా చేసుకొని పరిపాలించిన కాలంలో ఆదివాసీలు తమ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కొరకు పోరాటం చేసి తమ ప్రాణాలను పణంగా పెట్టి ఆదివాసీ హక్కులను కాపాడిన వీరవనితలుగా సమ్మక్కసారలమ్మలు చరిత్రలో ప్రసిద్ధిపొందారు. వారి బలిదానాలనే నేడు 'మేడారం మహా జాతరగా'నిర్వహిస్తూ తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. నేడు మేడారం స్వరూపం పూర్తిగా మారిపోయింది. భక్తులు మెచ్చేలా ఈ చారిత్రిక ప్రదేశ వైభవాన్ని చాటి చెప్పేలా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి జాతర నిర్వహణకు అభివృద్ధి పనులకు నిధులు సమకూర్చారు. మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు విస్తృత ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. ఇప్పుడు చూస్తే కొత్త సొబగులు, కాంతులు వారిని కట్టిపడేస్తున్నాయి. ఎన్ని కోట్లు వెచ్చించినా తాత్కాలికమే అనే స్థాయి నుండి ఈసారి చిరస్థాయిగా ఉండేటట్లు తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలను, సంస్కృతీ సాంప్రదాయాలు కలగలిపి అపురూప జాతరగా తీర్చిదిద్దడం చెప్పుకోదగినది. వందల ఏళ్లపాటు చెక్కుచెదర కుండా నిలిచేలా గద్దెల శాశ్వత పున: నిర్మాణం పనులు చేపట్టింది. గద్దెల విస్తరణ, ఆలయ ప్రాంగణం చుట్టూ గ్రానైట్ రాతి ప్రాకార నిర్మాణం, స్వాగత తోరణాల ఏర్పాటు అద్భుత సౌందర్యానికి ఆలవాలంగా ఉన్నాయి. మేడారం గద్దెల చుట్టూ నిర్మిస్తున్న 32 గ్రానైట్ పిల్లర్లపై ఆదివాసీ సంస్కృతి, ఆచారాలు, చరిత్రను తీర్చిదిద్దారు. మార్బుల్ శిలలతో గద్దెలూ జంపన్న వాగు సుందరీకరణ, డ్రైనేజీ వ్యవస్థలు, ఫ్లడ్ మేనేజ్ మెంట్, 60అడుగుల నుంచినాలుగు లైన్లకు రోడ్ల విస్తరణ, క్యూలైన్లు, సత్రాలు, వాచ్ టవర్లు, గ్రీనరీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మరోవైపు జాతర సజావుగా సాగేందుకు మహా కుంభమేళాలో భాగస్వాములైన నిపుణుల బృందం మేడారానికి చేరుకుంది. జాతర జరిగే ప్రాంతం, అక్కడికి దారి తీసే మార్గాలు, జాతర రద్దీ ఉండే ఉప ఆలయాలను సందర్శించి, అధికారులకు సూచనలు, సలహాలు చేసింది. ఈసారి జాతరకొచ్చే భక్తులకు ఏర్పాటైన పార్కింగ్ గద్దెల సమీపంలోనే ఏకకాలంలో వేల వాహనాల పార్కింగ్కు దోహదపడుతుంది. ఆ నాలుగు రోజులూ డ్రోన్‌ప ప్రత్యేక ఆకర్షణ కానున్నది. జాతరపై సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు డాక్యుమెంటరీ కూడా రూపొందిస్తున్నారు. మేడారంసమ్మక్క సారలమ్మ మహా జాతరకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. మొత్తం రూ.251 కోట్లతో మేడారం సమగ్ర అభివృద్ధికి శ్రీకారం



చుట్టింది. గద్దెల విస్తరణకే రూ.101 కోట్లు కేటాయించింది. 4,000టన్నుల గ్రానైట్తో గద్దెల ప్రాంగణ నిర్మాణ పనులు చేపట్టారు. 750 మంది కోయ వంశీయుల పేర్లకు సంబంధించిన 7,000కి పైగా శిల్పాలు, 930 ఏళ్ల కోయల తాళపత్ర గ్రంథాల ఆధారంగా శిల్ప రూపకల్పన చేశారు. ప్రస్తుతం ఉన్న చెట్లను తొలగించకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. బండారి, మర్రి, వెదురు, వేప, ఇప్ప తదితర 12 రకాల పవిత్ర వృక్షాలు ఇక్కడ ఉన్నాయి. 140 రకాల ఆయుర్వేద మొక్కల నాటనున్నారు. శాస్త్రానుసారం సలహాలతో సకల ఏర్పాట్లు జరుగుతున్నాయి. గద్దెల ప్రాంగణాన్ని రాతిచారిత్రక కట్టడాలమధ్య పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నారు. 46 పిల్లర్లతో 271చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉంటుంది. వీటి మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలుంటాయి. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పున ప్రధాన స్వాగత తోరణం నిర్మిస్తున్నారు. వృత్తాకారంలో ఉండే గద్దె చుట్టూ 8 స్తంభాలు, మధ్యలో వెదురు బొంగులతో తీర్చిదిద్దుతున్నారు. శిలలపై ఆదివాసుల సంస్కృతికి పెద్ద పీట వేశారు. తాళపత్రాల్లోని కోయ వంశీయుల చరిత్రను ప్రాంగణంలో కుడ్య చిత్రాలుగా గోడలపై చిహ్నాలుగా, బొమ్మలుగా చెక్కించారు. ఇందుకోసం తెలుపు రంగు రాళ్లను ఆంధ్రప్రదేశ్లోని అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి నంద్యాల జిల్లా ఆళ్ల గడ్డకు తరలించి శిల్పులతో చెక్కించాక మేడారానికి తీసుకొచ్చారు. మేడారంలో కోయల ఆచార సంప్రదాయాలకు తగ్గట్టుగా సమ్మక్క సారక్క తల్లుల చరిత్ర అందరికీ తెలిసేలా శిలలపై చెక్కించారు. కోయల వద్ద దొరికిన 930ఏండ్ల నాటి తాళపత్ర గ్రంథాల ఆధారంగా చెక్కించిన శిల్పాలు, చిహ్నాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సమ్మక్కసారక్క పగిడిద్దరాజు, గోవిందరాజు, కోయల ఇష్టదైవాలకు ప్రతిరూపంగా భావించే పులి, జింక, దుప్పి, పావురం, ఏనుగు, నెమలి, మొసలి, పశుపక్ష్యాదులతోపాటు కోయల జీవనశైలికి, ఆచార సంప్రదాయాలకు, గొట్టుగోత్రాలకు ప్రతిరూపంగా భావించే సూర్య చంద్రులు, త్రిశూలం, నెలవంక, బండిచక్రాలు, అడ్డ, నిలువు గీతలకు స్తంభాలపై చోటు దక్కింది. అలాగే సమ్మక్క సారలమ్మ వంశస్తులైన దాదాపు 250 కోయల ఇంటి పేర్లు, వారి మూలాలను శిలలపై చెక్కి వారి చరిత్రను భావితరాల కోసం నిక్షిప్తం చేశారు. గద్దెల ముందు తెల్లనిగ్రానైట్ స్తంభాలతో ఏర్పాటు చేస్తున్న ప్రధానద్వారం, ఆయా శిలలపై సమ్మక్కసారలమ్మ పూర్వీకులతోపాటు, కోయల జీవనశైలిని తెలిపేలా చెక్కిన ఏడు వేల బొమ్మలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. సమ్మక్క సారలమ్మతో పాటు 3,4,5,6,7 గొట్టుగోత్రాలను బొమ్మలుగా చెక్కారు. గద్దెల చుట్టూ బయటి వైపు శిలలపై ఆదివాసీల జీవన విధానం, వారి దేవతల బొమ్మలు, ఇంకా 750 కోయ ఇంటి పేర్లకు సంబంధించిన జీవన చిత్రాలను గీశారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించిన సమ యంలో రేవంత్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్నారు. ఆ సమయంలో ప్రజలు, ఆదివాసీలు మేడారంలో అభివృద్ధి పనులు, పునర్నిర్మాణ పనులు చేపట్టాలనీ, జాతరకు అన్నిహంగులు కల్పించాలని కోరారు. తాము అధికారంలోకి రాగానే తప్పకుండా మేడారంలో పునర్నిర్మాణ పనులు చేసి తీరుతామన్న హామీ నేడు నిజమైంది. నేడు మేడారం అభివృద్ధికి అడుగులు పడ్డాయి. మేడారం ఆలయంలో పునః నిర్మాణం పనులు వేగవంతానికి మంత్రుల బృందం ప్రతి రోజూ సమీక్షించడం విశేషం. మన దేశంలో లెక్కలేనన్ని జాతర్లు ఉన్నప్పటికిని మేడారం జాతర ప్రత్యేకతనే వేరు. చరిత్ర ప్రసిద్ధి చెందింది. 2026 జనవరి 28వ తేదీ బుధ వారం సారలమ్మ రాకతో మేడారం మహాజాతర ప్రారంభమ వుతుంది. 29న గురువారంసమ్మక్క దేవత గద్దెకు రావడం, 30న శుక్రవారం భక్తులు మొక్కులు సమర్పించుకోవడం, 31వ తేదీ దేవతల వనప్రవేశంతో జాతర ముగియనుంది. సమ్మక్క సారలమ్మలను దర్శించుకునేందుకు దేశ విదేశాల నుంచి సైతం భక్తులు వస్తుంటారు. తాము మారుతున్నా ఈ జాతర తీరు మారలేదు. ఇదొక ఆధ్యాత్మిక శోభాయాత్రంగా రూపుదిద్దుకొంది. ●

(అసిస్టెంట్ డైరెక్టర్ సమాచార, పౌర సంబంధాల శాఖ కరీంనగర్)

# కొత్త సుంకాలు 'పొగాకు'ను ఆపగలవా?

డా : చిట్యాల రవీందర్

దేశవ్యాప్తంగా పొగాకు ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకాలు భారీగా పెరగనున్నాయి. ఇది కేవలం పన్నుల పెంపు మాత్రమే కాదు, ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రభు త్వం సంధించిన ఒక శక్తివంతమైన అస్త్రం. ముఖ్యంగా యువతను, సామాన్యులను ఈ ప్రాణాంతక వ్యసనంనుండి దూరం చేయడమే లక్ష్యంగా ఈ నూతన పన్ను విధానం రూపొందించబడింది. ఈ మార్పుల వల్ల సిగరెట్లు, గుట్కా, నశ్యం వంటి ఉత్పత్తుల ధరలు సామాన్యుడికి భారంగా మారనున్నాయి, తద్వారా వినియోగం తగ్గుతుందని నిపు ణులు భావిస్తున్నారు. రానున్న పన్నుల నూతన ముఖచిత్రం ఆలోచింపజేసేదిలా వుంది. ప్రస్తుత జీఎస్టీ పరిహార సెస్ స్థానంలో కేంద్రం నేరుగా ఎక్సైజ్ సుంకాలనుప్రవేశపెట్టింది. సిగరెట్ల పొడవు, వాటి నాణ్యత ఆధారంగా పన్ను రేట్లలో భారీ వ్యత్యాసాలు ఉన్నాయి. ఉదాహరణకు, 65 మిల్లీమీటర్ల లోపు ఉండే ఫిల్టర్ సిగరెట్లపై వేయి స్టిక్కులకు సుమారు 2,100 రూపాయల సుంకం విధిస్తుండగా, ప్రీమియంరకం సిగరెట్లపై అది 8,500 రూపాయల వరకు పెరిగింది. అంటే ఒక్కో సిగరెట్ ధరపై కనీసం రెండు నుండి ఐదు రూపా యల వరకు భారం పడే అవకాశం ఉంది. అదేవిధంగా గుట్కా వంటి ప్రమాదకర పదార్థాలపై 91శాతం, నమలడం ద్వారా తీసుకునే పొగాకుపై 82 శాతం సుంకం విధించడం గమనార్హం. దీనివల్ల మార్కెట్‌లో వీటి ధరలు ఆకాశాన్ని తాకనున్నాయి. ఇది ఒక రకంగా పొగాకు వినియోగదారుల కు ప్రభుత్వం ఇస్తున్న హెచ్చరిక వంటిదే. ప్రభుత్వ ప్రయత్నమల్లా వ్యసనం నుండి విముక్తి కోసమే అనేది గమనించాల్సి న సంగతి.

పొగాకు వినియోగం అనేది కేవలం వ్యక్తిగత అలవాటు కాదు, అది ఒక సామాజిక జాడ్యం. భారతదేశంలో ఏటా లక్షలాది మంది క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలతో మరణి స్తున్నారు. ఒక ఇంట్లో సంపాదించే వ్యక్తి పొగాకు బారిన పడి అనారోగ్యానికి గురైతే, ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా, మానసికంగా



చితికిపోతుంది. ప్రభుత్వం విధిస్తున్న ఈ అధిక పన్నులు ముఖ్యంగా విద్యార్థులు, యువతను దృష్టిలో పెట్టుకుని చేసినవి. తక్కువ ధరలో దొరికే ఉత్ప త్తులకు అలవాటు పడి తమ భవిష్యత్తును నాశనం చేసు కుంటున్న వేళ, ఈధరల పెంపు వారిని నియంత్రించగల దు. ధర పెరిగినప్పుడు కొనుగోలు శక్తి తగ్గుతుంది. తద్వారా కొత్తగా వ్యసనానికి లోబడే వారి సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఈ పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రజారోగ్య రక్షణ కోసం, ముఖ్యంగా క్యాన్సర్ చికిత్సాలయాల ఏర్పాటుకు, అవగాహన కార్యక్రమాలకు వినియోగించనుంది. పొగాకు వల్ల కలిగే నష్టాలను చికిత్స చేయడం కంటే, దాని వినియోగాన్ని నిరోధించడమే మేలని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోంది. 'హెల్త్ అండ్ నేషనల్‌సెక్యూరిటీ సెస్' పేరుతో వసూలు చేసే ఈ నిధులు దేశ ఆరోగ్య మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి తోడ్పడతాయి. ఇది దీర్ఘకాలంలో దేశ ఉత్పాదకతను పెంచుతుంది. ఆరోగ్యవంతమైన పౌరులే దేశానికి నిజమైన సంపద అనేసూత్రాన్ని ప్రభుత్వం ఈ రూపంలో ఆచరణలో పెడుతోంది. ఈ పన్నుల పెంపు వల్ల పొగాకు దిగ్గజ సంస్థల లాభాలపై ప్రభావం పడవచ్చు. కానీ ప్రభుత్వ ఉద్దేశం లాభాల కంటే ప్రజల ప్రాణాలకే ప్రాధాన్యత ఇవ్వడం. పన్నుల ఎగవేతను అరికట్టడానికి యంత్రాల సామర్థ్యం ఆధారంగా పన్ను లెక్కించే విధానాన్ని తీసుకురావడం ఒక విప్లవాత్మక మార్పు. ఇది అక్రమ తయారీని అరికట్టడమే కాకుండా, మార్కెట్‌లో పారదర్శకతను పెంచుతుంది. గిరిజన, పేద కార్మికులు ఆధారపడి ఉన్న బీడీ పరిశ్రమపై సుంకాలను కనిష్టంగా ఉంచడం ద్వారా ప్రభుత్వం సామాజిక సమతుల్యతను కూడా కాపాడింది. పొగాకు మహమ్మారిని దేశం నుండి తరిమికొట్టే ప్రయాణంలో ఫిబ్రవరి 1 నుండి అమలులోకి వచ్చే ఈ ఎక్సైజ్ సుంకాలు కీలక పాత్ర పోషించనున్నాయి. పౌరులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఈ ధరల పెరుగుదల ఒక మంచి సాకుగా మారుతుందని ఆశిద్దాం. పొగాకురహిత భారతమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రస్థానంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. డబ్బు కంటే ప్రాణం విలువైనదని గుర్తించి, ఈ విషపూరిత అలవాట్లకు స్వస్తి పలకడమే మనం దేశానికి ఇచ్చే నిజమైన గౌరవం. ●

# ఉరిశిక్షలతో మసకబారుతున్న సౌదీ ప్రతిష్ఠ

జి.సత్యనారాయణరాజు

తెలుగు సినిమా అభిలాషలో అమాయకుడికి శిక్ష పడకూడదనే సందేశం ఇస్తారు మెగాస్టార్ చిరంజీవి. స్టాప్ అనే అరుపుతో ఉరిశిక్ష ఆగిపోవడం అనేది మనం సినిమాల్లోనే చూస్తుంటాం. కానీ పెద్ద పెద్ద నేరాలకు ఇస్లామిక్ దేశాల్లో ఉరిశిక్షలు సర్వసాధారణం. సౌదీ అరేబియా లాంటి దేశాల్లో వందలాది ఉరిశిక్షలు అమలవుతుంటాయి. 2025లో సౌదీ రికార్డు స్థాయిలో 356 మందికి ఉరిశిక్షల్ని అమలు చేసింది. ఒకే ఏడాదిలో మరణశిక్షలకు గురైనఖైదీల విషయంలో సౌదీ రికార్డ్ సృష్టించింది. ఉరిశిక్షల పెరుగుదలకు ప్రధాన కారణం మాదకద్రవ్యాలపై యుద్ధం అనిఅక్కడి నిపుణులు చెబుతున్నారు. మొదటిసారిగా అరెస్టయిన వారిలో కూడా చాలామంది ఇప్పుడు ఉరిశిక్షలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక డేటా ప్రకారం, 2025లో కేవలం డ్రగ్స్ సంబంధిత కేసుల్లోనే 243 మందికి ఉరిశిక్ష విధించారు. 2024లో సౌదీ338 మందికి ఉరిశిక్ష విధించింది. సుమారు మూడు సంవత్సరాల పాటు మాదకద్రవ్యాల కేసులలో మరణశిక్షను నిలిపివేసిన తర్వాత, సౌదీ అరేబియా 2022లో మాదకద్రవ్యాల నేరాలకు ఉరిశిక్షలను తిరిగి ప్రారంభించింది. ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం అరబ్ ప్రపంచంలో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ అయిన సౌదీ అరేబియాలోకి క్యాప్టగాన్ అనే అక్రమ ఉత్ప్రేరకానికిఅతిపెద్ద మార్కెట్ ఉంది. ముఖ్యంగా సిరియా నుంచి ఇది సరఫరా అవుతుంది. మాదకద్రవ్యాలపై యుద్ధం ప్రారంభించినప్పటి నుండి, దేశం హైవేలు, సరిహద్దు క్రాసింగ్‌ల వద్ద పోలీసు తనిఖీ కేంద్రాలను పెంచింది. ఈ తనిఖీల్లో మిలియన్ల కొద్దీ మాదక ద్రవ్యాల మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి డజన్ల కొద్దీ స్మగ్లర్లు పట్టుబడ్డారు. ఇలా పట్టుబడుతున్నవారిలో విదేశీయులే ఎక్కువగా ఉన్నారు. ఖైదీల్లో ప్రవర్తన మార్చడానికి బదులు ఇలా విచ్చలవిడిగా ఉరిశిక్షలు అమలు చేయడం సౌదీ ప్రతిష్టను దెబ్బతీస్తుందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఆధునిక దేశంగా మారాలని భావిస్తున్న సౌదీ అరేబియాకి ఇది విరుద్ధమని మానవ హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఉరిశిక్షల అమలు క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ విజన్ 2030 సంస్కరణల ఇమేజ్‌ను దెబ్బతీస్తుందని విదేశీ నిపుణులు అంటున్నారు. శాంతి భద్రతలను కాపాడటానికి మరణశిక్షలు అవశ్యం అని అక్కడి పాలకులు చెబుతున్నారు. భారతదేశంలో అత్యాచారం చేసినవారికి కూడా మరణశిక్షలు విధించడం చాలా అరుదు. అత్యాచారం చేస్తే మహా అయితే జైలు శిక్ష వేస్తారు అనే చులకన భావంతో కొంతమంది మూర్ఖులు



రెచ్చిపోతున్నారు. అలా కాకుండా అత్యాచారానికి కూడా మరణశిక్ష లాంటి వాటిని అమలు చేస్తే తప్ప సమాజంలో విప్లవాత్మకమయిన మార్పు రాదంటున్నారు. కొన్ని దేశాలు అత్యాచారాన్ని తీవ్ర నేరంగా పరిగణించి ఉరి శిక్షను అమలు చేస్తున్నాయి. అమెరికాలో అయితే అత్యాచార నిందితులకు గరిష్టంగా 30 ఏళ్ల జైలు శిక్ష విధిస్తారు. చిన్నపిల్లలపై అత్యాచారం చేస్తే మాత్రం మరణశిక్ష విధిస్తారు. రష్యాలో అయితే నిందితులకు 4 నుంచి 20 ఏళ్ల జైలు శిక్ష విధించే అవకాశముంది. ఇటు వంటికేసులలో అరెస్టయిన వారికి 20సంవత్సరాల వరకూ ఎటువంటి ఉద్యోగమూ ఇవ్వరు. ఈ విధమైన శిక్షల వల్ల నేరం చేయాలంటే భయపడే పరిస్థితి ఏర్పడుతుంది. టెక్నాలజీలో ఎంతో ముందున్న జపాన్‌లో అయితే అత్యాచారం చేస్తే 20ఏళ్ల జైలు శిక్ష విధిస్తారు. అత్యాచారంతో పాటు దోపిడీ కూడా చేస్తే మాత్రం మరణ శిక్ష ఖాయం. నార్వేలో మరణశిక్షలుండవు. ఇక్కడ నిందితులకు 4 నుంచి 15 ఏళ్ల కఠినశిక్ష విధిస్తారు. నెదర్లాండ్స్‌లో బహిరంగంగా కిస్ చేస్తే కఠిన శిక్షలు అమలుచేస్తారు. నిబంధనల్ని ఉల్లఘించి ప్రవర్తిస్తే అత్యాచారంగా భావించి 4 నుంచి 15 ఏళ్ల శిక్ష విధిస్తారు. బంగ్లాదేశ్‌లో అయితే నిందితులకు జీవిత ఖైదు విధిస్తారు. కొన్ని అసాధారణ, అరుదైన పరిస్థితు ల్లో మాత్రమే మరణశిక్ష విధిస్తారు. యూఏఈ లో నిందితుడికి 7 రోజుల్లోనే మరణశిక్షను అమలు చేస్తారు. బాధితులు అంగీకరిస్తే తప్ప శిక్ష నుంచి తప్పించుకోవడం కష్టం. మన పొరుగున ఉన్న పాకిస్థాన్ గ్యాంగ్ రేప్, పిల్లలపై అత్యాచారం కేసులకు మరణశిక్ష విధిస్తారు. ఫ్రాన్స్ దేశంలో బాధితురాలు మరణిస్తే 30 ఏళ్ల జైలు శిక్ష నుంచి జీవిత ఖైదు విధిస్తారు. తక్కువలో తక్కువగా 15ఏళ్ల శిక్షవిధించడం ఖాయం. ఇజ్రాయిల్ దేశంలో అయితే ఏవిధమైన లైంగిక నేరంచేసినా 16ఏళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. క్యూబా దేశంలో శిక్షలు ఘోరాతిఘోరంగా ఉంటాయి. అత్యాచారం కేసులో ఇరుక్కొని మరోసారి అత్యాచారం చేసినా లేదా 12 ఏళ్లలోపు పిల్లలపై అత్యాచారం చేసినా ఉరిశిక్ష వేస్తారు. అయితే ప్రపంచంలో అనేక దేశాలు ఉరిశిక్షను రద్దుచేశాయి. ఆ జాబితాలో పోర్చుగల్, నెదర్లాండ్స్, డెన్మార్క్, బెల్జియం, ఐర్లాండ్, ఇటలీ, స్పెయిన్, హంగేరీ, రొమేనియా, వెనిజులా, అర్జెంటీనా, పరాగ్వే, కెనడా, కోస్టారికా, డొమినికన్ రిపబ్లిక్, ఆసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫిజి, మొజాంబిక్, ఆంగ్‌లా, కంబోడియా, సైప్రస్, జింబాబ్వేలు ఉరి శిక్షకు చరమగీతం పాడాయి. అన్నినేరాలకు మరణశిక్షను రద్దు చేసిన మొదటి దేశం వెనిజులా. 1863లో ఉరిశిక్ష రద్దుచేస్తూ వెనిజులా ప్రభుత్వం నిర్ణయించింది. బ్రెజిల్, ఫిజీ, పెరు, కెన్యా వంటి దేశాలు సాధారణ నేరాలకు మాత్రమే మరణ శిక్షను రద్దుచేశాయి, సైనిక నేరాలకు ఉరిశిక్షను అమలుచేస్తున్నాయి. కొన్నిదేశాలు చట్టంలో మరణశిక్ష ఉన్నప్పటికీ, కనీసం 10 సంవత్సరాలుగా అమలు చేయడంలేదు. 2021 చివరి నాటికి 108 దేశాలు మరణశిక్షను పూర్తిగా రద్దు చేశాయి. ఇది ప్రపంచ దేశాలలో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువని అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు. ●

# మధ్యంతర ఎన్నికల్లో గెలవాలి..



## లేకుంటే డెమొక్రాట్లు అభిశంసన

### రిపబ్లికన్లతో చిట్‌చాట్‌లో అధ్యక్షుడు ట్రంప్ ఆందోళన

**వాషింగ్టన్, జనవరి 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు పదవి భయం పట్టుకుంది. ఈ ఏడాది నవంబర్ లో జరిగే మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ గెలవకపోతే తాను అభిశంసనకు గురి అవుతానని భావిస్తున్నారు. ఇదే విషయాన్ని రిపబ్లికన్లతో నిర్వహించిన సమావేశంలోనూ స్పష్టం చేశారు. మిడ్ టర్మ్ ఎన్నికల్లో గెలవకపోతే తన అభిశంసన తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. హౌస్ ఆఫ్ రెప్రజెంటేటివ్స్, యూఎస్ కాంగ్రెస్ కు జరిగే ఈ ఎన్నికల్లో ఖచ్చితంగా మెజారిటీ స్థానాలను దక్కించుకోవాల్సి ఉందేనని తేల్చి చెప్పారు. వాషింగ్టన్‌లో జరిగిన హౌస్ రిపబ్లికన్ ఎంపీల రిట్రీట్ కార్యక్రమంలో డొనాల్డ్ ట్రంప్ మాట్లాడారు. నవంబర్ లో జరగబోయే మధ్యంతర ఎన్నికల్లో తప్పక గెలవాలని, అలా జరక్కపోతే డెమొక్రాట్లు ఏదో ఒక కారణాన్ని వెదికి తనను అభిశంసిస్తారని తేల్చి చెప్పారు. యూఎస్ కాంగ్రెస్‌పై రిపబ్లికన్ల పట్టు బలహీనపడకూడదని, ఈ అవకాశం కోసమే డెమొక్రాట్లు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. మిడ్ టర్మ్ ఎన్నికల్లో గెలవకపోతే కొన్ని అజెండాలు అర్ధాంతరంగా నిలిచిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. డెమొక్రాట్లకు కాంగ్రెస్‌లో ఆధిక్యం దక్కితే, తనను అభిశంసన ప్రక్రియను ప్రారంభించే అధికారం వారికిలభిస్తుందని కుండబద్దలు కొట్టారు ట్రంప్. ఈ నవంబర్‌లో యూఎస్ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ లో మొత్తం 435 సీట్లకు, సెనేట్ లో 100లో మూడింట ఒక వం తు సీట్లకు వచ్చే నవంబర్‌లో పోలింగ్ జరగనుంది. హౌస్ ఆఫ్ రెప్రజెంటేటివ్స్, కాంగ్రెస్‌పై పట్టు నిలుపుకోవడం పార్టీకి అత్యంత ముఖ్య మని ట్రంప్ స్పష్టం చేశారు. ప్రస్తుతం హౌస్ లో రిపబ్లికన్లకు ఉన్న మెజారిటీ స్వల్పమే. అమెరికా చట్టం ప్రకారం దేశద్రోహం, లంచం, లేదా ఇతర తీవ్రమైన నేరాలు, దుష్ప్రవర్తన వంటి ఆరోపణలపై అధ్యక్షుడిని అభిశంసించే సర్వాధికారాలు హౌస్ ఆఫ్ రెప్రజెంటేటివ్స్ కు ఉంది. మూడింట రెండు వంతుల ఓట్లతో ఆయన్ను దోషిగానిర్ధారించి, పదవి నుంచి తొలగించవచ్చు. నవంబర్‌లో ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలు, సెనేట్‌లోని 33 స్థానాలకు పోలింగ్ జరగనుంది. జనాభా ఆధారంగా విభజించిన నియోజకవర్గాల నుండి సభ్యులు హౌస్ ఆఫ్ రెప్రజెంటేటివ్స్‌కు ఎన్నికవుతారు. సెనేటర్లు రాష్ట్రవ్యాప్త ఎన్నికల ద్వారా ఎంపికవుతారు. రిపబ్లికన్లకు అనుకూలమైన కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ మ్యాప్‌లను ఆమోదించాలని ట్రంప్, రిపబ్లికన్ పాలిత రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తున్నారు. దీన్ని గెరి మాండరింగ్ అంటారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధం. క్యాన్స్, మిస్సోరి, నార్త్ కరోలినా వంటి రాష్ట్రాలు ఇప్పటికే ఇలాంటి పునర్విభజనలు చేశాయి.

## అఫ్ఘాన్, పాక్ సరిహద్దుల్లో ఐసిస్ నేత మెహ్‌మెట్‌గోర్ అరెస్ట్

**వాషింగ్టన్, జనవరి 7:** ఆఫ్ఘనిస్థాన్, పాకిస్తాన్ సరిహద్దుల్లో టర్కీ నేషనల్ ఇంటెలిజెన్స్ సంస్థ నిర్వహించిన కోవర్ట్ ఆపరేషన్‌లో ఇస్లామిక్‌స్టేట్ ఖొరాసన్‌ప్రావిన్స్‌కు చెందిన సీనియర్ ఐసిస్ నాయకుడిని అరెస్టుచేయడంతో పాకిస్తాన్‌లో ఐసిస్ కార్యకలాపాలున్నాయని మరోసారి రుజువు అయింది. మెహ్‌మెట్‌గోరెన్ అనే ఐసిస్ నాయకుడిని టర్కీ దళాలు పట్టుకున్నాయి. ఐసిస్‌కె ప్రావిన్స్‌లో ఆత్మాహుతి దాడులకు కుట్రలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. తాలిబన్ ప్రతినిధి జబియుల్లా ముజాహిద్ ఒక ఆడియో సందేశం విడుదలచేస్తూ పాకిస్తాన్ ఐసిస్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తోందని, తాలిబన్ దీర్ఘకాలికంగా పాక్ కార్యకలాపాలను పరిశీలించిందని, నిఘా సమాచారం కూడా అందించిందని వెల్లడించారు. ఖైబర్ ఫక్తూన్‌ఖ్వా, బలూచిస్తాన్ వంటి ప్రావిన్సుల్లో శిక్షణ నియామకాలకు సంబంధించి స్థావరాలు కల్పించిందని బలూచి ఆరోపించారు. పాకిస్తాన్‌లోని పలు కేంద్రాలు, బలూచ్‌లోని క్వెట్టాల్లో శిక్షణ కేంద్రాలు కూడా నిర్వహిస్తున్నారని బలూచ్ ఆరోపించారు. తాలిబన్ విదేశీగమంత్రి మైలావి అమీర్‌ఖాన్ ముత్తాకి మాట్లాడుతూ మూడు పొరుగుదేశాలు ఐసిస్‌కెకు ఆశ్రయం కల్పిస్తున్నా యని, యువకులను రిక్రూట్‌చేసుకుంటున్నా యని, మరోదేశంలో శిక్షణఇస్తూ మూడోదేశంలో కుట్రలకు పథక రచనచేస్తున్నాయని, మూడుదేశాలనుంచి వాటికి నిధులు కూడా అందు తున్నట్లు ఆరోపించారు. పాకిస్తాన్ ఆర్మీ పర్యవేక్షణలోనే బలోచిస్తాన్‌లో ఐసిస్ శిబిరాలు నడుస్తున్నాయని అన్నారు. పాకిస్తాన్ ఐఎస్ఐ అధికారులు పాక్‌లోనే ఉన్న హాఫీజ్‌సయీద్ ఖాన్‌కు నిధులు అందిస్తున్నారన్నారు. ఐసిస్‌కెకు ఎమిర్‌గా వ్యవహరించినట్లు కూడా చెపు తున్నారు.

## ఆ దేశాలతో సంబంధాలు తెంచుకోవాలి

### వెనిజులా కొత్త ప్రభుత్వానికి ట్రంప్ హుకుం

**వాషింగ్టన్, జనవరి 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనిజువెలా దేశంపై తన ఆధిపత్యాన్ని చూపించాలని పట్టుదలతో ఉన్నారు. వెనిజువెలాలో ఇటీవల ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా దళాలు బంధించి తీసుకు వెళ్లాయి. ఆ తర్వాత డెల్సీ రోడ్రిగెజ్ తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. అయితే ట్రంప్ మాత్రం వెనిజువెలాను తానే నియంత్రిస్తున్నానని ప్రకటిస్తున్నారు. ఇప్పుడు ఆ దేశానికి చెందిన చమురు ఉత్పత్తిని పెంచుకోవాలంటే కొన్ని షరతులు పాటించాలని అమెరికా డిమాండ్ చేస్తోందని నిపుణులు అంచనాలువేస్తున్నారు. వెనిజువెలా కొత్త నాయకత్వం చైనా, రష్యా, ఇరాన్, క్యూబాలతో ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలి. అంతేకాదు, చమురు ఉత్పత్తిలో అమెరికాతో మాత్రమే భాగస్వామ్యం చేయాలి, ముఖ్యంగా హెవీక్రూడ్ ఆయిల్ విక్రయాల్లో అమెరికాకు ప్రాధాన్యం ఇవ్వాలి. మరోవైపు, వెనిజువెలా దేశం చైనాతో చాలా సన్నిహిత సంబంధాలు కలిగి ఉంది. చైనా ఆ దేశం నుంచి అత్యధిక చమురు కొనుగోలు చేస్తుంది. ఇప్పుడు అమెరికా తన షరతులను ఎలా రుద్దుతుందనేది కీలకం. యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఒక ప్రైవేట్ మీటింగ్‌లో ఎంపీలతో మాట్లాడుతూ, వెనిజులా చమురు ట్యాంకర్లు పూర్తిగా నిండిపోయాయని, అందుకే వారు తమ డిమాండ్లకు లొంగక తప్పదని చెప్పారు. బ్లూంబర్గ్ రిపోర్ట్ ప్రకారం, డిసెంబర్ చివరి నుంచి వెనిజువెలా చమురు బావులను మూసేస్తోంది. ఎందుకంటే అమెరికా ఆంక్షల వల్ల స్టోరేజ్ స్పేస్ లేకుండా పోయింది. మరిన్ని బావులు మూసేస్తే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ మరింత కుదేలవుతుంది, తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగెజ్ అధికారం కూడా ప్రమాదంలో పడుతుంది. అమెరికా అంచనాల ప్రకారం, వెనిజువెలా రాజధాని కారకాస్‌కు కేవలం కొన్ని వారాల్లోనే ఆర్థికంగా నిర్వీర్యమైపోయే పరిస్థితి వస్తుంది. చమురు విక్రయాలు లేకుండా దేశం తట్టుకోలేదని చెబుతున్నారు. సెనేట్ ఆర్మ్డ్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ రోజర్ వికర్ ఏబీసీ న్యూస్‌తో మాట్లాడుతూ, అమెరికా ప్రభుత్వం వెనిజువెలా చమురును తమ నియంత్రణలోకి తీసుకోవాలని భావిస్తోందని, ఆ ట్యాంకర్లు హవానా వంటి చోట్లకు వెళ్లకుండా చూసుకుంటామని అన్నారు. ఓపెన్ మార్కెట్‌లోకి వెళ్లకుండా ఉంటే మరిన్ని ట్యాంకర్లు నింపే అవకాశం లేదని అన్నీ పూర్తిగా నిండిపోయాయని ఆయన వివరించారు. అమెరికా ఆధిపత్యం వల్ల ఆ దేశం ఆర్థికంగా ఎలాంటి పరిణామాలు ఎదుర్కొంటుందోనని దేశప్రజలు ఆందోళనల్లో ఉన్నారు. ఇటువంటి ఒత్తిళ్లు ఇతర దేశాలతో సంబంధాలను ఎలా ప్రభావితం చేస్తాయనేది కూడా చర్చనీయాంశంగా మారింది.

## చట్టాలు ఉల్లంఘిస్తే వీసాలను రద్దుచేస్తాం

### అమెరికా కాన్సులేట్ తీవ్రస్థాయి హెచ్చరికలు



**వాషింగ్టన్, జనవరి 7:** భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం బుధవారం విద్యార్థులకు కీలక హెచ్చరిక జారీచేసింది. అమెరికా చట్టాలను ఉల్లంఘిస్తే వీసాలు రద్దు, దేశ బహిష్కరణ, భవిష్యత్తు ప్రయాణాలపై దీర్ఘకాలిక నిషేధం వంటి తీవ్ర పరిణామాలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చింది. అమెరికా వీసా హక్కుకాదని, అది కేవలం ఒకప్రత్యేకమైన వెసులుబాటు మాత్రమేనని, దేశంలోకి ప్రవేశం అక్కడ నిబంధనలకు పాటించడంపైనే ఆధారపడి ఉంటుందని కార్యాలయం స్పష్టం చేసింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా అమెరికా రాయబార కార్యాలయం పోస్టు పెట్టింది. అమెరికా చట్టాలను ఉల్లంఘిస్తే మీ విద్యార్థి వీసాకు తీవ్ర పరిణామాలు ఎదురవుతాయి. మిమ్మల్ని అరెస్టు చేసినా లేదా ఏదైనా చట్టాన్ని ఉల్లంఘించినా, మీ వీసా రద్దు కావొచ్చు. మిమ్మల్ని బహిష్కరించవచ్చు. అలాగే భవిష్యత్తులో అమెరికా వీసాలకు మీరు అనర్హులు అయ్యే ప్రమాదం ఉంది. అందుకే ఈ నిబంధనలను పాటించండి, మీ ప్రయాణాన్ని ప్రమాదంలో పడేసుకోకండి. అమెరికా వీసా హక్కు కాదు, అది ఒక విశేషాధికారం మాత్రమేనని స్పష్టం చేసింది. అమెరికాలో వలస నిబంధనల అమలుపై పర్యవేక్షణ పెరిగిన నేపథ్యంలో ఈ ఆదేశాలు వెలువడ్డాయి. విదేశీయులు చట్టపరంగా మాత్రమే అమెరికాలో నివాసం కొనసాగించాలని అధికారులు తరచుగా హెచ్చరిస్తున్నారు. దీనికి తోడు డిసెంబర్ 26 నుండి నాన్‌యూస్ పౌరులు (గ్రీన్ కార్డ్ హోల్డర్లతో సహా) అందరికీ సరిహద్దు పాయింట్ల వద్ద తప్పనిసరి బయోమెట్రిక్ తనిఖీలు అమల్లోకి వచ్చాయి. కొత్త నిబంధన ప్రకారం, అమెరికన్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సిబిపి) అధికారులు విమానాశ్రయాలు, సరిహద్దులు, సముద్ర మార్గాల ప్రవేశ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద నాన్‌యూఎస్ పౌరులందరి ఫోటోలు తీసుకుంటారు. 14 ఏళ్ల లోపు పిల్లల నుండి 79 ఏళ్లు పైబడిన వృద్ధుల వరకు, దేశంలోకి వచ్చేవారు లేదా బయలుదేరే వారందరికీ ఈ విధానం వర్తిస్తుంది. భద్రత, వీసా గడువుకు మించి నివాసం ఉండటం వంటి ఆందోళనలను పరిష్కరించడమే ఈ బయోమెట్రిక్ వ్యవస్థ లక్ష్యం అని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ (డిహెచ్‌ఎస్) తెలిపింది. గతంలో పైలట్ కార్యక్రమాలకు మాత్రమే పరిమితమైన నిష్క్రమణ బయోమెట్రిక్ సేకరణ ఇప్పుడు తప్పనిసరి చేసింది.



## మిలిటరీ శిక్షణలో చేరేందుకు సింగపూర్ వెళుతున్న లాలూ మనవడు


**పాట్నా, జనవరి 7:** బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ మనవడు ఆదిత్య సింగపూర్‌లో సైనిక శిక్షణకు వెళుతున్నాడు. రెండేళ్ల పాటు ఆయుధ శిక్షణతో పాటు యుద్ధ సన్నద్ధతకు సంబంధించిన ట్రైనింగ్ పొందనున్నాడు. ఈ విషయాన్ని ఆదిత్య తల్లి, లాలూ ప్రసాద్ యాదవ్ కూతురు రోహిణి ఆచార్య ఎక్స్‌లో వెల్లడించారు. రోహిణి ఆచార్య కుటుంబం సింగపూర్‌లో స్థిరపడిన విషయం తెలిసిందే. రోహిణితో పాటు ఆమె కుటుంబంలో అందరికీ భారత పౌరసత్వమే ఉంది. అయితే, వారంతా సింగపూర్ లో పర్మనెంట్ రెసిడెన్సీ స్టేటస్ పొందారు. సింగపూర్ చట్టాల ప్రకారం 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు రెండేళ్ల పాటు సైనిక శిక్షణ పొందాల్సి ఉంటుంది. సింగపూర్ పౌరులతో పాటు సింగపూర్ పర్మనెంట్ రెసిడెన్సీ పొందిన రెండో తరం పౌరులకు ఈ నిబంధన వర్తిస్తుంది. ఆదిత్యకు ఇటీవలే 18 సంవత్సరాలు నిండడంతో సైనిక శిక్షణకు హాజరవుతున్నాడు. రెండేళ్ల పాటు సాగే ఈ శిక్షణలో ఫిజికల్ ట్రైనింగ్ తో పాటు వివిధ ఆయుధాల వినియోగంపై ప్రాథమిక శిక్షణ అందిస్తారు. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న వారిని రిజర్వ్ దళాలుగా వ్యవహరిస్తారు. భవిష్యత్తులో యుద్ధం సంభవిస్తే ఈ రిజర్వ్ దళాల సేవలను ప్రభుత్వం ఉపయోగించుకుంటుంది.

## అంబర్‌నాథ్ స్థానంకోసం ఒక్కటైన బిజెపి, కాంగ్రెస్

**అబర్‌నాథ్(మహారాష్ట్ర), జనవరి 7:** మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో విస్తుపోయే సమీకరణాలు నెలకొన్నాయి. అంబర్‌నాథ్ మున్సిపల్ మేయర్ ఎన్నిక కోసం కమలం, హస్తం ఒక్కటై డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేకు ఝలక్ ఇచ్చాయి. షిండే నేతృత్వంలోని శివసేనకు మేయర్ పదవి దక్కకూడదనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ సహకారం బీజేపీ తీసుకుంది. బీజేపీ, కాంగ్రెస్, ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) కలిసి అంబర్‌నాథ్ వికాస్ అఘాడి పేరుతో కొత్త కూటమిని ఏర్పాటు చేశాయి. ఈ కూటమి నుంచి బీజేపీ కౌన్సిలర్ తేజశ్రీ కరంజులే మేయర్‌గా ఎన్నికయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో సేన (షిండే వర్గం) అతిపెద్ద పార్టీగా అవతరించినా బీజేపీ రాజకీయ ఎత్తుగడతో అధికారం దక్కకుండా పోయింది. ఈ అనూహ్య పరిణామం మహారాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపింది. బీజేపీ నుంచి 14 మంది, 12 మంది కాంగ్రెస్, నలుగురు ఎన్సీపీ (అజిత్



పవార్ వర్గం), ఒక స్వతంత్ర కౌన్సిలర్ కలిపి కొత్త కూటమి బలం 32కు చేరింది. దీంతో బీజేపీకి కౌన్సిల్‌లో స్పష్టమైన మెజారిటీ లభించింది. ఈ పొత్తును మహారాష్ట్ర కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు అంబర్‌నాథ్ బ్లాక్ చీఫ్ ప్రదీప్ పాటిల్‌తో పాటు, కాంగ్రెస్ తరపున గెలిచిన కార్పొరేటర్లందరినీ పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఇది పూర్తిగా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడమేనని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కల్ అన్నారు. బీజేపీ సీనియర్ నేత, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఈ పొత్తు ఆమోదయోగ్యం కాదని వ్యాఖ్యానించారు. ఎవరైనా స్థానిక నేత సొంతంగా అలాంటి నిర్ణయం తీసుకుంటే, అది క్రమశిక్షణకు విరుద్ధం. అలాంటి పొత్తు ఏర్పడితే, దానిని రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశాం అని ఆయన తెలిపారు. ఈ పరిణామాలపై షిండే సేన తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ ముక్త భారత్ నినాదాన్ని బలంగా నిపించే బీజేపీ, ఆ పార్టీతో చేతులు కలపడం అనైతికమని మండిపడింది. బీజేపీ సిద్ధాంతాలకు విరుద్ధమైన, అనైతిక కూటమిగా శివసేన నాయకులు విమర్శించారు. అధికారం కోసం బీజేపీ తన సిద్ధాంతాలను పక్కన పెట్టిందని ఆరోపించారు. ఇది పూర్తిగా వెన్నుపోటు రాజకీయమేనని శివసేన ఎమ్మెల్యేబాలాజీ కినికార్ దుయ్యబట్టారు. స్థానిక బీజేపీ నేతలు మాత్రం అభివృద్ధి, సుపరిపాలన కోసమే ఈ పొత్తు పెట్టుకున్నామని సమర్థించుకోవడం గమనార్హం.



## సచిన్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ నిశ్చితార్థం

**ముంబయి, జనవరి 7:** భారత క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ ఇంట్లో పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఆయన తనయుడు అర్జున్ టెండూల్కర్ వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. ముంబైకి చెందిన వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలైన సానియా చంధోక్ తో అర్జున్ ఎంగేజ్మెంట్ జరిగిన విషయం తెలిసిందే. తాజాగా వీరి పెళ్లి డేట్ ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మార్చిలోనే అర్జున్ సానియా వివాహం అంగరంగ వైభవంగా జరిపించేందుకు ఇరు కుటుంబ సభ్యులు ముహూర్తం ఫిక్స్ చేసినట్లు టాక్. మార్చి 3, 4, 5 తేదీల్లో పెళ్లి వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకను అత్యంత సన్నిహితులు, బంధుమిత్రులు, కొద్దిమంది క్రికెటర్ల సమక్షంలో జరిపించేందుకు ఇరు కుటుంబాలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు. టెండూల్కర్ కుటుంబానికి కాబోయే కోడలు సానియాది వ్యాపార నేపథ్యమున్న కుటుంబం. తను సచిన్ తనయ సారాకు మంచి స్నేహితురాలు కూడా.

## బిజెపి మహిళా కార్యకర్తపై పోలీసుల దాష్టీకం

**బెంగళూరు, జనవరి 7:** కర్ణాటకలోని హుబ్లీ నగరంలో దారుణమైన సంఘటన చోటుచేసుకుంది. ఓటర్ల జాబితా సవరణ విషయంలో తలెత్తిన వివాదమే ఈ ఘటనకు దారితీసినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబం ధించిన వీడియో బయటకు రావడంతో ఈ అమానుషం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే హుబ్లి కేశ్వాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బిజెపి కార్యకర్త సుజాత హుండి నివాసంలో ఉంటున్నారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్ర మంలో భాగంగా ఆమె ఓటర్ల మ్యాపింగ్ చేప ట్టారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ కార్పొరేట్ సువర్ణ కల్యకుంట్ల, సుజాతపై పోలీ సులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధా రంగా పోలీసులు సుజాతను అరెస్ట్ చేసేందుకు వెళ్లినప్పుడు ఈ ఘటన జరిగింది. మగ పోలీసులు తనపై దాడి చేసి, అసభ్య పద జాలంతో దూషిస్తూ, వివస్త్రను చేశారని బాధితురాలు ఆరోపిస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలను పోలీసులు తోసిపుచ్చుతున్నారు.

సుజాత హుండి తనంతటతానే దుస్తులు విప్పుకుందని వారు చెబుతున్నారు. ఈ ఘటనపై రాష్ట్ర హోంమంత్రి చర్యలు తీసుకోవాలని, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళతామని బిజెపి నేతలు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసుల నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## రెండోదశ సర్‌లో 6.5కోట్ల ఓటర్ల తొలగింపు

**న్యూఢిల్లీ, జనవరి 7:** దేశంలోని తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలితప్రాంతాల్లో పూర్తిచేసిన ఓటర్ల ప్రత్యేక రివిజన్ ద్వారా మొత్తం 6.5కోట్లమంది ఓటర్లను తొలగించినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. రెండోదశ సర్‌ను గత అక్టోబరు 27వ తేదీ ప్రారంభించారు. మొత్తం 50.90 కోట్లమంది ఓటర్ల జాబితాలను పరిశీలించారు.12రాష్ట్రాలు, తొమ్మిది కేంద్రపాలితప్రాంతాల్లో ఈ జాబితాలను పరిశీలించారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించిన తర్వాత మొత్తం ఓటర్లు 44.40 కోట్లకు చేరారు. ఎన్నికల అధికారుల వివరాలప్రకారం తొలగించిన పేర్లపరంగా ఎఎస్‌డి లేదా ఆబ్సెంట్, బదలీ, చనిపోవడం, డూప్లికేట్ ఓటర్ ఐడిలు కలిగి ఉన్నట్లు సర్వేలో గుర్తించారు. గ్రామీణ ప్రాంతాలకంటే పట్టణప్రాంతాల్లోనే ఈ లెక్కింపు పత్రాలు తక్కువ ఉన్నాయి. ముసాయిదా జాబితాలప్రకారం యుపిలో ముందురోజు జాబితానుప్రకటించారు. 12.55 కోట్లు ఓటర్లుండగా2.89 కోట్ల మందిని తొలగిం చినట్లు ప్రకటించింది. రెండోదశ సర్ అండమాన్‌నికోబార్ ఐలాండ్స్, లక్షద్వీప్, ఛత్తీస్‌ఘర్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, యుపి, పశ్చిమబెంగాల్‌లలో నిర్వహించారు. చివరిసారి ఓటర్ల ప్రత్యేకరివిజన రాష్ట్రాల్లో 2003ను ప్రాతిపదికగా తీసుకున్నారు. ఎక్కువ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌ను 2002నుంచి 2004మధ్య ఉన్నజాబితాలనే స్వీకరించారు. అక్రమవలసజీవులు ఎక్కువగా బంగ్లాదేశ్, మైన్మార్‌లనుంచి వస్తున్న వారిని కట్టడిచేసేందుకే ఈ సవరణ చేపట్టినట్లు ఈసీ చెపుతోంది.



## బంగ్లా అల్లరిమూకల దాడిలో మరో హిందువు మృతి

**ఢాకా,జనవరి 12:** బంగ్లాదేశ్ లో హిందూమైనార్టీలపై దాడులకు అంతూ పొంతూ లేకుండా ఉంది. కేర్‌టేకర్ యూనస్ ప్రభుత్వం కనుసన్నల్లోనే ఈ దాడులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా అల్లరిమూకల దాడిలో మరో హిందువు మరణించాడు. స్థానికులు దాడికి ప్రయత్నిస్తుండగా పారిపోతూ ఒక కాలువలో దూకి, ప్రాణాలు కోల్పోయాడు. నౌగావ్ జిల్లాలోని, మొహదేవపూర్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. మృతుడిని 25 ఏళ్ల మిథున్ సర్కార్ గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం మిథున్ సర్కార్‌ను చోరీచేశాడనే నెపంతో స్థానికులు గుంపుగా వెంటాడి పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో మిథున్ పారిపోతూ పక్కనే ఉన్న కాలువలో దూకి రక్షించుకోవాలనుకున్నాడు. కానీ, కాలువలో దూకి ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడి మృతదేహాన్ని ఫైర్ సిబ్బంది సహాయంతో బయటకు తీసి, పోస్టుమార్టమ్ నిమిత్తం తరలించారు. ఇటీవలి కాలంలో బంగ్లాలో హిందువులు సహా మైనారిటీలపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. 2024 నుంచి ఈ దాడులు జరుగుతుండగా గత నెల నుంచి తీవ్రస్థాయికి చేరాయి. 2022 లెక్కల ప్రకారం బంగ్లాదేశ్ లో 13.1 మిలియన్ల హిందువులున్నారు. అంటే అక్కడి జనాభాలో 7.9 శాతం. మరో హిందూమహిళపై సామూహిక లైంగిక దాడిచేసి అనంతరం ఆమెను చెట్టుకు కట్టివేసి జుట్టుకత్తిరించి పైశాచికానందం పొందారు బంగ్లా ముస్లింఆందోళనకారులు. దీనితో అక్కడ హిందువులకు భద్రతకొరవడి. ఏరోజు ఏముప్పు వచ్చిపడుతుందోనని హిందూ మైనార్టీలు భయంతో జీవిస్తున్నారు.

## ఉస్మాన్ హాదీ హత్యకు సింగపూర్‌లో ప్రణాళిక

### ఛార్జిషీట్ దాఖలు చేసిన ఢాకా మెట్రోపాలిటన్ పోలీసులు



**ఢాకా, జనవరి 7:** రాజకీయ ప్రతీకారంతో విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ బిన్ హాదీని హత్య చేశారని, దానిని సింగపూర్‌లో ప్లాన్ చేశారని బంగ్లాదేశ్ పోలీసులు తాజాగా వెల్లడించారు. ఈ కేసులో 17 మందిని నిందితులుగా చేర్చుతూ ఢాకా మెట్రోపాలిటన్ పోలీసులు న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారు. 'అవామీలీగ్‌తోపాటు దాని విద్యార్థి విభాగం ఛత్రా లీగ్‌పై ఉస్మాన్ హాదీ సోషల్ మీడి యా వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. ఛత్రా లీగ్‌తోపాటు దానితో సంబంధం ఉన్న ఇతర గ్రూప్‌ల సభ్యులకు ఆ వ్యాఖ్యలు ఆగ్రహాన్ని తెప్పించాయి. రాజకీయ ప్రతీకారం వల్లే ఈ హత్య జరిగిందని దర్యాప్తులో వెల్లడైంది' అని పోలీసులు వెల్లడించారు. మిర్‌పూర్ మాజీ కౌన్సిలర్ తైజుల్ ఇస్లాం చౌధురీ అలియాస్ బప్పి ఆదేశాల మేరకే హాదీని హత్య చేసినట్లు చెప్పారు. హత్య ప్రణాళిక కోసం జరిగిన సమావేశంలో తైజుల్‌తోపాటు మాజీ ఎంపి ఎలియాస్ మొల్లా, జహంగీర్ కబీర్ నాయక్, షూటర్ ఫైజల్ కరీం మసూద్ పాల్గొన్నారని పేర్కొన్నారు. మసూద్.. విద్యార్థి విభాగం మాజీ నాయ కుడు. కాల్పులు జరిపిన వారిలో ఫిలిప్ అనే వ్యక్తి కూడా ఉన్నాడని చెప్పారు. వీరిద్దరితో పాటు ప్రధాన నిందితుడు అలంగీర్ షేక్ పరారీలో ఉన్నారనన్నారు. కాగా.. చిన్నప్పటి నుంచే ఉద్యమ భావజాలం కలిగిన హాదీ (32), 2024 జూలైలో అవామీలీగ్ నేత, నాటి ప్రధాని షేక్‌హసీనాకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటులో కీలక పాత్ర పోషించాడు.

## హీరోయిన్ కోసం భార్యను చిత్రహింసలు పెట్టిన డైరెక్టర్: పూనమ్‌కౌర్

**ముంబయి, జనవరి 7:** టాలీవుడ్ నటి పూనమ్ కౌర్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పూనమ్ మాట్లాడుతూ, టాలీవుడ్‌లోని ఓ ప్రముఖ డైరెక్టర్ ఓ హీరోయిన్ కోసం తన భార్యను తీవ్రంగా చిత్రహింసలకు గురి చేశాడని ఆరోపించింది. అతడు తన భార్యను దారుణంగా కొట్టడంతో ఆమె కోమాలోకి వెళ్లిపోయిందని, ఆసుపత్రిలో వారం రోజుల పాటు చికిత్స పొందాల్సి వచ్చిందని చెప్పింది. ఇలాంటి దారుణం జరిగినా ఆ భార్య ఎవరికీ చెప్పకుండా మౌనంగా ఉండిపోయిందని, అన్యాయం జరిగినా బయటకు రాలేదని పూనమ్ విచారం వ్యక్తం చేసింది. ఆ హీరోయిన్ సినిమా ఈవెంట్లకు కూడా హాజరవుతూ ఉండేదని, ఈ విషయం తెలిసినప్పుడు తాను చాలా షాక్ అయ్యానని, మనుషులు ఇలా కూడా ఉంటారా అనిపించిందని చెప్పింది. అయితే, పూనమ్ ఆ డైరెక్టర్ పేరును మాత్రం బహిరంగంగా చెప్పలేదు. హీరోయిన్ ఎవరన్నది కూడా రివీల్ చేయలేదు. దీంతో సోషల్ మీడియాలో ఈ వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

# సంక్షిప్తంగా..

## వీధికుక్కలను షెల్టర్‌కు తరలించండి: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, జనవరి 7:** వీధి కుక్కల బెడదపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కుక్క కరిచే మూడ్‌లో ఉన్నప్పుడు దాని మనసును చదవలేరని, చికిత్స కంటే నివారణే ఉత్తమం అని ధర్మాసనం వ్యాఖ్యానిం చింది. గతేడాది నవంబర్ 7న సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, రైల్వే స్టేషన్లలో కుక్క కాటులపై ఆందోళన వ్యక్తం చేసింది. ఆ ప్రాంతాల్లో కుక్కల బెడద లేకుండా చూడాలని ఆదేశించింది. స్టెరిలైజేషన్, టీకాల తర్వాత షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. తిరిగి పట్టుకున్న స్థలాల్లో విడిచి పెట్టొద్దని ముగ్గురు న్యాయమూర్తుల ప్రత్యేక ధర్మాసనం పేర్కొంది.

## భార్య కొడుతోందంటూ కన్నడ నటుడు పోలీసులకు ఫిర్యాదు



**బెంగళూరు, జనవరి 7:** కన్నడ చిత్రపరిశ్రమలో నటుడిగా, టివి సీరియళ్ల ద్వారా గుర్తింపు పొందిన ధను శ్రాజ్, తన భార్య అర్షితపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భార్య తనపై శారీరకంగా దాడి చేసిందని, వేధింపులకు గురిచేస్తోందని, ప్రాణహాని బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపిస్తూ బెంగళూరులోని గిరినగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ధనుశ్ తన ఫిర్యాదులో పేర్కొన్న వివరాలప్రకారం అర్షిత తనకు సరిగా చెప్పకుండా విదేశాలకు వెళ్లింది. ఈ విషయంపై తాను ప్రశ్నించినందుకు ఆమె తనపై దాడి చేసిందని తెలిపారు. అంతేకాకుండా రౌడీలను పంపి కొట్టిస్తానని, అవసరమైతే చంపేస్తానని కూడా బెదిరించినట్లు ఆయన ఆరోపించారు.

## పాకిస్థాన్‌లో ఏకమవుతున్న ఉగ్రసంస్థలు



**ఇస్లామాబాద్, జనవరి 7:** ఉగ్రవాద మద్దతు సంస్థలకు ఆశ్రయం కల్పించడంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన పాకిస్థాన్ తాజాగా ఉగ్ర ముఠా లష్కరే తయ్యిబా (ఎల్ఇటి), హమాస్ నేతల సమావేశానికి వేదికగా మారింది. ఇటీవల పాకిస్థాన్‌లోని గుజ్రాన్‌వాలాలో పాకిస్థాన్ మర్కజే ముస్లింలీగ్ (పిఎంఎంఎల్) నిర్వహించిన కార్యక్రమంలో హమాస్ సీనియర్ కమాండర్ నాజీ జహీర్ పాల్గొన్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. అతడు లష్కరే తయ్యిబా కమాండర్ రషీద్ అలీ సంధుతో భేటీ అయినట్లు తెలుస్తోంది. ఈ రెండు ఉగ్రవాద గ్రూపుల మధ్య సంబంధాన్ని మరింత పెంచుకోవడానికి ఈ సమావేశంలో చర్చలు జరిపినట్లు సమాచారం. వీరి సమావేశానికి సంబంధించిన విడియో సోషల్ మీడియాలో చక్కరు కొడుతోంది. కాగా ఈ కార్యక్రమంలో పాక్ ఆర్మీ అధికారులు కూడా పాల్గొనడం గమనార్హం.

## గ్రీన్‌లాండ్ స్వాధీనం..పరిశీలనలో సైనిక ఆప్షన్: వైట్‌హౌస్



**వాషింగ్టన్, జనవరి 7:** గ్రీన్‌లాండ్ అమెరికాలో భాగంగా మారాల్సిందేనని, అది తమ జాతీయ భద్రతకు అవసరమని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం పునరుద్ఘాటించింది. దానిపై నియంత్రణ సాధిం చేందుకు తమ వద్ద చాలా ఆప్షన్లు ఉన్నాయని, వాటిల్లో సైన్యాన్ని వాడే అంశం కూడా పరిశీలనలో ఉందని వైట్‌హౌస్ ప్రెస్‌సెక్రటరీ కరోలిన్ లీవిట్ పేర్కొన్నారు. గ్రీన్‌ల్యాండ్ వ్యూహాత్మకంగా కీలకమైందని, ఆర్కిటిక్ ప్రాంతంలో ప్రత్యర్థులను ఎదుర్కోవడానికి దానిపై నియంత్రణఅవసరమని భావిస్తున్నారన్నారు. ఆ లక్ష్యం దిశగా ముందుకువెళ్ల డానికి అందుబాటులో ఉన్న అని మార్గాలను పరిశీలించాలని తన బృందానికి సూచించారని చెప్పారు.

## హిందువులు కానివారిపై ఆంక్షలు విధించాలి



**డెహ్రాడూన్, జనవరి 7:** హిందువులు కాని వ్యక్తులపై ఆంక్షలు విధించాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నాయకురాలు డిమాండ్ చేశారు. హిందువుల కాని వారు గంగా ఘాట్‌లలో ప్రవిత్ర స్నాన మాచరించడంపై నిషేధం విధించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో 2027లో అర్ధ కుంభమేళా జరుగనున్నది. ఈ నేపథ్యంలో వీహెచ్‌పీ నాయకురాలు సాధ్వి ప్రాచి మీడియాతో మాట్లాడుతూ కుంభమేళా ప్రాంతాన్ని అమృత క్షేత్రంగా ప్రకటించాలని, హిందువులు కాని వారి ప్రవేశంపై కఠినమైన ఆంక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కొంత మంది మహిళలు ఢిల్లీ నుంచి హరిద్వార్‌కు వచ్చి దురుద్దేశంతో పవిత్ర స్నానాలు చేశారని సాధ్వి ప్రాచి ఆరోపించారు. హిందువుల పవిత్ర స్థలాల్లో ఇలాంటి జిహాదీ కార్యకలాపాలు కుంభమేళా వంటి మతపరమైన సమ్మేళనాలకు ముప్పు కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# కొత్త పాస్ పుస్తకాలతో రైతుల్లో భరోసా



- ట్యాంపరింగ్‌కు తావులేదు, రికార్డులు సురక్షితం
- తప్పులు లేకుండా కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వండి
- గ్రామసభల్లో నిర్ధారించుకున్న తర్వాతే ముద్రణ
- రైతులకు నేరుగా పాస్ పుస్తకాలు అందజేత
- మీ భూమి.. మీ హక్కు రైతులకు ప్రభుత్వ హామీ
- 9న మండపేటలో పట్టాదారుపాస్ పుస్తకాల పంపిణి
- రెవెన్యూ శాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు

విజయవాడ, జనవరి 7 ప్రభాతవార్త ప్రతినిధి: రైతుల్లో నమ్మకం, భరోసా కల్గించేలా కొత్త పాస్ పుస్తకాలను అందచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తప్పులు లేకుండా రికార్డులను సరిచేసి కొత్త పాస్ పుస్తకాల పంపిణీ జరగాలని ఆదేశించారు. ఈ నెల 2వ తేదీ నుంచి మొదలైన కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా రెవెన్యూ మంత్రి, ఆ శాఖ ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ "ప్రభుత్వం పంపిణీ చేస్తున్న కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలతో రైతుల్లో నమ్మకం, భరోసా కలగాలి. భూ రికార్డుల్లో గతంలో జరిగిన తప్పులను సరిదిద్దాలి. కొత్త పాస్ పుస్తకాలను ముద్రించే ముందుగానే గ్రామసభల్లో ఆయా రైతుల నుంచి భూ వివరాలు నిర్ధారించుకోవాలి. ఆ తర్వాతే కొత్త పాస్ పుస్తకాలను ముద్రించాలి. రికార్డులను తారు మారు చేయడానికి ఆస్కారం లేని విధంగా కొత్త పాస్ పుస్తకాలను తీర్చిదిద్దాం. ఎవ్వరూ ట్యాంపర్ చేయకుండా, నకిలీ పాస్ పుస్తకాలు తయారు చేయకుండా పాస్ పుస్తకాలను ముద్రించాలి. పాస్ పుస్తకాల ముద్రణలో ప్రభుత్వం తీసుకున్న జాగ్రత్తలను అర్థమయ్యేలా చెప్పాలి." అని సూచించారు.

### మీ భూమి... మీ హక్కు..

"మీ భూమిమీ హక్కు. ఇది రైతులకు ప్రభుత్వం కల్పించే భరోసా. ప్రస్తుతం ఇస్తున్న కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాల ద్వారా తమ భూమి భద్రంగా ఉందా..? లేదా..? అనే విషయాన్ని రైతులు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. రికార్డుల్లో ఏమైనా మార్పులు చేర్పులు చేస్తే... కచ్చితంగా భూ యజమాని అనుమతితోనే జరగాల్సి ఉంటుంది. రికార్డులు భద్రంగా ఉండేలా కొత్త పాస్ పుస్తకాలను ముద్రించాం. ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలను రైతులకు వివరించాలి. భవిష్యత్తులో రెవెన్యూ శాఖ ప్రమేయం లేకుండానే రైతులు వారికి అవసరమైన పాస్ పుస్తకాలను ఆన్‌లైన్‌లో పొందే విధానాన్ని అమలు చేయాలి. ఈ క్రమంలో పూర్తి స్థాయిలో టెక్నాలజీని వినియోగించుకోవాలి." అని సీఎం వివరించారు. మీరు చెబుతున్న దాని ప్రకారం, మీ నివేదికల ప్రకారం... అంతా పక్కాగా రైతుల సమక్షంలోనే రీసర్వే జరుగుతుంటే తప్పులు ఎందుకు వస్తున్నాయి? రైతులకు నోటీసులు ఇచ్చే సర్వే చేస్తున్నారా? సర్వేలో రైతులను భాగస్వాములను చేస్తున్నారా? అని సీఎం అధికారులను ప్రశ్నించారు. సర్వే సరిహద్దుల చట్టం ప్రకారం వ్యవహరిస్తున్నామని, రైతుల సమక్షంలోనే కొలతలు వేస్తున్నామని అధికారులు నివేదించారు. అదే నిజమైతే రైతులు ఎందుకు ఆందోళనగా ఉన్నారని సీఎం ప్రశ్నించారు. క్షేత్రస్థాయి తనిఖీలు చేశారా? రైతులతో మాట్లాడుతున్నారా? అని ఆరా తీసినట్లు సమాచారం. సర్వే ముగిసిన తర్వాత రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిశీలించాలని ఆదేశించారు. రైతుల విన్నపాలు కచ్చితంగా పరిశీలన చేయాలని... కోర్టు కేసులు, కుటుంబ తగాదాలున్నవి మినహా చట్ట పరిధిలో ఉన్న ప్రతి సమస్యనూ పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. రీ సర్వే జరుగుతున్న గ్రామాలకు వెళ్లి స్వీయపరిశీలన చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు ఈ అంశంపై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయికి వెళ్లి పర్యవేక్షణ చేయాలన్నారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు పంపిణీ చేయడానికి కొత్తగా రాజముద్రతో రూపొందించిన పట్టాదారు పాస్‌పుస్తకాల్లో తప్పులు ఎందుకు వచ్చాయని సిఎం ప్రశ్నించారు. ఈ తప్పులకు కారణాలు ఏమిటి? రైతుల పేర్లు, ఫొటోలు, ఇతర వివరాలు ఎందుకు తప్పుగా వచ్చాయి? ముద్రణకు ముందే రైతుల డేటాను పునః పరిశీలించలేదా? గ్రామ సభలు నిర్వహించలేదా? అని సిఎం ప్రశ్నించారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ జోక్యం చేసుకొని, గత జూన్ డేటా ఆధారంగా పాసుపుస్తకాల ముద్రణ జరిగిందని వివరించారు. వీటిని గత ఆగస్టులోనే ఇద్దామనుకున్నామని, కానీ, జాప్యంవల్ల ఈ సమస్యలు వచ్చాయని వివరించినట్లు తెలిసింది. ఈ నే పథ్యంలో రెవెన్యూ రికార్డులను తాజాపరిచిన తర్వాతే కొత్త పాస్‌పుస్తకాలు అందించాలని సిఎం ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చే పాస్‌పుస్తకాల ద్వారా రైతుల్లో నమ్మకం, భరోసా పెరగాలి. భూ రికార్డుల్లో గతంలో జరిగిన తప్పులను సరిదిద్ది ఇవ్వాలి. కొత్త పాస్‌పుస్తకాలు ముద్రించే ముందుగానే గ్రామసభల్లో ఆయా రైతుల నుంచి నిర్ధారణ చేసుకోవాలి. ఆ తర్వాతే ముద్రించాలి. రికార్డులను తారుమారు చేయడానికి ఆస్కారం లేకుండా తీర్చిదిద్దాం. ఎవరైనా ట్యాంపర్ చేయాలని ప్రయత్నించినా దొరికిపోతారు. ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి జాగ్రత్తలు తీసుకుందో రైతులకు వివరంగా చెప్పాలి. రికార్డుల్లో చేసే మార్పులకు రైతులకు ముందుగా సమాచారం ఇవ్వాలి. నోటీసులు ఇవ్వాలి అని సీఎం ఆదేశించారు. రైతులు, భూ యజమానుల సమస్యల పరిష్కారంలో జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేశారు. ఇది రైతు సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమిచ్చే ప్రభుత్వం. రీ సర్వే, పాసుపుస్తకాల జారీలో రైతుల సంతృప్తిస్థాయి ఎంత ఎక్కువగా ఉంటుందన్నదే కీలకం. దానికి అనుగుణంగానే మీరూ పని చేయాల్తి అని తేల్చి చెప్పారు. పట్టాదారు పాస్‌పుస్తకాల్లో రాజముద్ర, క్యూఆర్‌కోడ్‌తోపాటు మీ భూమి మీ హక్కు, జై భారత్, జై తెలుగు తల్లి అనే నినాదాలు ముద్రించాలని సీఎం ఆదేశించారు. పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీలో భాగంగా సిఎం చంద్రబాబు ఈ నెల 9న మండ పేట ప్రాంతానికి వెళ్లనున్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. అనంతరం రైతులకు పాస్‌పుస్తకాలు అందించనున్నారు.



## ముఖ్యమంత్రితో ఎన్ఎంసి చైర్మన్ భేటీ

విజయవాడ, జనవరి 7 ప్రభాతవార్త ప్రతినిధి: నేషనల్ మెడికల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ అభిజత్ చంద్రకాంత్ సేత్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వైద్యరంగానికి సంబంధించి రాష్ట్రంలో చేపట్టిన సంస్కరణలు. కార్యచరణ తదితరంశాల్లో నేషనల్ మెడికల్ కమిషన్ సహకారంపై డాక్టర్ చంద్రకాంత్ సేత్ చంద్రబాబుకు వివరించారు. మెడికల్ కళాశాలల్లో మౌలిక వసతుల కల్పన, వివిధ ప్రాధాన్యతా రంగాల్లో నిపుణత గల వైద్యులు నియామకం వివిధ అంశాలపై డాక్టర్ చంద్రకాంత్ సేత్ సిఎంకు వివరించారు. డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ కూడా ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం
### ఆంధ్రప్రదేశ్‌పై ప్రభావం తక్కువే

విజయవాడ, జనవరి 7 ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీలంక సమీపంలోని ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా బలపడిందని, ఇది పశ్చిమవాయవ్య దిశగా కదులుతూ నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. అనంతరం 48 గంటల్లో తమిళనాడు తీరం వైపు కదిలే సూచనలు ఉన్నాయని పేర్కొంది. ఆ తర్వాత ఇది తీవ్ర వాయుగుండంగా బలపడుతుందని తెలిపింది. అయితే దీని ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై ఉండబోదని వాతావరణ నిపుణులు స్పష్టం చేశారు. తమిళనాడులో మాత్రం విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, రాబోయే మూడు రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం కొనసాగుతుందని , కొన్ని ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. శనివారం దక్షిణ కోస్తా, రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా, మిగిలిన ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత కొంత తగ్గే అవకాశం ఉంది.

## నవీన్‌కు మంత్రి నారాయణ వైద్యసాయం

విజయవాడ. జనవరి 7 ప్రభాతవార్త ప్రతినిధి: థాయిలాండ్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఐసియులో చికిత్స పొందుతున్న నెల్లూరుకు చెందిన నవీన్ కుమార్‌కు ఎపి మంత్రి నారాయణ అండగా నిలిచారు. నవీన్‌కు సహాయం చేయాలని మంత్రి నారాయణను ఆయన బంధువులు కోరారు. దాంతో తక్షణమే స్పందించి ఎపి ఎన్ఆర్టీ చైర్మన్ వేమూరి రవికి మంత్రి సమాచారం అందించారు. అంతే కాకుండా ఢిల్లీలో ఎపి రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ కుమార్‌తో మంత్రి నారాయణ మాట్లాడారు. నవీన్ కుమార్‌కు అవసరమైన వైద్య చికిత్సతో పాటు ఇతర సాయం అందించాలని మంత్రి కోరారు.

### పిపిపి విధానంలో వైద్యకళాశాల నిర్వహణ
## హైకోర్టు వైసిపి పిల్

విజయవాడ, జనవరి 7 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీలోని 17 మెడికల్ కళాశాలలను పీపీపీ ద్వారా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడిపించాలని కోరుతూ ఏపీ హైకోర్టులో వైసీపీ పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ (పిల్) దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ చేపట్టింది. ప్రజలకు ఉచితంగా, మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ఈ మెడికల్ కళాశాలలను తాము ఏర్పాటు చేశామని వైసీపీ తన పిటిషన్‌లో పేర్కొంది. ప్రైవేట్ వ్యక్తులు లేదా సంస్థల జోక్యం ఉండకూడదని, అలా జరిగితే పేదలకు వైద్య విద్యా అవకాశాలు దూరమవుతాయని ఆ పార్టీ వాదిస్తోంది.

అప్పటి ప్రభుత్వం ఈ కళాశాలల నిర్వహణకు బడ్జెట్ భారం లేకుండా చూసుకునేలా విధానాలు రూపొందించిందని, కొన్ని సీట్లను మాత్రమే డొనేషన్‌కు కేటాయించి ఆ ఆదాయాన్ని ఆసుపత్రుల అభివృద్ధికి వినియోగించేలా మార్గదర్శకాలు తయారు చేసిందని కోర్టుకు పిల్‌లో వివరించింది. పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) మోడల్‌లో ఈ కళాశాలలను నడిపిస్తే వైద్య విద్య మాత్రమే కాకుండా, సామాన్యులకు వైద్య సేవలు కూడా అందుబాటులో ఉండవని, అవి కొనుక్కోవాల్సిన పరిస్థితి వస్తుందని వైసీపీ తన పిల్‌లో ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం చెబుతున్నట్టు ఆర్థిక భారం ఎక్కువగా ఉందన్నది వాస్తవం కాదని, ఇందుకు సంబంధించి ప్రజల అభిప్రాయం తెలుసుకోవడానికి కోటి సంతకాలు సేకరించామని కూడా కోర్టుకు తెలిపింది. టెండర్ల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అనుబంధ పిటిషన్ కూడా దాఖలు చేసింది. ప్రతివాదులుగా రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఎంఎస్ఐడీసీ, ఏపీ మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, నేషనల్ మెడికల్ కౌన్సిల్‌లను వైసీపీ చేర్చింది.

# రిపబ్లిక్ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- సచివాలయంలో సిఎస్ విజయానంద్ ఉన్నత సమీక్ష



సచివాలయం,జనవరి 7,ప్రభాతవార్త : రాజధాని ప్రాంతంలో తొలిసారిగా ఈనెల 26వ తేదిన 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించి పటిష్టమైన విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకల సన్నాహక ఏర్పాట్లపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ఈనెల 26వ తేది ఉదయం రాజధాని ప్రాంతంలో తొలిసారిగా బహిరంగ ప్రదేశంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నందున ఆ కార్యక్రమం విజయవంతానికి వివిధ శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించి అవసరమైన సూచనలు జారీ చేశారు. వేడుకల ప్రాంగణంలో తగిన తాగునీటి వసతి, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగు దొడ్లు, భారీ కేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. ఏర్పాట్ల విషయంలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారంలేని రీతిలో గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో లోక్‌భవన్, హైకోర్టు, అసెంబ్లీ, రాష్ట్ర సచివాలయం, సిఎం క్యాంపు కార్యాలయం సహా ఇతర ముఖ్య భవనాలను విద్యుద్దీపాలతో అలంకరించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖ తీసుకోవాల్సిన బందోబస్తు ఏర్పాట్లు,ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి ఏర్పాట్లపై సూచనలు, సెరిమోనియల్ పెరేడ్‌కు తగిన ఏర్పాట్లు సక్రమంగా చేయాలని చెప్పారు. ఉద్యానవన శాఖ వేడుకల ప్రవేశద్వారాన్ని పూలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు ప్రవేశ మార్గానికి ఇరువైపులా పూల కుండీలు ఏర్పాటు చేసి అందంగా తీర్చిదిద్దాలన్నారు. సమాచార శాఖ ద్వారా ముఖ్యఅతిథి గణతంత్ర దినోత్సవ సందేశం ప్రచురణ, సరిపడిన ప్రతులు సిద్ధంచేసి అందరికీ పంపిణీ చేసే ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ శాఖలతో సమన్వయం చేసుకొని ఆయా శాఖల వారీ శకటాల ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిరంతరం విద్యుత్ సరఫరాకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ వేడుకల ప్రాంగణంలో అత్యవసర బృందాలను, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. మొత్తం ఏర్పాట్లన్నీ గుంటూరు జిల్లా కలెక్టర్ వివిధ శాఖలతో సమన్వయం చేసుకొని పర్యవేక్షించాలని సిఎస్ అధికారులకు సూచనలు జారీ చేశారు. రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి శ్యామల రావు, వివిధ శాఖల వారీగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. శకటాలకు సంబంధించి ఈనెల 8వ తేది గురువారం నాటికి థీమ్స్‌ను సిద్ధంచేసి పంపాలని చెప్పారు. ఈ సమావేశంలో సిఆర్డీఏ కమీషనర్ కె.కన్నబాబు, ఐ అండ్ ఏఆర్ డైరెక్టర్ కె.ఎస్.విశ్వనాధన్, ఆర్టిజిఎస్ సిఈఓ ప్రఖర్ జైన్, జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, అటవీ దళాధిపతి డాక్టర్ పి.వి. చలపతిరావు, ప్రోటోకాల్ అదనపు డైరెక్టర్ మోహనరావు పాల్గొన్నారు. వర్చువల్‌గా ఎంఎయుడి ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, అదనపు డిజిపి శాంతి భద్రతలు మధుసూదన్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్, కమీషనర్ జి.వీరపాండ్యన్, ఆర్ అండ్ ఐ, ట్రాన్స్‌కో, ఉద్యానవన, అగ్నిమాపక, ఆర్మీ, ఎన్‌సిసి తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



## గౌరమ్మ దర్శనమిచ్చిన జ్ఞానప్రసూనాంబదేవి

శ్రీకాళహస్తి, జనవరి 7 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసం సందర్భంగా జ్ఞాన ప్రసూనాంబదేవి గౌరమ్మగా ప్రతి రోజూ దర్శనమివ్వటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో బుధవారం అమ్మవారికి అలంకార మండపంలో చక్కగా ముస్తాబు చేసారు. బోయిలు రుద్రాక్షల పల్లకిలో అమనమవారిని ప్రతి మోసుకొస్తుండగా రుద్రాల అలకిడి శివ శివా అన్నట్లు వినబడింది. అమ్మవారిన బోయిలు శివయ్య, రాజగోపురం గుండా వాహనాల మండపం వద్దకు తెచ్చి రథంపై ప్రతిష్టించి అమ్మవారి పుర ప్రదర్శనను ప్రారంభించారు. తేరువీధిలో మొదటి పూజలు,హారతులను అలయ మిరాసి దారులు బాబు గురుకుల్ ఇంటి వద్ద పరశురామ్ గురుకుల్ అనే డాక్టర్ అచ్చితా అందించారు. ఇంటింటి వద్ద అమ్మవారికి హారతులిచ్చారు. నాలుగు మాడావీధుల్లో ఇంటింటి వద్ద గొబ్బను ఏర్పాటు చేసి ముస్తాబులు చేసారు. ఉత్సవంతో పాటు ఇన్సెపెక్టర్ సుబ్రమణ్యం వెంట రాగా మేళతాళాలు మంగళ వాయిద్యాదలతో అమ్మవారు కనువిందు చేసారు.



## శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంకట హర చతుర్థి హోమాలు

శ్రీకాళహస్తి, జనవరి 7 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో బుధవారం సంకటహర చతుర్థి పూజలు, హోమాలు నిర్వహించారు. వరాలివ్వటానికి మూలమైన కన్యామూల గణపతి ఆలయం వద్ద బుధవారం హోమాలు ఏర్పాటు చేసారు. ఎస్ఎంకె శ్రీనివాసు గురుకుల్ సారధ్యంలో పూజలు నిర్వహించారు. శ్రీనివాసు గురుకుల్ శాస్త్రోక్తంగా హోమాలు పూర్ణాహుతి గావించారు. ఆలయ పౌరోహి తులు అరథగిరి స్వామి వేదమంత్రాలను పఠించారు. కన్యామూల గణపతి ఆలయం వద్ద కలశ స్థాపన గావించారు. హోమాలు వెలిగించారు. ఆలయం తరఫున డిప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్ సంకల్పంతో పూజలు నిర్వహించారు. ఏర్పాట్లును అర్చకుడు గోవిందస్వామి పర్యవేక్షించగా పూర్ణాహుతితో పూజలు ముగిసాయి.

## వాక్ స్వాతంత్ర్యం పేరుతో దుష్ప్రచారం సహించం

- సోషల్ మీడియాలో పోస్టులపైనా కఠిన చర్యలు
- కేబినెట్ సబ్ కమిటీ భేటీలో మంత్రి లోకేష్



విజయవాడ, జనవరి 7 ప్రభాతవార్త ప్రతినిధి: సోషల్ మీడియా వేదికగా కుట్రపూరితంగా విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై ఉక్కుపాదం మోపుతామని, అటువంటి వారిపై అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వ నిర్ణయాలపై వచ్చే సద్విమర్శలను మనస్ఫూర్తిగా స్వాగతిస్తామని, అయితే వాక్ స్వాతంత్రం (ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్) పేరుతో వ్యవస్థీకృతంగా చేసే దుష్ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియా జవాబుదారీతనం, పౌరుల రక్షణ అనే అంశంపై ఏర్పాటైన మంత్రుల బృందం సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ వ్యక్తిత్వ హననానికి పాల్పడటం, మహిళలను కించపరిచేలా అసభ్యకర పోస్టులు పెట్టడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత డీప్ ఫేక్ కంటెంట్‌ను అరికట్టాలి. మహిళలపై అవమానకరమైన పోస్టులు పెట్టే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. ప్రజాభిప్రాయాన్ని అడ్డుకోవడం మా ఉద్దేశం కాదు. కానీ, కొందరు విదేశాల్లో ఉంటూ ఇక్కడి సామాజిక సామరస్యానికి భంగం కలిగించేలా పోస్టులు పెడుతున్నారు. వారిని గుర్తించి చర్యలు తీసుకునేందుకు వీలుగా బలమైన చట్టపరమైన వ్యవస్థను (లీగల్ ఫ్రేమ్‌వర్క్) రూపొందించాలి" అని అధికారులను ఆదేశించారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి భార్యపై అనుచిత పోస్టులు పెట్టిన వ్యక్తి తమ పార్టీకి చెందిన వాడైనా జైలుకు పంపించామని ఈ సందర్భంగా లోకేశ్ గురుచేశారు. సోషల్ మీడియా నియంత్రణ కోసం ఇతర రాష్ట్రాలు, దేశాల్లో అమలవుతున్న చట్టాలను అధ్యయనం చేయాలని లోకేశ్ సూచించారు. ఆస్ట్రేలియా, యూరోపియన్ యూనియన్, యూకే వంటి దేశాల్లో స్వతంత్ర నియంత్రణ సంస్థలు పనిచేస్తూ భారీ జరిమానాలు విధిస్తున్నాయని ఆయన ప్రస్తావించారు. గతంలో న్యాయవ్యవస్థను లక్ష్యంగా చేసుకుని కూడా అసభ్య పోస్టులు పెట్టారని, ఇలాంటి ధోరణులకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఈ సమావేశంలో పాల్గొన్న హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. సైబర్ నేరాలకు సంబంధించి కేసుల నమోదు, చార్జిషీటు దాఖలులో జాప్యం జరుగుతోందని, ఈ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. నెల రోజుల్లోగా చార్జిషీటు దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలని, విద్వేషపూరిత పోస్టులు పెట్టే వారి సోషల్ మీడియా ఖాతాలను తక్షణమే సస్పెండ్ చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రిటైర్డ్ న్యాయమూర్తులు, న్యాయ నిపుణుల సలహాలు తీసుకుని పటిష్టమైన చట్టాన్ని రూపొందిస్తామని, రాష్ట్రస్థాయిలో సమన్వయ సెల్స్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో పాటు హోం, న్యాయ, ఐటీ, సమాచార శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు
### సమన్వయంతో పని చేసి విజయవంతం చేద్దాం
### ఆలయ సిబ్బందితో ఇఓ, చైర్మన్ సమీక్షా సమావేశం



శ్రీకాళహస్తి, జనవరి 7 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాల పండగను అధికారులు,సిబ్బంది, ధర్మకర్తల మండలి సమన్వయంతో పని చేసి విజవంతం చేద్దామని బుధవారం పరిపాలనా భవనంలో జరిగిన సమీక్షా సమావేశంలో నిర్ణయించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇఓ డి.బాపిరెడ్డి ఇప్పటి వరకు చేపట్టిన పనులను చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించి సభ దృష్టికి తెచ్చారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ సారి ముందుగా వచ్చాయని తెలిపారు. ఫిబ్రవరి 10 నుంచి 23వరకు జరిగే బ్రహ్మోత్సవాలను సమన్వయంతో పని చేద్దామని ఇఓ బాపిరెడ్డి సూచించారు. గత ఏడాది నిర్వహించిన అనుభవాలతో ఈ ఏడాది భక్తులు మెచ్చేరీతిలో నిర్వహిద్దామని పిలుపు నిచ్చారు. ఇది ఏదో శివయ్యకు సంబంధించింది అనుకోకుండా ప్రతి ఒక్క విభాగాధిపతి తమ సిబ్బందితో ఇది తమ సొంతింటి పండగగా భావించి జవాబుదారి తనంతో పని చేయాలని చైర్మన్, ఇఓ కోరారు. ఈ సందర్భంగా పలు అంశాలకు సంబంధించి కీలకంగా చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనంనారాయణ రెడ్డి, స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సూచనలను అమలు చేయటానికి చర్చించారు. ముఖ్యంగా వచ్చే భక్తులకు క్యూలైన్లు ఏర్పాటును కట్టుదిట్టంగా ఇంజనీరింగ్ విభాగం పని చేయాలన్నారు. క్యూలైన్లలో మంచినీరు, మజ్జిగ, పాలు, బిస్కెట్లు గత ఏడాది కన్నా అధికంగా సరఫరా చేయాలని సూచించారు. భక్తుల రద్దీకి తగ్గట్లు లడ్డు, వడ, పులిహోర ప్రసాదాలను అందుబాటులో ఉంచుకోవాలని తీర్మానించారు. అంతేకాక వచ్చిన భక్తుల ఆరోగ్య రీత్యా ఉచిత వైద్యకేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. అన్నదానంలో వచ్చిన ప్రతి ఒక్కరికి రుచికరమైన భోజనం ఎంత మంది వచ్చినా ఏర్పాటు చేయాలన్నారు.

ఆలయం చుట్టు ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ భక్తులు సెదతీరటానికి నీడను కల్పించుటకు ప్రత్యేక షామియానాలను ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ తాత్కాలిక లైటింగ్, ఎఇడి స్క్రీన్స్ ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి భక్తులకు భద్రత కల్పించాలన్నారు. తెప్పోత్సవం ,కల్యాణోత్సవం, గిరిప్రదక్షిణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఇఓ డి.బాపిరెడ్డి, డిప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, బోర్డు సభ్యులు నాగరాజు, విజయమ్మ, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, రాజేష్ గురుకుల్, ఇఇ శ్రీనివాసులురెడ్డి పరిపాలన, ఆలయ, ఇంజనీరింగ్, శానిటేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కుప్పం ప్రపంచపటంలో కనిపించేలా సిఎం కృషి

### - ప్రభుత్వవిప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

### - బౌల్డరింగ్ ఫెస్టివల్‌తో పర్యాటకప్రగతికి తొలిఅడుగు!!



విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్

**కుప్పం, జనవరి 7 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడు కుప్పాన్ని ప్రపంచ పటంలో పెట్టేలా కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకా ంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం కంగుందిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కంగుందిలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి బౌల్డరింగ్ ఫెస్టివల్‌తో విదేశీ పర్యాటకులను ఆకర్షించడం ద్వారా ఈ ప్రాంతంలో టూరిజ ం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. తదేకం ఫౌండేషన్ వారు ఏడాది కాలంగా ఇక్కడ చేస్తున్న కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకు ంటాయన్నారు. ముమ్ముందు ప్రపంచ పర్యాటకులు కుప్పం వచ్చేందుకు ప్రస్తుతం జరుగుతున్న బౌల్డరింగ్ ఫెస్టివల్ తొలిఅడుగు అన్నారు. ఈ ఫెస్ట్ రాష్ట్రంలోని మొదటి కార్యక్రమం అన్నారు. కుప్పంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందితే ఆదాయం, యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. త్వరలోనే మల్లప్పకొ ండ వద్ద సైతం జాతీయ స్థాయి బైక్ రేస్ ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వెయ్యేళ్ల చరిత్ర గల కంగుందికి ఇదివరకే సిఎం చంద్రబాబు 3కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం ఇండియన్ మౌంటైనింగ్ ఫెడరేషన్ సహకారంతో బౌల్డరింగ్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడకు వచ్చిన పర్యాటకులను ఈ ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన ప్రాంతాలు చూపించడం జరుగుతోందన్నారు. పూల ప్రదర్శన, వాటర్‌ఫాల్స్ ర్యాప్లింగ్, కోకోనట్ ఫెస్టివల్, పశువుల ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ముప్పై హోంస్టే (ఇంటి బస) ఏర్పాటుచేశామన్నారు. ఎపిఇడబ్ల్యుసి ఛైర్మన్ రాజశేఖర్ మాట్లాడుతూ బౌల్డరింగ్ ఫెస్ట్‌కు ఈనెల 9న రాష్ట్ర మంత్రులు ఆనంరామనారాయణరెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, 10న టూరిజం మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే పంతం నానాజీ, శాప్ ఛైర్మన్ రవినాయుడు హాజరవుతారన్నారు. ఇదివరకే ఓపెన్ జిమ్‌కు శాప్ ఛైర్మన్ 8లక్షలు మంజూరు చేశారన్నారు. సమావేశంలో ఎపిఇడబ్ల్యుసి ఛైర్మన్ రాజశేఖర్, సర్పంచ్ ధనశేఖర్, టిడిపి మండలఅధ్యక్షుడు రాజగోపాల్, నేతలు దివాకర్, షరీఫ్, మహేంద్ర, విసి మంజునాథ్, సుబ్బు, తదేకం ఫౌ ండేషన్ మాధవి పాల్గొన్నారు.

# ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగలు అరెస్టు

### - రూ.50 లక్షల విలువైన 350 గ్రాముల బంగారం, డైమండ్స్, వాహనాలు స్వాధీనం :ఎస్పీ తుషార్ డూడి



ముగ్గురు అంతర్‌రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

**చిత్తూరు, జనవరి 7 ప్రభాతవార్త:** ఇంటి దొంగతనాలకు పాల్పడే ముగ్గురు అంతర్‌రాష్ట్ర దొంగలను పలమనేరు పోలీసులు అరెస్టు చేసి వారి నుండి 50 లక్షల రూపాయల విలువైన 350 గ్రాముల బంగారం, డైమండ్ నగలు, ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలను పలమనేరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు పోలీసు గెస్ట్‌హౌస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ తుషార్ డూడి వివరాలు వెల్లడిస్తూ పలమనేరు పోలీసులు గుంటూరు జిల్లాకు చెందిన రాయపాటి వెంకయ్య(49), పల్నాడు జిల్లాకు చెందిన షేక్ నాగుల్‌మీనా(27), గుంటూరు జిల్లాకు చెందిన యక్కంటి తులసీరామిరెడ్డి(26)లను అరెస్టు చేసి వారి నుండి దొంగతనానికి గురైన బంగారు నగలు, డైమండ్స్‌తో పాటు ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారన్నారు. గత ఏడాది జులై 15వ తేదీనఫోటో: 04సిటిఆర్07: ముగ్గురు అంతర్‌రాష్ట్ర నిందితులను అరెస్టు చేసి దొంగతనం వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ తుషార్ డూడి పలమనేరులోని అయ్యాకన్న వీధిలో నివాసం వఉంటున్న బాలాజీ ఇంట్లో ఎవరు లేని సమయంలో దొంగతనం జరిగిందన్నారు. ఈ కేసుకు సంబంధించి పలమనేరు పోలీసులు గత ఏడాది జులై 18వ తేదీన కేసు నమోదు చేశారన్నారు. తన ఆదేశాల మేరకు పలమనేరు డిఎస్పీ డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో పలు పోలీసు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో సాంకేతిక ఆధారాలతో విస్తృతంగా విచారణ చేయడం జరిగిందన్నారు. ఈ దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు మంగళ వారం సాయంత్రం 4.15 గంటలకు చిత్తూరు– బెంగళూరు రహదారిపై నాగమంగళం ఫ్లైఓవర్ వద్ద ముద్దాయిలు వున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి వెళ్ళి వారిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.50 లక్షల విలువైన బంగారు నగలు, డైమండ్స్‌తో పాటు ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితులను విచారిస్తే ఒక్క పలమనేరులో మాత్రమే కాకుండా పుంగనూరు, గంగవరం, బెంగళూరు, ముళ్‌బాగల్, బంగారుపేట, కోలారు, కృష్ణగిరిల్లో సైతం నేరాలకు పాల్పడినట్లు వెల్లడైందన్నారు. పట్టుబట్ట నిందితుల్లో రాయపాటి వెంకయ్యపై సుమారు వంద కేసులు వున్నాయని, అలాగే షేక్ నాగుల్ మీరాపై సుమారు 75 కేసులు, యక్కంటి తులసీరామిరెడ్డిపై 6 కేసులు వున్నాయన్నారు. పలమనేరులో జరిగిన దొంగతనం కేసుల్లో నిందితులను చాకచక్యంతో పట్టుకున్న పోలీసులను ఎస్పీ తుషార్ డూడి అభినందించారు.

## పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్యకళాశాల్లో వచ్చే యేడాది ఎంబిబిఎస్ ప్రవేశాలు

**సచివాలయం,జనవరి 7,ప్రభాతవార్త :** పిడుగురాళ్ళ ప్రభుత్వ వైద్య కళాశాల్లో 2026న27విద్యా సంవత్సరంలో ఎంబిబిఎస్ ప్రవేశాలను కల్పించే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైద్యారోగ్య శాఖ చేసిన కొన్న ప్రధాన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం కింద రాష్ట్ర ప్రభుత్వమే పిడుగురాళ్ళ కళాశాలను నిర్మించి, నిర్వహించనుంది. ఈ పథకం కింద కేంద్రం పిడుగురాళ్ల కళాశాలకు రూ.195కోట్ల సహాయాన్ని మంజూరుచేసిన రాష్ట్రానికి విడుదల చేసింది. మొదటి దశలో 100ప్రవేశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బంది నియామకాలకు సంబంధించి పతిపాదనలను సీఎం అంగీకరించారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రస్తుత నిబంధనల మేరకు 100ఎంబిబిఎస్ ప్రవేశాలకు 420 పడకలతో కూడిన బోధనాసుపత్రిని సమకూర్చాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం 6పడకల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని 330పడకల సామర్థ్యం కలిగిన జిల్లా ఆస్పత్రిగా అభివీద్ధి చేసేందుకు అనుమతించింది తప్పుదోవ పట్టించిన గత ప్రభుత్వం గత ప్రభుత్వం నిర్మంచదలచిన మొత్తం 17ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఒక్కో కాలేజీలో 150ఎంబిబిఎస్ సీట్లు చొప్పున మొత్తం 2,500ఎంబిబిఎస్ ప్రవేశాలకు ప్రణాళికలు రచించి, నిర్మాణాలు చేపట్టామని మాజీ సీఎం జగన్మోహనరెడ్డి, అతని సహచరులు రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించారని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వం పిడుగురాళ్ళ ప్రభుత్వ వైద్య కళాశాలలలో కేవలం 100ప్రవేవాలకు మాత్రమే అనుమతిస్తూ మెమో జారీ చేసిందన్నారు. ఇదే రీతిన పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కూడా జగన్ ప్రభుత్వం ఎన్ఎంసి నుంచి 100ఎంబిబిఎస్ ప్రవేశాలకు మాత్రమే అనుమతి పొందిందని మంత్రి తెలిపారు.

2023లో సవరించబడిన ఎన్ఎంసీ నిబంధనల మేరకు ఎన్ఎంసీకి ధరఖాస్తు చేసుకునే నాటికే

150ప్రవేశాలకు 620పడకలతో కూడిన బోధనాసుపత్రి సిద్దంగా ఉండాలని, మొదటి దశలో పిడుగురాళ్ల వైద్య కళాశాలలో 100ప్రవేశాలు కల్పించి అనంతరం అదనపు ప్రవేశాల కోసం చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు.

## నేటి అర్ధరాత్రికి మూతబడనున్న వైకుంఠద్వారాలు

### - పదిరోజులు 7.80లక్షలమందికి దర్శన అవకాశం

**తిరుమల,జనవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** ఏడు కొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్ర మైన ధనుర్మాసంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు గురువారం(నేటి)అర్ధరాత్రితో మూత బడనున్నాయి. వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని డిసెంబర్ 30 మంగళవారం వేకువజామున ఒంటిగంటకు తెరచుకున్న తిరుమల ఆలయంలోని వైకుంఠ ద్వారం నిరవధికంగా పదిరోజులపాటు తెరచి ఉంచి భక్తులకు మోక్ష మార్గం దర్శనం చేయిస్తున్నారు. డిసెంబర్ 30వతేదీ వైకుంఠఏకాదశి, 31నద్వాదశి ఘడియ లతో బాటు జనవరి 1న ఆంగ్ల నూతన సంవత్సరాన పూర్తిగా ఆన్‌లైన్‌లో టోకెన్‌లున్న భక్తులను అనుమతించారు. జనవరి 2నుండి నేటి వరకు టోకెన్, టిక్కెట్‌లేని సర్వదర్శనం భక్తులతో బాటు ఆన్‌లైన్‌లో ఎస్ఇడి, శ్రీవాణి టిక్కెట్ కలిగిన భక్తులను వారంరోజులు పాటు అనుమతి నిస్తున్నారు. రోజుకు సరాసరి 80వేలమంది భక్తులకు వైకుంఠద్వారంలో ప్రశాంత దర్శనం చేయిస్తున్నారు. బుధవారం రాత్రి వరకు సరాసరి 7.04లక్షలమంది భక్తులకు దర్శనం చేయించగలిగారు. గురువారం అర్ధరాత్రివరకు దాదాపు మరో 80వేలమంది భక్తులు దర్శనం చేసుకునే వెసలుబాటుకల్పించనున్నారు. నేటి అర్ధరాత్రి 12గంటల వరకు వైకుంఠద్వారాలు తెరచి భక్తులను అనుమతిస్తారు. రోజుకు సరాసరి 80వేల మంది భక్తులకు ప్రశాంతంగా మూలవిరాట్టు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతోబాటు వైకుంఠ ద్వార దర్శనాలు భక్తులు చేసుకుంటున్నారు. మంగళవారం రాత్రి వరకు 6,24,079మంది భక్తులు వైకుంఠద్వారదర్శనం చేసుకోగలిగారు. హుండీ ఆదాయం 32.17కోట్ల రూపాయలు వరకు చేకూరింది. బుధవారంతో కలుపుకుని సుమారు 7లక్షలమందివరకు భక్తులకు దర్శనం చేయించగలిగినట్లు తెలుస్తోంది. నేటి అర్ధరాత్రి వరకు కలుపుకుని పదిరోజులపాటు సరాసరి 7.80లక్షలమంది భక్తులు స్వామివారిని వైకుంఠద్వారంలో దర్శనం చేసుకునేలా టిటిడి అధికారులు చక్కటి ఏర్పాట్లు చేశారు. దేశ విదేశాల నుండి భక్తులు తిరుమలకు చేరుకుని వైకుంఠద్వారంలో వెంకన్నను దర్శనం చేసుకుని ఆధ్యాత్మికతతో ముక్తిని పొందుతున్నారు.

## ఆంధ్రప్రదేశ్ స్ఫూర్తితో మారిషస్ అభివృద్ధి

### - మారిషస్‌లోని హరిహరదేవస్థానంలోనూ వేద పాఠశాల

### - మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్‌బీర్ గోకుల్



**తిరుమల,జనవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** సంస్కృతి, సంప్రదాయం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చెందుతున్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని మారిషస్ దేశాన్ని అభివృద్ధి చేసేందుకు విశేష కృషి చేస్తున్నట్లు ఆ దేశాధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ మనసులోని అభిప్రాయం వెల్లడించారు. తాను అధ్యాపక వృత్తి నుండి మారిషస్ దేశానికి అధ్యక్షుడిగా ఎన్నికయ్యానని తెలిపారు. సమాజంలో ఉపాధ్యాయులకు ఎనలేని గౌరవం ఉందని, ఆధునిక సమాజ అభివృద్ధికి ఉపాధ్యాయులు తోడ్పడతారని పేర్కొన్నారు. ప్రపంచ తెలుగు మహాసభలకు విచ్చేసిన సందర్భంగా ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని కుటుంబసమేతంగా దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. వసుదైక కుటుంబకమైన భారతదేశంలోని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం సాంస్కృతిక, సాంప్రదాయ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని మారిషస్ దేశాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు. అతిథులను గౌరవించడంలో, స్వాగతం పలకడంలో భారతీయులు ముందంజలో ఉంటారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. మారిషస్ దేశంలో నిర్మిస్తున్న హరిహర దేవస్థానంలో టీటీడీ సలహాలు, సూచనలతో వేద పాఠశాల ఏర్పాటు చేయడానికి నిర్ణయించామని తెలిపారు. తిరుమల పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం గోకుల్ దంపతులు తిరుమల ధర్మగిరిలో ఉన్న శ్రీవేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠాన్ని సందర్శించారు. అక్కడకు చేరుకున్న వారికి టీటీడీ అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ,వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం వేద పాఠశాలలోని ఆనంద నిలయంలో శ్రీవేంకటేశ్వర స్వామి, గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు సామూహిక వేద పారాయణం నిర్వహించారు. వేద పండితులు మారిషస్ దేశాధ్యక్షుడికి వేదాశీర్వచనం అందించారు. టిటిడిఅదనపు ఇఒ వెంకయ్య చౌదరి, వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని గోకుల్ దంపతులను సత్కరించి శ్రీవారి చిత్రపటం అందజేశారు.

## ఎల్ఐసి నుంచి సింగిల్‌ప్రీమియం పాలసీ 'జీవన్ ఉత్సవ్'

### 12నుంచి అందుబాటులోకి కొత్త పాలసీ



**న్యూఢిల్లీ, జనవరి 7:** ప్రభుత్వరంగ బీమాసంస్థ జీవితబీమా కార్పొరేషన్ కొత్త బీమా పాలసీ జీవన్ ఉత్సవ్‌ను అందుబాటులోకి తెచ్చింది. పొదుపు బీమా కోరుకునేవారికోసం ఒకే ప్రీమియం ఆప్షన్‌తో ప్రారంభించింది. ఒకసారి ప్రీమియం చెల్లిస్తే జీవితాంతం ఆదాయం వస్తుంది. అంటే వందేళ్లవరకూ కూడా వస్తుంది. నాన్‌పార్టిసిపేటింగ్, నాన్ లింక్డ్, సింగిల్‌ప్రీమియం ప్లాన్. మార్కెట్‌తో ఎలాంటి సంబంధం ఉండదు. ఎల్ఐసి లాభాలను పాలసీదారులకు చెల్లించదు. ఈనెల 12నుంచి కొనుగోలుకు అందుబాటులోకి వస్తోంది. 30 రోజులు వయసున్న పిల్లలనుంచి 65 ఏళ్ల వయసున్నవారు ఈపాలసీని ఎంచుకోవచ్చు. కనీస ప్రాథమిక బీమా మొత్తం ఐదు లక్షలు ఆపై ఎంతమొత్తం అయినా ఎంపికచేసుకోవచ్చు. గరిష్టపరిమితిలేదు. పాలసీ కాలపరిమితి ప్రతి వెయ్యికి ఏటా రూ.40 చొప్పున గ్యారంటీ అడిషన్స్ జమ అవుతుంటాయి. రెగ్యులర్ బెనిఫిట్ ఆప్షన్ పాలసీదారులు ఎంచుకుననన వనయవధిని బట్టి అంటే ఏడునుంచి 17 ఏళ్లతర్వాత ఏటా ప్రాథమిక బీమా మొత్తంలో 10శాతం రాబడి లభిస్తుంది. ఎంపికసంవత్సరాన్ని బట్టి మరుసటిఏడాదినుంచి ఆదాయం వస్తుంది. వ్యక్తుల అవసరాలకు అనుగుణంగా దీన్ని ఎంచుకోవచ్చు. ఫ్లెక్సీ ఇన్‌కమ్ బెనిఫిట్ ఆప్షన్ కింద పాలసీదారులు తమకు రావాల్సిన 10శాం రాబడులు తీసుకోకుండా ఎనల్‌ఐసివద్దనే దాచి ఉంచుకోవచ్చు. ఈ మొత్తంపై సంస్థ వార్షికవడ్డీ 5.5శాతం చెల్లిస్తుంది.

పాలసీదారులు తమ అవసరాలకోసం ఈ మొత్తం వెనక్కి తీసుకోవచ్చు. అప్పటివరకూ జమ అయిన మొత్తంలో 75శాతంవరకూ తీసుకోవచ్చు. పాలసీదారు మరణిస్తే నామినీకి పాలసీ మొత్తంతోపాటు అప్పటివరకూ జమ అయిన గారంటీ అడిషన్స్ అందుతాయి. గడువు తీరేవరకూ జీవించి ఉంటే మెచూరిటీ ప్రయోజనం కింద ప్రాథమిక బీమా మొత్తం సింగిల్‌ప్రీమియానికి 1.25 రెట్లు గారంటీడ్ అడిషన్స్ కలిపిచెల్లిస్తారు.

ఎల్ఐసి ప్రమాద వికలాంగ ప్రనయోజనాలరైడర్, ఎల్ఐసి నూనయటర్మ్ అష్యూరెన్స్ రైడర్ వంటివి జోడించుకోవచ్చు. ఇందుకు కొంత అదనపు ప్రీమియం చెల్లించాలి. వీటిని పొందేందుకు అర్హత ప్రమాణాలను

## ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది

### జిల్లా ఇంచార్జి మంత్రి సవిత

**కడప, జనవరి 7, ప్రభాతవార్త** కడప జిల్లా జిల్లా అభివృద్ధి పై సమగ్రంగా సమీక్షి ంచేందుకు బుధవారం జిల్లా సచివాలయంలోని పిజిఆర్ఎస్ సమావేశపు హాలులో జిల్లా ఇంచార్జి మంత్రి సవిత అధ్యక్షతన జిల్లా కలెక్టం శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరుతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని సస్య శ్యామలం చేసేందుకు కూటమి ప్రభుత్వం సాగు నీటి ప్రాజెక్ట్ పూర్తికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. రాయలసీమ ఎత్తి పోతల పథకం, పోలవరం, బనకచర్ల సాగు నీటి ప్రాజెక్టుల పూర్తికి కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తున్నదన్నారు. జిల్లా లో వినూత్నంగా అమలవుతున్న స్టార్ట్ అప్ కడప, స్మార్ట్ కిచెన్‌లకు నీతి ఆయోగ్

## దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి నూతన సంవత్సర కానుకగా రోడ్లు మంజూరు పత్రాలు అందజేస్తున్న డి సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ, జనవరి 7,ప్రభాతవార్తప్రతినిధి:** దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి  ్మ దర్శి నియోజకవర్గంలోని రోడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాలు కల్పన మంచి నీటి వసతి పై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కోరిన కొన్ని గంటల్లోనే సంబంధిత రోడ్ల మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేయడం ఎంతో హర్షనీయమని డీసీఎం పవన్ కళ్యాణ్ గారికి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి  ్మ కృతజ్ఞతలు తెలిపారు. దర్శి ప్రజలకు హామీ ఇచ్చిన కేవలం 5 గంటలలో దర్శి అభివృద్ధికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అనుమతులు ఇస్తూ ఆదేశాలు జారీ చేయడం ఎంతో శుభ పరిణామమని, దర్శి అభివృద్ధిలో పవన్ కళ్యాణ్ సహకారాన్ని మేము ఎన్నటికీ మర్చిపోలేము అని, ఈ సందర్భంగా ఆయనకు దర్శి ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ రుణపడి ఉంటామని డాక్టర్ లక్ష్మి  ్మ డాక్టర్ కడియాల లలిత్ సాగర్ గార్లు ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. దర్శి నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంజూరు చేసిన రోడ్ల వివరాలు. ఒక కోటి 14 లక్షల రూపాయలతో కురిచేడు మండలం పెద్దవరం నుండి బయ్యవరం వరకు బీటి రోడ్డు. ఒక కోటి 90 లక్షల రూపాయలతో దర్శి అద్దంకి రోడ్డు లో మెయిన్ రోడ్డు నుండి వయా బసవపురం మీదుగా శ్రీనివాస్ నగర్ వరకు. డిప్యూటీ పవన్ కళ్యాణ్ గారి ఆదేశాలతో మొత్తం దర్శి నియోజకవర్గానికి మూడు కోట్ల నాలుగు లక్షల రూపాయల తో బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ జిల్లా ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ గంగవరపు జోసఫ్ కుమార్ కు ఆర్డినెన్స్ జారీ చేయడం జరిగింది.

## ఆరుగురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన ఎమ్మెల్యేలపై ఎథిక్స్ కమిటీ అసహనం

### - ఆరుగురు ఎమ్మెల్యేలు సభా కార్యక్రమాలకు హాజరుకాకుండానే, అన్ని రకాల ప్రభుత్వ ప్రయోజనాలను పొందుతున్నారనే ఫిర్యాదులపై చర్చ - వారందరికి నోటీసులు జారీ!

**విజయవాడ,జనవరి7,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు సభా కార్యక్రమాలకు హాజరుకాకుండానే, అన్ని రకాల ప్రభుత్వ ప్రయోజనాలను పొందుతున్నారనే ఫిర్యాదులపై ఆంధ్రప్రదేశ్ శాసనసభలో నైతిక విలువల కమిటీ తీవ్రంగా స్పందించింది. ఈ కమిటీ సమావేశం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు సభా కార్యక్రమాలకు హాజరుకాకుండానే, అన్ని రకాల ప్రభుత్వ ప్రయోజనాలను పొందుతున్నారనే ఫిర్యాదులపై చర్చించింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ నిబంధనలను ధిక్కరిస్తూ, సభా కార్యక్రమాలకు గైర్హాజరవుతున్న ఆరుగురు వైసీపీ ఎమ్మెల్యేల తీరుపై ఎథిక్స్ కమిటీ సీరియస్ అయింది. శాసనసభ సమావేశాలకు రాకుండా పార్టీ నిర్ణయం పేరుతో బయటే ఉంటున్న ఈ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఖజానా నుండి అందే జీతాలు, టీఏ , డీఏ లను మాత్రం క్రమంతప్పకుండా తీసుకుంటున్నట్లు కమిటీ ప్రాథమికంగా గుర్తించింది. ప్రజాప్రతినిధులుగా ప్రజల గొంతుకను సభలో వినిపించాల్సిన బాధ్యతను విస్మరించి, కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం పదవులను వాడుకోవడం నైతికంగా నేరమని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. శాసనసభ నిబంధనల ప్రకారం ఎథిక్స్ కమిటీ స్పీకర్‌కు సిఫారసులు చేసే అవకాశం ఉంది. సభకు హాజరుకాని రోజులకు సంబంధించిన జీతాన్ని, అలవెన్సులను నిలిపివేయడం లేదా రికవరీ చేయడం, నిబంధనల ఉల్లంఘన తీవ్రతను బట్టి నిర్దిష్ట కాలం పాటు సభ నుండి సస్పెండ్ చేయడం, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, నిరంతరం గైర్హాజరవుతున్న వారి సభ్యత్వాన్ని రద్దు చేయాలని సభకు నివేదించడం చేయవచ్చు. ప్రస్తుతం ఈ వ్యవహారంలో ఆ ఆరుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసి, వివరణ కోరాలని కమిటీ నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. వారిచ్చే వివరణ సంతృప్తికరంగా లేకపోతే, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనే వీరిపై కఠిన చర్యలు తీసుకునేలా స్పీకర్‌కు తుది నివేదిక సమర్పించనుంది.

## 2047నాటికి అందరికీ బీమా సౌకర్యం కల్పించేందుకు కృషి : సిఎస్ విజయానంద్



**సచివాలయం,జనవరి 7,ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రతి పౌరునికి 2047నాటికి భీమా సౌకర్యాన్ని కల్పించే లక్ష్యంతో బారత బీమా నియంత్రణ మరియు అబివీద్ధి సంస్థ పనిచేస్తుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్రస్థాయి ఇన్సూరెన్స్ కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు బీమా కవరేజిని విస్తరించడానికి దాని ప్రయోజనాలను సామాన్యులకు చేరేలా చేయడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై కమిటీ చర్చించింది. మొదటి విడతలో సుమారు 5000 గ్రామ పంచాయితీలను దత్తత తీసుకున్నాయి. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ కేంద్రం 2047నాటికి దేశంలోని ప్రతి పౌరునికి భీమా సౌకర్యాన్ని కల్పించాలన్న ఐఆర్డీఏఐ లక్ష్యానికి అనుగుణంగా సెర్ప్, మెప్మా, స్వర్ణగ్రామ వార్డు విభాగాలతోపాటు కార్మిక, రవాణా, ఎంఎస్ఎంఈ తదితర శాఖలు వారి పరిధిలోని వారందరికీ భీమా సౌకర్యం కల్పించే విధంగా వారిలో అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రానికి ఐఆర్డీఏఐ నియమించిన మూడు ప్రధాన బీమా సంస్థల్లో పిఎన్‌బి మెట్‌లైఫ్, స్టార్ హెల్త్ మరియు యూనివర్సల్ సోంపో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు ఉన్నాయి. జీవిత బీమా, పంట భీమా, మోటారు మరియు ఆరోగ్యభీమాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి రంగ నిర్దిష్ట ఉప కమీటీలను ఏర్పాటు చేయాలని ఈ కమిటీ సిఫార్సు చేసింది. సమావేశంలో ఆర్థికశాఖ ఉప కార్యదర్శి సూరజ్ ధనంజయ్, ఐఆర్డీఎఐ డిజిఎం పార్థసారథి, యూనివర్సల్ సాంపూ నీకాస్ దేకా హెచ్ ఎస్.రాజేష్, ఎస్ఎంఈ ఇన్సూరెన్స్ ఇస్లూక్లూజన్ మరియు స్టార్‌హెల్త్ కెబిబి శ్రీనివాస్ బిజినెస్ హెడ్ మరియు సాగర్ పాల, పిఎన్‌బి మెట్‌లైఫ్ సిద్ధార్థ మరియు శ్రీనివాసరావు క్లస్టర్ మేనేజర్, ఎస్ఎల్‌బిసి చీఫ్ మేనేజర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. వర్చువల్‌గా రాష్ట్ర సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, రాష్ట్ర ఎంఎయుడి ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్, సీఈఓ ఎంఎస్ఎంఈ విశ్వ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్

**విజయవాడ (గన్నవరం), జనవరి 7, ప్రభాతవార్త :** సమాజంలో ప్రతిఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు కృషిచేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా పిలుపునిచ్చారు. 37వ జాతీయ రహదారి భద్రతా మాసత్సవాల సందర్భంగా విజయవాడలోని యంజిరోడ్ ఫుడ్‌స్ట్రీట్ వద్ద బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రహదారి భద్రత వాక్‌థాన్‌ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించి వాక్‌థాన్‌లో పాల్గొన్నారు. ఈసందర్భంగా లక్ష్మీశా మాట్లాడుతూ ప్రయాణ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్రవాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని, మద్యంసేవించి వాహనం నడపటం, అతివేగంగా వెళ్ళటం, రాష్‌డ్రైవింగ్ చేయటం వల్ల ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని హెచ్చరించారు. కారు ప్రయాణంలో సీటుబెల్టు ధరించాలని, తద్వారా అనుకోని ప్రమాదం ఎదురైనపుడు ప్రాణాపాయం తప్పుతుందన్నారు. రహదారి భద్రతా నియమాలు పాటించేవారికి అభినందనలు తెలియచేస్తామని, నిబంధలను విరుద్ధంగా వ్యవహరించేవారికి శిక్షలు తప్పవని హెచ్చరించారు. రవాణాశాఖ, పోలీస్‌లు ఇతర శాఖల అధికారులు తీసుకున్న చర్యల ఫలితంగా 2024తో పోల్చితే 25లో జిల్లావ్యాప్తంగా 80మరణాలను తగ్గించగలిగామన్నారు. ఇదే స్ఫూర్తితో ముందడుగు వేసి ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు, స్వచ్ఛందసంస్థలు, సమిష్టిగా కృషిచేసి జిల్లాను రహదారి భద్రతలో ఆదర్శంగా నిలుపుదామని ఈసందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. డిసిపి షరీన్‌బేగం మాట్లాడుతూ రహదారి భద్రత అంశంలో పోలీస్‌శాఖ తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని జిల్లా వ్యాప్తంగా రోడ్డుప్రమాదాలు తగ్గటంతోపాటు మరణాల రేటు తగ్గిందని వివరించారు.

ఈకార్య క్రమంలో ఏపిఎన్‌జిఓ రాష్ట్రఅధ్యక్షులు ఎ.విద్యా సాగర్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్ ఏ. మోహన్, ఆర్టీఓలు ఆర్.ప్రవీణ్, ఏ.వెంకటేశ్వ రావు, రవాణాశాఖ ఉద్యోగుల జోనల్ అధ్యక్షులు యం. రాజబాబు, ఎన్ఎస్ఎస్ జిల్లా సమన్వ యకర్త డాక్టర్ కొల్లేటి రమేష్, పాల్గొన్నారు.

## గుడికి వెళుతున్నానని వెళ్లి నదిలో మృతదేహంగా కనిపించిన మహిళ

**చిత్తూరు, జనవరి 7 ప్రభాతవార్త:** చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జనవరి 2వ తేదీ అదృశ్యమైన మహిళ బుధవారం చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు మండల పరిధిలోనీ నీవా నదిలో మృతదేహమై తేలింది. చిత్తూరు గిరింపేటలో నివాసం వుంటున్న కవిత(38) డిసెంబర్ 31వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఇంటి నుండి గుడికి వెళ్ళి వస్తానని బయలుదేరి మళ్ళీ తిరిగి రాలేదు. ఈ మేరకు కవిత సోదరుడు ఎస్.కిరణ్(34) జనవరి 2వ తేదీ రాత్రి 9 గంటలకు టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గుడికి వెళ్ళి వస్తానని చెప్పిన కవిత తిరిగి ఇంటికి రాలేదని, ఫోన్‌లో ఆమెను సంప్రదించడానికి ప్రయత్నించగా ఆమె సమాధానం ఇవ్వడం లేదని, అనంతరం తాను వికలాంగుల సంఘ అధ్యక్షుడైన మురళీ ఇంటికి వెళ్ళి తన సోదరి గురించి వివరాలు అడిగానని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అప్పుడు మురళీ చంద్రశేఖర్ అనే వ్యక్తికి ఫోన్ చేసి అడిగారని అందుకు చంద్రశేఖర్ తనకు కవిత ఒక వాయిస్ మెయిల్ పంపిందని చెప్పాడు. ఆ మెసేజ్‌లో గణేష్ అనే వ్యక్తి తనను పెళ్ళి చేసుకున్నాడని, అతను తనని తనతో పాటు తీసుకెళ్తున్నాడని సైతం కవిత వాయిస్ మెయిల్‌లో పేర్కొంది. ఆపై కిరణ్ కవిత కోసం చిత్తూరు నగరం మొత్తం గాలించగా రాఘవ థియేటర్‌కు సమీపంలో కవిత స్కూటర్ పార్క్ చేసి కన్పించింది. అక్కడ వున్న వారిని కిరణ్ ప్రశ్నించగా స్కూటర్ పార్క్ చేసి మహిళ ఆటో ఎక్కి వెళ్ళిందని సమాచారం ఇచ్చారు. అలా వెళ్ళిన మహిళ గంగాధరనెల్లూరులోని నీవా నది బ్రిడ్జి కింద మృతదేహమై తేలింది. కవిత ఇచ్చిన వాయిస్ మెయిల్ మేరకు పెళ్ళి చేసుకున్న గణేష్ కవితను హత్య చేసినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ మేరకు పోలీసులు, కుటుంబ సభ్యులు సైతం గణేష్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు గణేష్ పట్టుబడితే కాని వాస్తవాలు తెలిసే అవకాశాలు వున్నారు. ఈ మేరకు టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బైక్, ఆటో ఢీ : ఇద్దరి మృతి

**కౌతాళం రూరల్, జనవరి 07, ప్రభాతవార్త;** కర్నూలు జిల్లా కౌతాళం మండలంలోని ఎరిగేరి–కౌతాళం రహదారిలోని ఎల్ఎల్‌సీ కాలువ సమీపంలో బుధవారం సాయంత్రం మోటార్‌సైకిల్‌ను ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. మరొకరికి గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆటో డ్రైవర్ శేఖర్ ఆటోలో మద్యం బాటిళ్లను లోడు చేసుకుని ఎరిగేరి వైపు వస్తుండగా ఎరిగేరి–కౌతాళం వద్ద తల్లి మహాదేవి, కుమారుడు నాగిరెడ్డి, మనవడు అభిలు ప్రయాణిస్తున్న మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తల్లి మహాదేవి, కుమారుడు నాగిరెడ్డి ప్రమాద స్థలంలోనే మృతిచెందారు. అభి గాయాలతో బయటపడ్డాడు. ఆటో డ్రైవర్ మద్యం సేవించి ఆటో నడుపుతున్నట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. కౌతాళం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కౌతాళం పోలీసులు తెలిపారు. తల్లి, కుమారుడు మృతిచెందడంతో గ్రామంలో విషాధఛాయలు అలుముకున్నాయి.

# అగ్రస్థానానికి తమిళనాడు డ్రాగన్స్

## సూర్మా హాకీ క్లబ్ ఓడించి



**న్యూఢిల్లీ:** పురుషుల హాకీఇండియా లీగ్(హెచ్ఐఎల్)2025లో సూర్మా హాకీ క్లబ్‌ను 3-2 తేడాతో ఓడించి తమిళనాడు డ్రాగన్స్ పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. డ్రాగన్స్ తరఫున సెల్వరాజ్ కనగరాజ్ (28వ నిముషంలో), ఉత్తమ్ సింగ్ (30), బ్లేక్ గోవర్స్ (47) గోల్స్ చేయగా, మణీందర్ సింగ్ (45), కెప్టెన్ హార్మన్‌ప్రీత్ సింగ్ (58) సూర్మా క్లబ్‌ను చివరి క్షణాల వరకు పోటీలో నిలిపారు. సూర్మా గోల్‌తో మ్యాచ్‌ను ప్రారంభించినా తొలి నిమిషంలోనే గోల్ కీపర్ విన్సెంట్ వనాష్ 12వ నిమిషంలో డ్రాగన్స్ జట్టుకు తొలి పెనాల్టీ కార్నర్ సంపాదించాడు. రెండవ క్వార్టర్‌లో తీవ్రత పెరిగి సాండర్ కౌఫ్‌మన్ ప్రదర్శనతో డ్రాగన్స్ మరో పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. 28వ నిమిషంలో సెల్వరాజ్ కనగరాజ్ చందన్ యాదవ్ ఇచ్చిన పాస్‌ను క్లీన్‌గా ముగించడంతో పురోగతి సాధ్యమైంది. 30వ నిమిషంలో ఉత్తమ్ సింగ్ రివర్స్ హిట్‌తో ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. మూడవ క్వార్టర్‌లో సూర్మా కెప్టెన్ హార్మన్‌ప్రీత్ 36వ నిమిషంలో ఫెనాల్టీ కార్నర్‌ను గెలుచుకున్నా దాన్ని గోల్‌గా మార్చడంలో విఫలమయ్యాడు. మణీందర్ సింగ్ కేవలం ఒక సెకను మిగిలి ఉండగానే గోల్ చేసి లోటును 2-1కి తగ్గించాడు. డ్రాగన్స్ బ్లేక్ గోవర్స్ 47వ నిమిషంలో ఆటను ముగించి స్కోరును 3-1గా మార్చాడు. చివరికి 58వ నిమిషంలో డ్రాగ్‌ఫ్లిక్‌తో గోల్‌గా మార్చడంతో డ్రాగన్స్ స్కోరు 3-2తో ముగిసింది. దీంతో 5 పాయింట్లతో పురుషుల హీరో హాకీ ఇండియా లీగ్ పట్టికలో అగ్రస్థానానికి డ్రాగన్స్ చేరుకుంది.




# బ్రిటిష్ ఓపెన్‌లో.. అనాహత్‌కు రజతం

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక బ్రిటిష్ జూనియర్ అండర్19 ఓపెన్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన టాప్ సీడ్, వర్ధమాన టీనేజర్ అనాహత్ సింగ్ రజత పతకాన్ని గెలుచుకుంది. బర్మింగ్‌హామ్‌లో ఈ టోర్నమెంట్లో అనాహత్ రన్నరప్‌గా నిలిచింది. టోర్నమెంట్ ఫేవరెట్ అయిన సింగ్, ఫైనల్లో ఫ్రాన్స్‌కు చెందిన లారెన్ బాల్టయన్ చేతిలో 9-11, 11-7, 3-11, 9-11 తేడాతో ఓడిపోయింది. పోటీలో అగ్రస్థానంలో ఉన్న అథ్లెట్ అనాహత్ 2026 బ్రిటిష్ జూనియర్ ఓపెన్‌లో మొదటి రౌండ్ బై పొందిన తర్వాత రెండవ రౌండ్‌లో హాంకాంగ్‌కు చెందిన వింగ్ కై గ్లాడిస్ హోపై 11-0, 11-3, 11-0 తేడాతో వరుస గేమ్‌లతో తన ప్రచారాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత ఆమె రౌండ్ ఆఫ్ 16లో ఇద్దరు ఈజిప్షియన్ల మలక్ ఎల్మరాఫీని 11-1, 11-3, 11-3 తేడాతో ఓడించి, క్వార్టర్ ఫైనల్స్‌లో బార్బ సమేహ్‌ను 11-4, 10-12, 11-9, 11-3 తేడాతో ఓడించింది. సెమీఫైనల్లో మరో ఈజిప్షియన్ క్రీడాకారిణిపై 11-8, 11-7, 11-9 తేడాతో మలికా ఎల్ కరాక్సీని వరుస గేమ్‌లలో ఓడించింది. ఇక ఫైనల్లో ఈ ఓటమి కారణంగా బ్రిటిష్ జూనియర్ ఓపెన్‌లో నాల్గవ టైటిల్‌కోసం అనాహత్ అన్వేషణనిలిచిపోయింది. ఆమె గత సంవత్సరం అండర్17 బాలికల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. గతంలో 2023లో అండర్15 బాలికల సింగిల్స్ ఛాంపియన్‌గా, 2019లో అండర్11 బాలికల సింగిల్స్ ఛాంపియన్‌గా కూడా నిలిచింది.





# మలేసియా ఓపెన్‌లో రెండో రౌండ్‌లోకి సింధు, సాత్విక్

**న్యూఢిల్లీ:** మలేషియా ఓపెన్‌లో భారత షట్లర్లు పివి సింధు తోపాటు, డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించగా, ట్రీసా-గాయత్రి జంట నిష్క్రమించింది. ఈ ఏడాది తొలి టోర్నమెంట్ అయిన మలేషియా ఓపెన్‌లో బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో భారత స్టార్ స్టార్ సింధు వరుస గేమ్‌ల విజయాన్ని నమోదు చేసి శుభారంభం చేసింది. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత అయిన ఆమె 51 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో చైనీస్ తైపీకి చెందిన సుంగ్ షువోయున్‌ను 21-13, 22-20 తేడాతో ఓడించింది. ఈ టోర్నీలో సింధు పేలవమైన ఆరంభంతో మొదటి గేమ్‌లో 5 పాయింట్ల వెనుకబడి ఉంది. కానీ తర్వాత ఆమె వరుసగా 10 పాయింట్లు గెలుచుకుని ఆటను ముగించింది. పురుషుల డబుల్స్‌లో రాంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-శెట్టి చిరాగ్ కూడా చైనీస్ తైపీ జంట లీ జెహుయ్-యాంగ్ పోహ్సువాన్‌పై 21-13, 21-15 తేడాతో వరుస గేమ్‌లతో గెలుపొందారు.

లీయాన్‌పై భారత ద్వయం సాధించిన ఆరో విజయం ఇది. ఇక భారత మహిళల డబుల్స్ జోడీ ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ 32వ రౌండ్‌లో ఇండోనేషియా జంట చేతిలో 9-21, 23-21, 19-21 తేడాతో మూడు గేమ్‌ల్లో ఓటమి ఎదుర్కొన్నారు. అలాగే భారత మిక్స్‌డ్ డబుల్స్ జంట ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. 56 నిమిషాల పాటు జరిగిన 32 రౌండ్ల పోరులో అమెరికా ద్వయం ప్రెస్లీ స్మిత్-జెన్నీ గై 21-15, 18-21, 21-15 తేడాతో భారత జంటను ఓడించారు.

# వన్డేల్లో డేంజరస్ ప్లేయర్లు




**న్యూఢిల్లీ:** ప్రపంచంలో వన్డే ఫార్మాట్ ఎప్పుడూ రికార్డులకు నిలయం. ఇందులో ప్రతిరోజూ పెద్ద రికార్డులు నమోదవుతున్నాయి. ఎంతో మంది గొప్ప ఆటగాళ్ల తమ బ్యాటింగ్‌తో ప్రపంచాన్ని అలరించినా నిలకడగా పరుగులు చేస్తూ 11 వేల పరుగుల మార్కును వేగంగా చేరుకోవడం కొందరికి మాత్రమే సాధ్యమైంది. ఈ జాబితాలో భారతఆటగాళ్ల హవా ఎక్కువగా కనిపిస్తోంది. భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ నుంచి క్రికెట్ దేవుడు సచిన్‌టెండూల్కర్ వరకు, ఈ మైలురాయిని అతి తక్కువఇన్నింగ్స్‌ల్లో అందుకున్నారు. టీమిండియా రన్‌మెషిన్ విరాట్ కోహ్లీ ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచాడు. కోహ్లీ కేవలం 222 ఇన్నింగ్స్‌ల్లోనే 11 వేల పరుగుల మైలురాయిని దాటాడు. 2019 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌తో హై వోల్టేజ్ మ్యాచ్‌లో ఈ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. వన్డేల్లో అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన ఆటగాడిగా కోహ్లీ రికార్డు ఇప్పటికీ పదిలంగా ఉంది. అలాగే టీమిండియా మాజీ కెప్టెన్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. 261 ఇన్నింగ్స్‌ల్లో 11 వేల పరుగుల మార్కును చేరుకున్నాడు. 2025లో దుబాయ్‌లోబంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ ఈ ఘనతను సాధించాడు. ఓపెనర్‌గా మారిన తర్వాత రోహిత్ గణాంకాలు అద్భుతంగా మెరుగుపడ్డాయి. క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ మూడో స్థానంలో ఉన్నాడు. సచిన్ 276 ఇన్నింగ్స్‌ల్లో 11 వేల పరుగులను పూర్తి చేశాడు. 2002లో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆయన ఈ మైలురాయిని అందుకున్నాడు. వన్డే క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు ఇప్పటికీ సచిన్ పేరిటనే ఉండటం విశేషం. ఇక ఆస్ట్రేలియా విజయవంతమైన కెప్టెన్ రికీ పాంటింగ్ నాలుగో స్థానంలో నిలిచాడు. పాంటింగ్ 286 ఇన్నింగ్స్‌ల్లో 11 వేల పరుగుల మార్కును దాటాడు. 2008లో సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో ఆయన ఈ ఘనత సాధించాడు. ఆస్ట్రేలియా తరఫున వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడు కూడా ఆయనే. భారత మాజీ కెప్టెన్ దాదా సౌరవ్ గంగూలీ ఐదో స్థానంలో ఉన్నాడు. గంగూలీ 288 ఇన్నింగ్స్‌ల్లో 11వేల పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. తన అద్భుతమైన ఆఫ్‌సైడ్ డ్రైవ్‌లతో గాడ్‌ఆఫ్ ఆఫ్‌సైడ్ అనిపేరు తెచ్చుకున్న గంగూలీ, వన్డేల్లో భారత్ తరఫున అత్యంత వేగంగా పరుగులు చేసిన ఆటగాళ్లలో ఒకరిగా నిలిచాడు.





# యాషెస్ టెస్ట్‌లో ఓటమి అంచున ఆస్ట్రేలియా

## 119 రన్స్ ఆధిక్యంలో ఇంగ్లండ్

**న్యూఢిల్లీ:** యాషెస్ సిరీస్ 2025-26లో భాగంగా ఆఖరి టెస్ట్‌లోనూ ఇంగ్లండ్ ఓటమి దిశగా సాగుతోంది. 184 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ నాలుగో రోజు బుధవారం ఆట ముగిసే సమయానికి 75 ఓవర్లలో 8 వికెట్లకు 302 పరుగులు చేసింది. దీంతో 119 పరుగుల తేడాతో ఓటమికి దగ్గరలో ఉంది. క్రీజులో జాకోబ్ బెతెల్(232 బంతుల్లో 15 ఫోర్లతో 142 నాటౌట్)తో పాటు, మాథ్యూ పాట్స్(0 బ్యాటింగ్) ఉన్నారు. జోరూట్(6), విల్ జాక్స్(0), బెన్ స్టోక్స్(1), జాక్ క్రాలీ(1) తీవ్రంగా నిరాశపర్చగా, బెన్ డకెట్(42), హ్యారీ బ్రూక్(42) పర్వాలేదనిపించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో బ్యూ వెబ్‌స్టర్(3/51) 3 వికెట్లు, స్కాట్ బోలాండ్(2/34) 2 వికెట్లు పడగొట్టాడు. మిచెల్ స్టార్క్, మైకేల్ నెసర్ తలో వికెట్ తీసారు. ప్రస్తుతం ఇంగ్లండ్ 119 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. 518/7 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన ఆసీస్ 133.5 ఓవర్లలో 567 పరుగులకు ఆలౌటైంది. ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్(166 బంతుల్లో 24 ఫోర్లు, సిక్స్‌తో 163), కెప్టెన్ స్టీవ్ స్మిత్(220 బంతుల్లో 16 ఫోర్లు, సిక్స్‌తో 138 నాటౌట్) భారీ శతకాలతో రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్(3/130), జోష్ టంగ్(3/97), మూడు వికెట్లు తీయగా, బెన్ స్టోక్స్(2/95) రెండు వికెట్లు పడగొట్టాడు. విల్ జాక్స్, జాకోబ్ బెతెల్ తలో వికెట్ తీసారు. ఆఖరి రోజు ఇంగ్లండ్‌ను త్వరగా ఆలౌట్ చేస్తే ఆస్ట్రేలియాకు విజయం దక్కుతుంది. ఈ మ్యాచ్‌లో గట్టెక్కాలంటే ఇంగ్లండ్ ఆఖరి రోజంతా బ్యాటింగ్ చేయాలి. ఇది అసాధ్యం.

# భారత్ ఆర్థికవృద్ధి 7.4%

## కేంద్ర అర్థగణాంకశాఖ అంచనా





**న్యూఢిల్లీ, జనవరి 7:** భారత్ ఆర్థికవ్యవస్థ ఈ ఆర్థికసంవత్సరం ముగిసేనాటికి 7.4శాతం వృద్ధిచెందుతుందని కేంద్ర అర్థగణాంకశాఖ ముందస్తు అంచనాలనుప్రకటించింది. 2026 మార్చినాటికి భారత్ ఆర్థిక వృద్ధి 7.4శాతంగా ఉంటుందని వెల్లడించింది. ప్రభుత్వం అంతకుముందు అంచనాలు 6.3 నుంచి 6.8శాతం కంటే పెరుగుతుందని వెల్లడించింది. మారుతున్న గణాంకాల వృద్ధి ఆధారంగా అర్థగణాంకశాఖ జిడిపి వివరాలను మార్పులుచేసింది. 2025లో భారత్ ఆర్థిక వ్యవస్థ 6.5శాతం వృద్ధినమోదుచేసిందని తెలిపింది. అలాగే 2023-24లో 8.2శాతం వృద్ధి నమోదుచేసిందన్నారు. సేవలరంగంలోవృద్ధి 9.9శాతంగా ఉందని తెలిపిన అర్థగణాంకశాఖ ఆర్థికసేవలు, రియల్‌ఎస్టేట్, వృత్తిపరమైన సేవలు, ప్రభుత్వపాలన యంత్రాంగంలో గణనీయమైన వృద్ధినమోదయినట్లు చెపుతోంది. వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్ అండ్ సర్వీసెస్ సంబంధిత రంగాల్లో వృద్ధి 7.5శాతంగా ఉందని అధికారికంగా వెల్లడించింది. తయారీరంగం, నిర్మాణరంగాల వృద్ధి ఏడుశాతంగా ఉందని, వ్యవసాయరంగంలో వృద్ధిరేటు 3.1శాతంగా ఉన్నట్లు కేంద్ర మంత్రిత్వశాఖప్రకటించింది. ఇక వాస్తవరూపంలో ప్రైవేటు తుది వినియోగ వ్యయం కూడా ఏడుశాతం వృద్ధినమోదుచేసిందని, ఆదాయపు పన్ను మినహాయింపుల రూపంలోను, జిఎస్టీ రేట్ కట్స్ రూపంలోను కొంతమేర వృద్ధి నమోదయిందన్నారు. ఇక మూలధన వ్యయంపరంగా 7.8శాతం వ1ద్దిఉందని, స్థిరమైన ధరలవద్ద వ్యయాలు కూడా పెరుగుతున్నందున ఆర్థికవృద్ధికూడా పెరుగుతుందని అంచనావేస్తోంది. జులై సెప్టెంబరు రెండోత్రైమాసికంలో జిడిపి 8.2శాతానికి నమోదయింది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో 5.6శాతంమాత్రమే ఉన్న సంగతి తెలిసిందే. ఇక సెకండరీ, టెరిటరీ రంగాలు పరంగాచూస్తే 8.1శాతం, 9.2శాతంగా ఉంది. జిడిపి వ1ద్ధిరెండోత్రైమాసికంలో 8శాతానికి మించి ఉంటుందని అధికారయంత్రాంగం చెపుతోంది. తయారీ రంగం ఎన్నడూలేనివిధంగా 9.1శాతం వ1ద్దిననమోదుచేస్తే నిర్మాణరంగం 7.2శాతం వృద్ధితో ఉంది. ఆర్థికరంగం, రియల్‌ఎస్టేట్, వృత్తిపరమైన సేవలు టెరిటరీ సెక్టార్‌లో రెండంకెల వృద్ధిని నమోదుచేసాయి. 10.2శాతంగా ఉంది. వ్యవసాయరంగంలో 3.5శాతం విద్యుత్, గ్యాస్‌మంచినీటిసరఫరా, ఇతర యుటిలిటీ సేవల్లో 4.4శాతం వృద్ధినమోదయిందని అర్థగణాంకశాఖ వెల్లడించింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ అంచనాలప్రకారం చూస్తే ఆరుశాతం వ1ద్దిరేటుతో ఉంటుదని తెలుస్తోంది. అమెరికా ఆంక్షలు ఉన్నప్పటికీ కూడా కొంతమేర వాణిజ్యరంగం ఒడిదొడుకులు ఎదుర్కొన్నా ఆర్థికవృద్ధి ఆగదని అంచనావేసింది.

# అమెరికాకు 50 మిలియన్ బ్యారెళ్ల వెనిజులా చమురు

## రవాణా చేయాలని ట్రంప్ తక్షణ ఆదేశాలు

**వాషింగ్టన్, జనవరి 7:** వెనిజులాపై సైనిక చర్య అనంతరం ఇపుడు పూర్తి అమెరికా పాలనలో ఉన్న ఆదేశంనుంచి తమకు 30 నుంచి 50 మిలియన్ బ్యారెళ్ల అత్యున్నత నాణ్యతకలిగిన ముడిచమురు వస్తుందని, మార్కెట్‌ధరలకే లభిస్తుందని అద్యక్షుడు ట్రంప్ తెలిపారు. తన సోషల్‌మీడియా ట్రూత్‌లోపోస్టుచేసిన ట్రంప్ అమెరికాకు వెనిజులా చమురు ఇస్తుందని ఈ విక్రయంద్వారా వచ్చే నిధులు తన అధీనంలోనే ఉంటాయని, ఈ మొత్తం వెనిజులా ప్రజల లబ్దికోసం అమెరికాప్రయోజనాలకు అనుగుణంగా వ్యయంచేస్తామని తెలిపారు. వెనిజులా ఈ చమురును మార్కెట్‌ధరలకే తమకు విక్రయిస్తుందని, సొమ్ములు మాత్రం నా కంట్రోల్‌లోనే ఉంటాయని ట్రంప్ వెల్లడించారు. ఈ నిధులు వెనిజులా, అమెరికా ప్రయోజనాలకే ఖర్చుచేస్తామన్నారు. ఈ చమురుసరఫరా వెంటనే ప్రారంభం అవుతుందని ఇంధన కార్యదర్శి క్రిస్ రైట్‌ను ఇందుకు సంబంధించి ప్రణాళిక సిద్ధంచేయాలని ఆదేశించామన్నారు. స్టోరేజి నౌకలద్వారా చమురు సరఫరా అవుతుందని, నేరుగా అమెరికా ఓడరేవుల్లోనే దిగుమతి అవుతుందని చెప్పారు.





# రూ.46వేల కోట్ల విలువైన బంగారం స్విస్‌కు తరలింపు

## వెనిజులా మాజీ అధ్యక్షుడు మదురోపై అభియోగాలు

**కారకాస్,జనవరి 7:** అమెరికా నిర్బంధంలో ఉన్న వెనిజులా మాజీ అధ్యక్షుడు నికొలస్ మదురో పెద్దమొత్తంలో బంగారాన్ని స్విట్జర్లాండ్‌కు తరలించారని ప్రచారంలోకి వచ్చింది. మొత్తం 5.20 బిలియన్ డాలర్లు అంటే భారతకరెన్సీలో సుమారు రూ.46 వేలకోట్ల వరకూ ఉన్న బంగారాన్ని తరలించినట్లు కస్టమ్స్ డేటా ఆధారాలతో మీడియా కథనాలు వెలువడ్డాయి. ఆర్థికసంక్షోభంలో ఉన్న ప్రభుత్వం నిలబెట్టేందుకు ప్రభుత్వం బంగారం విక్రయాలుచేస్తున్న సమయంలోనే ఈ తరలింపు జరిగినట్లు స్విస్ బ్రాడ్‌కాస్ట్‌సంస్థ వివరించింది. 2013 నుంచి 2016వరకూ వెనిజులా సెంట్రల్ బ్యాంకునుంచి సుమారు 113 మెట్రిక్‌టన్నుల విలువైన బంగారం తరలించినట్లు తెలుస్తోంది. మొత్తం 113 మెట్రిక్‌టన్నుల విలువైన బంగారం తరలింపుజరిగిందని తెలుస్తోంది. ఈయూ ఆంక్షలక్రమంలో 2017-2025వరకూ వెనిజులానుంచి స్విస్‌కు ఎలాంటి తరలింపులు జరగలేదు. మదురో ఆయన సహచరులకున్న ఆస్తులు స్తంభింపచేయాలని స్విట్జర్లాండ్ కూడా ఆదేశాలు జారీచేసింది. అయితే వాటి మొత్తం విలువ ఎంత ఉంటుందన్న సమాచారంలేదు. శుద్ధి సర్టిఫికేషన్‌కోసమే వెనిజులా ఈ బంగారం తరలించిందని తెలుస్తోంది. స్టోన్ ఎక్స్ మార్కెట్ ఆర్థికవేత్త రోనా ఒకానెల్‌మాట్లాడుతూ మదులో తొలిసారి అధ్యక్షుడుగా ఉన్న హయాంలో సెంట్రల్‌బ్యాంకునుంచి పెద్ద ఎత్తున అత్యవసర విక్రయాలుజరిగాయని, వాటిలో ఎక్కువ స్విస్‌కే వెళ్లాయని తెలిపారు. వెనిజులా ఆర్థికచెల్లింపులు అన్నీ కూడా బంగారం రూపంలో జరిగి ఉండవచ్చన్న సందేహం కూడా వ్యక్తంచేసారు. అలాగే ఆసియా ఇతర దేశాలకు చిన్నచిన్న కడ్డీలు, బార్‌లరూపంలో విక్రయాలు కూడాచేసి ఉండవచ్చని ఆమె అన్నారు.

# మూడోరోజు సెన్సెక్స్, నిఫ్టీలకు తప్పని నష్టాలు!



**ముంబయి, జనవరి 7:** దేశీయ స్టాక్ సూచీలు వరుసగా మూడోరోజు కూడా నష్టాల్లోనే ముగిసాయి. భారీస్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడులు పెరిగాయి. నిఫ్టీ సూచీ 26,150 దిగువన ముగిసింది. గ్లోబల్‌మార్కెట్ ధోరణులు మిశ్రమంగా కనిపించడం, భౌగోళిక ఉద్రిక్తతలు, వెనిజులా పరిస్థితులు మార్కెట్లపై ప్రభావంచూపించాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 120.20 పాయింట్లు ఒకఊణించ 84,961.14 పాయింట్లవద్ద ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 37.95 పాయింట్లు క్షీణించి 26,140.75 వద్ద నిలిచింది. వరుసగా మూడు ట్రేడింగ్‌లలో సెన్సెక్స్ 0.93శాతం, నిఫ్టీ 0.71శాతం క్షీణించాయి. మారుతిసుజుకి ఇండియా 2.81శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.24శాతం, బజాజ్‌ఫైనాన్స్ 0.78శాతం చొప్పున ముగిసాయి.

ఇక బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.47శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.12శాతంచొప్పున పెరిగాయి. మార్కెట్‌లపరంగా బిఎస్ఇలో 2104 షేర్లుపెరిగితే 2068 షేర్లు క్షీణించగా 179 షేర్లు స్థిరంగా మార్పులులేకుండా కొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 89.8750వద్ద నిలిచింది. అంతకుముందురోజు 90.18 వద్ద ముగిస్తే మరికొంత క్షీణించింది. ఎంసిఎక్స్‌లోపసిడి ఫ్యూచర్లు ఫిబ్రవరి నెలనాటికి ధరలు రూ.1.38,222 వద్ద ముగిసాయి. కమోడిటీల మార్కెట్‌లోబెంట్‌ముడిచమురు మార్చినెల సెటిల్‌మెంట్ జరిగింది 54 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 60.16 డాలర్లుగా కొనసాగింది. మారుతి సుజుకి, టాటా మోటార్స్, పవర్ గ్రిడ్, హిందుస్తాన్ యునీలివర్, ఏసియన్ పెయింట్స్, టాటా స్టీల్ వంటి సంస్థలు నష్టపోగా టైటాన్, హెచ్ సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, సన్ ఫార్మా వంటి సంస్థలు లాభాలు చవిచూశాయి. అలాగే ఇండియన్ హోటల్స్ 1.36శ్రాతం దిగజారింది. మీషో కూడా దిగువస్థాయిలోనే ఐదుశాతం క్షీణించి 173.20 వద్ద ముగిసింది. సిఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ 2.31శాతంగా పెరిగింది. పనోరమ స్టూడియోస్ ఇంటర్నేషనల్‌కూడా 3.52శాతంపెరిగింది.

ఇన్ఫోఎడ్జ్ ఇండియా 1.95శాతంపెరిగింది. త్రైమాసిక ఫలితాలు పటిష్టం కావడమే ఇందుకు కారణం. కళ్యాణ్‌జ్యూయెలర్స్ 4.03శాతం పెరిగింది. పిటిసి ఇండస్ట్రీస్ 0.85శాతం పడిపోయింది. టాటాపవర్‌కంపెనీ 1.40శాతం జూబిలియంట్ ఫుడ్‌వర్క్స్ 1.70శాతంచొప్పున క్షీణించాయి. ఇక ఐఆర్‌బి ఇన్‌ఫ్రా డెలవపర్స్ 1.15శాతం పెరిగాయి.

## జొమాటో మాతృసంస్థ ఎటర్నల్‌కు

# రూ.3.70 కోట్ల జిఎస్టీనోటీసులు


**ముంబయి, జనవరి 7:** జొమాటో, బ్లింకిట్ మాతృసంస్థ ఎటర్నల్‌కు 3.70 కోట్ల జీఎస్టీ నోటీసులు వచ్చాయి. ఏప్రిల్ 2019 నుంచి 2020 మార్చినెలలమధ్యకాలంలో జీఎస్టీ ఎగవేసిందని, అసలు వడ్డీ, జరిమానాతో కలిపి మొత్తం రూ.3.69,80,242 రూపాయలు చెల్లించాలని నోటీసులు జారీచేసింది. పశ్చిమబెంగాల్‌లోని స్టేట్‌ట్యాక్స్ అప్పీల్స్ విభాగం అదనపు




కమిషనర్ ఈ ఉత్తర్వులు జారీచేసారు. డిమాండ్ ఆర్డర్ వచ్చిందని,అ యితే కొంత మొత్తం మాత్రమే చెల్లించాల్సి ఉందని, దీనిపై వడ్డీ, జరిమానాలు విధించారని ఎటర్నల్ స్టాక్ ఎక్స్ఛేంజిలకు నివేదిక ఇచ్చింది. ఈ జరిమానా ఉత్తర్వులపై తాము తగిన అప్పీలేట్ అథారిటీలో పిటిషన్ వేసి సవాల్ చేస్తామని ఎటర్నల్ చెపుతోంది. అసలు జీఎస్టీ 1,92,43,792 రూపాయలు కాగా వడ్డీ 1,58,12,070 రూపాయలు, జరిమానాగా 19,24,380 రూపాయలు చెల్లించాలని జీఎస్టీ విభాగం నోటీసుల్లో పేర్కొంది.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం గురువారం 08 జనవరి 2026 I



# 250 హెక్టార్లలో జూపార్క్ ఏర్పాటుకు సన్నాహాలు

## ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యం



**ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో, జనవరి 07 (ప్రభాతవార్త) :** రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులుగా ఎన్నికైన నాటి నుండి నేటి వరకు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తూ ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్న శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ కృషితో నేడు దివాన్ చెరువు వద్ద జూ పార్క్ ఏర్పాటుకై ఢిల్లీ నుండి ప్రత్యేక అధికారుల బృందంతో కలిసి జూ పార్క్ నిర్మాణం కోసం దివాన్ చెరువు అటవీ ప్రాంతాన్ని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి, రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీ బత్తుల బలరామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గారు మాట్లాడుతూ రాజానగరం మండలం దివాన్ చెరువు లో సుమారు 310 హెక్టార్ల అటవీ ప్రాంతం ఉంది. అందులో 250 హెక్టార్లలో జూ పార్క్ ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతమని తెలిసిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, స్థానిక పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి పూర్తి వివరాలతో వారిని కలిసి తెలియజేయగా ప్రభుత్వం వారు వెంటనే స్పందించి కేంద్ర అటవీ శాఖ అధికారులతో చర్చించి నేడు ప్రత్యేక అధికారుల బృందాన్ని పంపి ప్రత్యక్షంగా పరిశీలించారు. 250 హెక్టార్ల భూమి ఎగుడు దిగుడు లేకుండా సమాంతరమైన నేల అవడం వలన జూ పార్క్ ఏర్పాటుకు అనువైన ప్రాంతమని అధికారుల బృందం తెలియజేస్తూ త్వరలోనే జూ పార్క్ ఏర్పాటుకు సంబందించిన పనులు ప్రారంభించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని తెలియజేసారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అతి తొందరలోనే దివాన్ చెరువు ప్రాంతంలో ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలో మరెన్నో అభివృద్ధి, సంక్షమం కార్యక్రమాలు చేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందంజలో ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షమమే లక్ష్యం - నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

### ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల.



**ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో, జనవరి 07 (ప్రభాతవార్త) :** ప్రజా సంక్షమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. బుధవారం రాజానగరం నియోజకవర్గంలో పల్లె పండుగ వారోత్సవాలు 2.0 ద్వారా రూ. 100 కోట్ల అభివృద్ధి పనులను రూ. 1.2 కోట్లతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పల్లె పండుగ ప్రోగ్రాం ద్వారా రూ 1. 2 కోట్ల రూపాయల వ్యయంతో రాజానగరం మండలం శ్రీరామపురం గ్రామంలో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, ప్రభుత్వ అధికారులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామ ఆరోగ్య కేంద్రాలకు ఎమ్మెల్యే పంతం నానాజీ శంకుస్థాపన



**కాకినాడ రూరల్, జనవరి 7( ప్రభాతవార్త):** రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అడుగులు వేస్తోందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య విప్లవానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం, గ్రామీణ ప్రజల చెంతకే వైద్య సదుపాయాలను తీసుకెళ్లేందుకు భారీగా నిధులను కేటాయిస్తోందని ఆయన కొనియాడారు. కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామంలోని సూర్య నగర్ సచివాలయం పరిధిలో, గోపీకృష్ణ కాలనీ మరియు బుల్లబ్బాయి రెడ్డి నగర్‌లో నూతన గ్రామ ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి ఎమ్మెల్యే పంతం నానాజీ భూమిపూజ చేయడం జరిగింది. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఒక్కో కేంద్రానికి రూ. 36 లక్షల చొప్పున వెచ్చించి ఈ భవనాలను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ, నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, ఈ కేంద్రాలు అందుబాటులోకి వస్తే స్థానికులకు తక్షణ వైద్య సాయం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ పూర్తి చేస్తూ రూరల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం సూర్య నగర్ సచివాలయంలో రైతులకు రాజముద్రతో కూడిన 391 కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. రైతుల ఆత్మగౌరవాన్ని కాపాడేలా, వారి భూములకు పూర్తి భరోసా కల్పించేలా ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుందని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రైతులకు పారదర్శకంగా భూ హక్కులు కల్పించడం ఆనందదాయకమని, ప్రభుత్వ పథకాలన్నీ అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా యంత్రాంగం కృషి చేస్తోందని వివరించారు. కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తూరంగి పంచాయతీ ప్రత్యేక అధికారి ఎమ్మెస్పార్ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి ఎస్ నాగఫణి బాబు,గ్రేడ్ 5 కార్యదర్శులు రణదేవ్, తేజస్వి, సుష్మ ,షేక్ రిజ్వి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వీరబాబు, వసంత లక్ష్మి, రోజా, దేవి,రి సర్వే డిటీ కాకర్ల సురేష్, ఆర్ఐ మేడిశెట్టి భవాని, వీఆర్వో కే .శ్రీనివాస్,డీ ఈ బి. సత్య శ్రీనివాస్ మరియు ఇంజనీరింగ్ సిబ్బంది, డాక్టర్ వసుంధర దేవి, ఏ ఎన్ ఎం డీ. మేరీ రత్నం, ఎం ఎల్ హెచ్ పి. ఐ పావని,జనసేన మాజీ ఎంపీటీసీలు పితాని వెంకట రాము, వాసంశెట్టి త్రిమూర్తులు, జనసేన గ్రామ కమిటీ ప్రెసిడెంట్ పితాని తేజ, తెలుగుదేశం గ్రామ కమిటీ ప్రెసిడెంట్ జక్కి అప్పన్న కూటమి నాయకులు పాల్గొన్నారు.

## "వెలుగు" కార్యాలయానికి సంబంధం లేని వ్యక్తులు వెళ్లి ఇబ్బందులు సృష్టిస్తే చర్యలు..

### మండల సర్వసభ్య సమావేశంలో స్పష్టం చేసిన ఎమ్మెల్యే గిడ్డి..



**అంబాజీపేట, జనవరి 7, (ప్రభాతవార్త):** మహిళల ఆర్థిక స్వాలంబన కోసం, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం మహిళల ఆధ్వర్యంలో పనిచేస్తున్న వెలుగు (డ్వాక్రా) కార్యాలయానికి సంబంధం లేని వ్యక్తులు ( పురుషులు) వెళ్లి వారి విధులకు ఆటంకం కలిగిస్తున్నారని తన దృష్టికి వచ్చిందని, అటువంటి వారిపై చట్ట పరమైన చర్యలకు సిఫార్సు చేస్తానని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ హెచ్చరించారు.అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన బడ్జెట్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు మాట్లాడుతూ గంగలకుర్రు అగ్రహారంతో పాటు ఇతర గ్రామాల్లో మేకలు,గొర్రెల మందలకు ఎటువంటి షెడ్డులు లేకపోవడంతో గంటల తరబడి రోడ్లపై నిలిపి వేస్తున్నారని, దాంతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా పెంపకందారులకు రాయితీపై గోకులం షెడ్డులు నిర్మించి ఇవ్వాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు మాట్లాడుతూ డ్రైయిన్లలో తుప్పు, తూడు పెరిగిపోతున్న సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వదిలేస్తు న్నారన్నారు.నిరుపేద కుటుంబాల వారు అమలాపురం ఏరియా ఆస్పత్రిలో గర్భిణీలు ప్రసవం చేయించుకుంటే సరైన వైద్యం అందించకుండా ప్రైవేటు ఆస్పత్రికి పంపుతున్నారని ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంబంధిత అధికారుతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లో రైతులకు అవసరమైన యూరియాను ఈ-పంట నమోదు జాబితా ప్రకారం పంపిణీ చేయాలని వ్యవసాయాధికార్ి .ధర్మప్రసాద్ కు సూచించారు.ఎవరైనా ఆధార్ కార్డు తీసుకువస్తే వారికి యూరియా పంపిణీ చేయవద్దని, అలా చేసిన అధికారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని ఆరు సొసైటీలలో యూరియా అందుబాటులో ఉందని, రైతులు వారి అవసరం మేరకే వినియోగించుకోవాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులను అడిగి సమాచారం తెలుసుకొని పనులు చేయించుకోవాలన్నారు. సంక్రాంత్రి పండుగను పురస్కరించుకుని మొసలపల్లి జగ్గన్నతోటలో నిర్వహించే ప్రభల తీర్థాన్ని అందరి సహకారంతో ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. సమావేశానికి హాజరు కాని అధికారుల నుండి వివరణ తీసుకోవాలని ఎంపీడీవో బి.మమతకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి,ఎంపీడీఓ బి.మమత,తహసీల్దార్ బి.చినబాబు,వివిధ శాఖల అధికారులు,సర్పంచులు, ఎంపీటీసీలు,సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.

**విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే గిడ్డి..**

రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీల్లో రీల్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించిన అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఆకుల లక్ష్మిప్రసన్నను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అభినందించారు.అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో లక్ష్మిప్రసన్నను దుశ్శాలువాతో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి. మమత,ఇన్చార్జి డీవైఈఓ కాండ్రేగుల వెంకటేశ్వరరావు, ఎంఈఓ మోకా ప్రకాష్, హెచ్ఎం కదలి సాయిరామ్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పిటిసి బూడిద వరలక్ష్మి,ఏఎంసీ వైస్ చైర్మన్ కొర్లపాటి ఢిల్లీ, సర్పంచ్లు నాగాబత్తుల శాంతకుమారి,కోట బేబీరాణి, వయసు ఎంపీపీ నేతల నాగరాజు, ఉపాధ్యాయులు బిఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

## రైతులకు పారదర్శకంగా రెవెన్యూ సేవలు



**శంఖవరం, జనవరి 7 ,( ప్రభాతవార్త):** రైతులకు పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే చెందుతుందని రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్న శివ పేర్కొన్నారు. మండలంలోని కత్తిపూడి గ్రామములో సచివాలయం ఒకటి లో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి హాజరై, రైతులకు నూతన పట్టాదార పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగ శివ మాట్లాడుతూ నేడు మండలములోని వివిధ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పంపిణీ చేయుటం జరుగుతుందన్నారు. గతములో యిచ్చిన ప్రభుత్వ పాలకుల ఫోటోలతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చారాని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రీసెర్వేల జరిగిన తప్పులను సరిచేసి ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులందరికీ అందజేస్తుందన్నారు. వాటిలో చిన్నపాటి సవరణలు, మార్పులు అవసరమైనచో సచివాలయములో డిజిటల్ అసిస్టెంట్ వద్ద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షమానికి పాటుపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం మీ భూమి మీ హక్కు పేరిట నూతన పాస్ పుస్తకాలను అందిస్తుందని రైతులందరూ పాత పుస్తకాలు అందజేసి కొత్త పుస్తకాలు పొందాలని ఆయన కోరారు అనంతరం బద్ది రామారావు జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్ తదితరులు ప్రసంగించారు తహసిల్దార్ తాతారావు మాట్లాడుతూ పట్టాదారు పాస్ పుస్తకంలలోగల క్యూఆర్ కోడ్ లను వివరిస్తూ వాటిని స్కాన్ చేసినట్లయితే పట్టాదారు వివరములు, భూమి వివరాలు విస్తీర్ణం, స్కెచ్ మరియు రూట్ మ్యాప్, శాటిలైట్ ఇమేజి కూడా చూసుకొనవచ్చునని ఆయన రైతులకు వివరించారు . ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువత అధ్యక్షులు కీర్తి సుభాష్ కాలింగ్ జనార్ధన్ కంచిబోయిన శ్రీను దేశి లంక వెంకటరమణ మచ్చ గంగరాజు క్రి బుజ్జి తుని జోన్ ఆత్మా వైస్ చైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం మండల జనసేన పార్టీ అధ్యక్షులు గాబు సుభాష్, ఎర్రంశెట్టి బాబ్జి, రైతులు పాల్గొన్నారు

## రేషన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వనమాడి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో జనవరి 7( ప్రభాత వార్త)** కాకినాడ సిటీ స్థానిక 36 వ డివిజన్ జిజిహెచ్ వెనుక ప్రాంతం నందు నిర్వహించిన కార్యక్రమంలో రేషన్ కార్డు లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన గోదిమపిండి పంపిణీ కార్యక్రమంలో శాసనసభ్యులు వనమాడి కొండబాబు పాల్గొని గోధుమపిండి పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జితేంద్ర, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ ఎనిమిరెడ్డి మాల కొండయ్య, నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, నల్లూరి తులసి శ్రీనివాస్, కుమార్, పాలికి నాని తదితరులు పాల్గొన్నారు.

## భక్తజనసంద్రంగా వాడపల్లి క్షేత్రం



**ఆత్రేయపురం, జనవరి, 07,(ప్రభాత వార్త)** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం. బుధవారం వేలాది మంది భక్తులతో అలారారింది. ఉదయం మేలుకొలుపు తిరుప్పావై సేవ ఐశ్వర్య లక్ష్మి హెూమం గోపూజ తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. అనంతరం ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం గోపూజ పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆలయం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా ఏర్పాట్లు చేసారు.

## ర్యాలి జగన్మోహిని ఆలయంలో ధనుర్మాసం పూజలు... పోటెత్తినభక్తులు.



**ఆత్రేయపురం, జనవరి, 07(ప్రభాత వార్త)** స్వయంభు క్షత్రంగా విరాజిలుగున్న ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవస్వామి, గోపాల స్వామి వారి దేవస్థానం బుధవారం భక్తులు పోటెత్తారు. ధనుర్మాస సందర్భముగా వేకువజామున మేల్కొలుపు ప్రాతః కాలార్చన విశిష్ట గోదావరి నది జలాల సేకరణ భక్తుల గోత్రనామలతో శ్రీ స్వామి వారికి విశేష పూజలు ఆలయ అర్చకులు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకొని అన్నప్రసాదాలు స్వీకరించారు. అనంతరం విశాఖపట్నం చెందిన దిరిశిన వేంకట శివరామ్, అనురాధ, దంపతులు స్వామి వారిని దర్శించుకొని శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ.10,116/- వేలు విరాళంగా అందించారు. దాతలకు ఆలయ అర్చకులు వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేయించి, ఆలయ కార్యనిర్వాహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, శ్రీ స్వామి వారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు.

## ఆత్మీయ సమావేశం



**పి.గన్నవరం. జనవరి 07(ప్రభాత వార్త)** నరేంద్రపురం చివరకు చినపాలెం2 వద్ద 9 పాలాలకు సంబంధించిన శెట్టిబలిజ సంఘ నాయకులతో పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు . గిడ్డి సత్యనారాయణ . ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే . మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో నరేంద్రపురం గ్రామ ప్రజలందరూ తమ కోరికలు నెరవేరాలని మొక్కుకోవడం జరిగిందని, నేడు సంఘ నాయకులు ఆ మొక్కును తీర్చుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అలాగే గ్రామంలో ప్రస్తుతం ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా తాను చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.అదేవిధంగా గ్రామంలో పెండింగ్‌లో ఉన్న అన్ని రోడ్లను త్వరలోనే మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, 9 పాలాలకు సంబంధించిన శెట్టిబలిజ సంఘ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికే అభ్యంతరం ఎందుకు?

### మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తీరుపై కాపు నేతల ఆగ్రహం



**రావులపాలెం, జనవరి 07 (ప్రభాతవార్త) :** కొత్తపేట నియోజకవర్గంలో అనుమతి లేకుండా ఎన్నో విగ్రహాలు ఏర్పాటు చేసారని, ఏ విగ్రహానికి లేని అభ్యంతరం రావులపాలెం శ్రీకృష్ణదేవరాయల విగ్రహం విషయంలోనే ఎందుకని రావులపాలెం కాపు సంఘం నాయకులు మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం రావులపాలెం శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాపు సంఘం అధ్యక్షుడు సందం వీర వెంకట సత్యనారాయణ, మండల సంఘం అధ్యక్షుడు సాధనాల శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ రాత్రి సమయంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నిస్తున్న జగ్గిరెడ్డి ఆంజనేయస్వామి విగ్రహం, అంబేద్కర్ చిత్ర పటాలను పెట్టేందుకు రాత్రి వేళ ఎందుకు వచ్చారని నిలదీశారు. సుప్రీంకోర్టు తీర్పు, పంచాయతీ తీర్మానం అంటున్నారని అయితే రావులపాలెంలో కళా వెంకట్రావు విగ్రహానికి తప్ప ఏ విగ్రహానికి అనుమతి లేదని అనుమతి లేని విగ్రహాలన్నీ తొలగిస్తే శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని కూడా తొలగిస్తామని స్పష్టం చేశారు. శ్రీకృష్ణదేవరాయలు కాపు కులానికే పరిమితం కాదని, ఆయన దక్షణ భారతదేశాన్ని పాలించిన మహారాజు అన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. గతంలో జగ్గిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నపుడే ఈ విగ్రహ ఏర్పాటు విషయాన్ని ఆయన దృష్టికి తీస్కుళ్లామని చెప్పారు. రావులపాలెంలో శ్రీకృష్ణదేవరాయల పేరుతో కాపు కళ్యాణ మండపం నిర్మించి సుమారు 25 ఏళ్ళు దాటిందని, ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించాలనేది తమ కల అని అన్నారు. ఈ విగ్రహ ఏర్పాటును వివాదాస్పదం చేసి రాజకీయ ప్రయోజనాల కోసం కాపుల మధ్య, కాపులు ఎస్సీ వర్గాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేయవద్దని సూచించారు. తమకు ఎవరితో వివాదాలు వద్దని, శ్రీకృష్ణదేవరాయల విగ్రహం జోలికి రావద్దని మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కోరారు.

## అంబటి భూలక్ష్మిని అభినందించిన ఎమ్మెల్యే బండారు



పి.గన్నవరం.జనవరి 07(ప్రభాత వార్త)రాష్ట్ర సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల బోర్డు డైరెక్టర్ గా తాడేపల్లిలో పదవీ ప్రమాణ స్వీకారం చేసిన అంబటి భూలక్ష్మి ని కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు అభినందించారు. వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి చిత్రపటాన్ని ఆమెకు అందజేసి సత్కరించారు. పి. గన్నవరం ఎంపీపీగా పనిచేసి మండల అభివృద్ధికి ఎంతగానో కృషిచేసిన అంబటి భూలక్ష్మి సముచిత పదవిలో ఉండడం కూటమి ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న గౌరవా నికి నిదర్శనం అన్నారు.

## జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యునిగా పసగడుగుల



**తుని,జనవరి 7,(ప్రభాతవార్త)** కాకినాడ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా తునికి చెందిన సీనియర్ పాత్రికేయుడు పసగడుగుల రాంబాబు నియమితులయ్యారు. ప్రస్తుతం వై ఛానల్ ఎడిటర్ గా కొనసాగుతున్న పసగడుగుల రాంబాబు జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యునిగా నియమితులవడం పట్ల తుని నియోజకవర్గ పాత్రికేయులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే యనమల దివ్య, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, పలువురు పాత్రికేయులు,రాజకీయ, వ్యాపార ప్రముఖులు రాంబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకే "స్ట్రైడ్స్ 2026"




**గండేపల్లి జనవరి 7(ప్రభాతవార్త):** విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకే "స్ట్రైడ్స్ 2026"నిర్వహిస్తున్నట్లు ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మెన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు.డేటా సైన్స్ విభాగం "ఇ-డాటమ్ 2026" కు డాక్టర్ ఎస్.ఎస్.ఎస్.ఎన్.ఉషాదేవి ఎన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ సి.ఎస్.ఇ., జెఎన్టియు, సి.ఎస్.ఇ. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ విభాగం "ఇ-ఆర్టిఫ్యాక్ట్ 2026", కు డాక్టర్ ఎన్. రామకృష్ణయ్య, ప్రొఫెసర్ సి.ఎస్.ఇ విభాగాధిపతి, జెఎన్టియు మెకానికల్ విభాగం "ఎరుడైట్ 2026" కు డాక్టర్ కొప్పనాటి మీరా సాహెబ్, ప్రొఫసర్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్, జెఎన్టియు ముఖ్య అతిధిలుగా పాల్గొన్న కార్యక్రమం లో చైర్మన్ కృష్ణారావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యలో విద్యార్థుల యొక్క సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఇటువంటి సాంకేతిక సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ విద్యాసంవత్సరం నుండి టెక్నికల్ ఈవెంట్లలో భాగంగా వివిధ కల్చరల్స్ ను కుడా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విద్యలో ప్రయోగాత్మక పరిజ్ఞానం విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందిచడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్ మేనేజ్మెంట్ ఎం.వి. హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎమ్. సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరేష్, డైరక్టర్- అకడమిక్స్ డాక్టర్్.సత్యనారాయణ,స్ట్రైడ్స్ 2026 కన్వీనర్ జి. సత్యమోహన్ చౌదరి, డీన్-రీర్ డెవలప్మెంట్ సెల్ డాక్టర్ ఎం. రాధికామణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వై. జయబాబు, వివిధ విభాగాధిపతులు, సీనియర్ అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు

## సాంప్రదాయ బద్దంగా సంక్రాంతి పండుగ జరుపుకోవాలి. సిఐ వెంకటేశ్వరరావు.




**కడియం, జనవరి 7 (ప్రభాతవార్త)** తూర్పుగోదావరి జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ డి . నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు సౌత్ జోన్ డిఎస్పి . భవ్య కిషోర్ ఆధ్వర్యంలో సీఐ. వెంకటేశ్వరరావు..మండల ప్రజలకు హెచ్చరికలు తెలియజేసారు ఈ సందర్భంగా..సిఐ. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.మండలంలో సంక్రాంతి పండుగను ప్రజలందరూ సాంప్రదాయ బద్ధంగా కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని. పండుగా ముసుగులో కోడిపందాలు, పేకాట, మరియు గుండాట మరియు అశ్లీల నృత్యాలు వంటివంటి అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని అటువంటి కార్యక్రమాలు జరిగినట్లయితే వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## పట్టాదారు పుస్తకానికి వంద..!




**రామచంద్రపురం,(కాజులూరు)జనవరి 07,(ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రాజముద్రతో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందించే కార్యక్రమం చేపట్టింది.రాష్ట్ర ప్రభుత్వానికి మచ్చ తెచ్చే విధంగా ప్రభుత్వ గ్రామ రెవెన్యూ అధికారి కార్యాలయాలు వ్యవహరిస్తున్నాయి.పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో రైతుల వద్ద ప్రభుత్వ ఆదేశాలను దిక్కరించి సొమ్ములు వసూలు చేయడం గమనార్హం.ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా వీఆర్వో కార్యాలయంలో బయట వ్యక్తులు చలామణి అవడం స్పష్టంగా కనిపిస్తుంది.ఇక వివరాల్లోకి వెళ్ళితే కాజులూరు మండలం జగన్నాథగిరి గ్రామ వీఆర్వో కార్యాలయంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో రైతుల దగ్గర సొమ్ములు వసూలు చేయడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది.మంగళవారం గ్రామ వీఆర్వో పాస్ పుస్తకాలు రైతులకు పంపిణీ చేస్తున్నప్పుడు రైతుల వద్ద పుస్తకానికి వంద రూపాయలు చందా వసూలు చేసే వైనం బయటపడింది.ఈ విషయమై వార్త ప్రతినిధి వీఆర్వో నీ ప్రశ్నించగా ఆ సొమ్ముకు నాకు ఎటువంటి సంబంధం లేదు,తీసుకున్న వ్యక్తి బయట వ్యక్తి కనుక నాకు సంబంధం లేదు అంటూ తప్పించుకునే ప్రయత్నం చేశాడు.అసలు జరిగిన ఉదాంతమంతా వీఆర్వో కార్యాలయంలో వీఆర్వో ఒక వ్యక్తిని అనుచరుడిగా పెట్టుకుని అతనితో రైతుల వద్ద సొమ్ము వసూలు చేయడం ప్రత్యక్షంగా జరిగింది.ఈ విషయమై సంబంధిత అధికారులు విచారణ జరిపించి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## ఏపీఎఫ్ఆర్ నమోదు తప్పనిసరి : ఏడిఏ

**గంగవరం, జనవరి 7, (ప్రభాతవార్త):** మండలంలోని గుడిగళ్ళభాగ, కుదుపూరు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సహాయ వ్యవసాయ సంచాలకులు బి నాగ కుమార్ హాజరై నేరుగా విత్తే వరిలో చేపట్టవలసిన సాగు యాజమాన్య పద్ధతులు పై అవగాహన కల్పించారు. ఏవో మాట్లాడుతూ ఏపిఎఫ్ఆర్ లో నమోదు కాని రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ భూమి సంబంధిత రైతు సేవా కేంద్రాలు లో చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుడిగళ్ళభాగ సర్పంచ్ పిల్లి సూర్యనారాయణ, గంగవరం టిడిపి మండలం అధ్యక్షులు మేడిశెట్టి రవికుమర్,విఏఏ దేవి వరలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం



**గోపాలపురం జనవరి 07, (ప్రభాతవార్త):** గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను స్వచ్ఛంద సేవా సంస్థలు ఏర్పాటు చేయటం అభినందనీయమని గోపాలపురం గ్రామ సర్పంచ్ పైడి శిరీష అన్నారు. ప్రగతి అసోసియేషన్ రూరల్ డెవలప్మెంట్(పార్డ్) ఇండియా స్వచ్ఛంధ సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రం వైద్య బృందంచే పెద్దగూడెం గ్రామంలోని, ఎలిమెంట్రీ పాఠశాల వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ శిరీషా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ శిబిరంలో గుండె, కళ్ళు, చెవి, ఎముకలు, లివర్, షుగర్, బీపీ, రక్త పరిక్షలు, ఎక్స్ రే, స్కానింగ్, ఈసీజీ వంటి పరిక్షలు సైతం నిర్వహించి, తగిన మందులు ఉచితంగా అందజేశారు. అదేవిధంగా స్త్రీల విభాగాన్ని కూడా నిర్వహించి అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. ముందుగా పార్డ్ సభ్యులు, వైద్య సిబ్బంది డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ శిబిరానికి సుమారు 150 మందికి పైగా వచ్చి వైద్య పరిక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ శిరీషా మాట్లాడుతూ.. ప్రస్తుతం కాలానుగుణంగా మారుతున్న వాతావరణంలో ప్రతిఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్ళి, కార్పొరేట్ ఆసుపత్రుల్లో డబ్బులు ఖర్చు చేసుకోలేని పల్లె ప్రాంతాల ప్రజలకు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. పెద్దగూడెంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పేద ప్రజలకు విలువైన వైద్యాన్ని ఉచితంగా అందజేసిన పార్డ్ ఇండియా సభ్యులకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాలలో పార్డ్ ఇండియా సభ్యులు దొడ్డిగర్ల వెంకటేశ్వరరావు, చింతలపూడి భాస్కరరావు, ఎం.కొండలరావు, గుమ్మడి నాగేశ్వరరావు, దాసరి రామారావు, పాముల తిరుపతయ్య, ఆర్.రత్నభాస్కర్, బొంతా శ్రీరాములు, పైడి దొరబాబు, దాసరి రవి, సిఆర్పీ నాగరాజు, నవ చైతన్య అంబేద్కర్ సేవా సంఘ సభ్యులు, పాల్గొన్నారు.

## స్థన క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



**మామిడికుదురు.జనవరి 07(ప్రభాతవార్త)** స్థన క్యాన్సర్ పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అమెరికాకు చెందిన ప్రముఖ వైద్యురాలు లోపముద్ర దాస్ సూచించారు. బుధవారం పాశర్లపూడి లో జరిగిన స్థన క్యాన్సర్ పై అవగాహన,పరీక్ష అవుట్ రీచ్ క్యాంపు ఏర్పాటు చేశారు. స్క్రీనింగ్ లేక భారతదేశంలో ఆలస్యంగా స్థన క్యాన్సర్ ను గుర్తిస్తున్నారన్నారు.గోదావరి జిల్లాల్లో స్థన క్యాన్సర్ కేసులు ఆందోళన కలిగిస్తున్నా యన్నారు.ఇది మహిళలతో పాటు పురుషులకు వచ్చే ప్రమాదం ఉందన్నారు. మహిళలు రుతుక్రమం అయిన వారం రోజుల తరువాత పరీక్ష చేయించుకోవాలన్నారు.శరీరంలో కలిగే అసాధారణ మార్పులను గమనించాలన్నారు.రొమ్ములో కొంత భాగం కాని పూర్తిగా కాని వాపు లేదా గడ్డ రొమ్ము చర్మం పై దురద లేదా చొట్ట బడడం,రొమ్ము లేదా చను మొనలలో నొప్పి వంటివి క్యాన్సర్ లక్షణాలని,ఈ లక్షణాలు కనబడిన వారు డాక్టర్ ను సంప్రదించాలని సూచించారు.పలువురికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు.ఈ కార్యక్రమంలో రాజోలు ప్రభుత్వ ఆసుపత్రి మత్తు వైద్యాధికారిణి అనూష, పాశర్లపూడి ఆయుర్వేద వైద్యురాలు కనకదుర్గ, మాజీ సర్పంచ్ కుసు నాగరాజు,వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు స్థానికులు పాల్గొన్నారు.

## పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : ఆర్డిఓ పి శ్రీకర్



**కొత్తపేట, జనవరి 07,(ప్రభాతవార్త)** రాబోయే పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కొత్తపేట డివిజన్ పరిధిలోగల విద్యాశాఖ కు సంబంధించిన మండల విద్యాశాఖాధికారులకు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కొత్తపేట పి శ్రీకర్ సూచించారు. కొత్తపేట డివిజన్ ఉప విద్యాశాఖాధికారి డి వై ఇ ఓ వెంకటేశ్వర రావు అధ్యక్షతన సమావేశం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కొత్తపేట రెవిన్యూ డివిజనల్ అధికారి పి శ్రీ కర్ విచ్చేసి గత సంవత్సరం లో పదవ తరగతి లో తక్కువ ఉత్తీర్ణత వచ్చిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కారణాలను అడిగి తెలుసుకొన్నారు అర్థన వివరాలపై తగు సూచనలు ఇచ్చారు అలాగే పదవ తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక పై ప్రధానోపాధ్యాయులను ఏవిధముగా అమలు జరుపుచున్నది అని అడిగి తెలుసుకొని వాటిపై తగిన సూచనలు సలహాలు ఇచ్చారు వచ్చే పదవ తరగతి పరీక్షల లలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు విద్యాశాఖ కు సంబంధించిన అన్ని విషయాలలో కొత్తపేట డివిజన్ మొదటి స్థానం లో ఉండాలని సూచించారు గతంలో అదనపు బాధ్యతలు నిర్వహించిన కొత్తపేట డివిజన్ ఉప విద్యాశాఖాధికారి డి వై ఇ ఓ పి రామలక్ష్మణ మూర్తి ప్రధానోపాధ్యాయులు తనకు అందించిన సహాయ సహకారములకు ధన్యవాదములు తెలియచేసినారు ఈ కార్యక్రమములో కొత్తపేట మండల రెవెన్యూ అధికారి వై రాంబాబు కొత్తపేట డివిజన్ విద్యాశాఖాధికారులు సిబ్బంది పాల్గొన్నారు

## సంక్రాంతి సంబరాలపై అధికారులతో సమీక్ష..



**ఆత్రేయపురం, జనవరి, 07(ప్రభాత వార్త)** సంక్రాంతి సంబరాల నిర్వహణపై మండల పరిషత్ కార్యాలయం నందు బుధవారం అధికారులతో ఎంపీడీవో ఖి..ఎస్.ఎస్.వి. రామన్, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణంరాజు లు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామన్ మాట్లాడుతూ, సంక్రాంతి సంబరాల సందర్భంగా పంచాయితీ కార్యదర్శులు తమకు కేటాయించిన ప్రదేశాలలో ఎటువంటి వ్యర్థాలు లేకుండా ప్రత్యేక శానిటేషన్ చర్యలు చేపట్టి, ఎప్పటికప్పుడు శుభ్రత పాటించవలసినదిగా ఆదేశాలు జారీ చేశారు. అలాగే వివిధ శాఖల అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన విధులను సమన్వయంతో సక్రమంగా నిర్వహించి సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణంరాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కొండాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాల వాడపత్రిక ఆవిష్కరణ



**పి. గన్నవరం . జనవరి 07(ప్రభాత వార్త)** బోడపాటివారిపాలెం వద్ద వేంచేసి ఉన్న శ్రీ కొండాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు ఈనెల 14వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. పి. గన్నవరం లోని క్యాంప్ కార్యాలయం వద్ద అమ్మవారి తీర్థ మహోత్సవాల గోడపత్రికలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆవిష్కరించారు. ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ సమయంలో నిర్వహించుకునే కొండాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు ఈ ఏడాది కూడా ఘనంగా జరగాలని అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పి. గన్నవరం సొసైటీ చైర్మన్ సాధనాల జెడి, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్, ఎంపీటీసీలు షేక్ దొరబాబు, ఆదిమూలం సూరయ్య కాపు, దైవాల రాంబాబు, బోడపాటివారిపాలెం నాయకులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా అంబటి భూలక్ష్మి పమాణస్వీకారం మహోత్సవం




**పి గన్నవరం జనవరి 07(ప్రభాత వార్త)**రాష్ట్ర సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమల బోర్డు డైరెక్టర్ గా నియమితులైన పి. గన్నవరం మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మ ప్రమాణ స్వీకారం మహోత్సవం తాడేపల్లి లోని ఓ ఫంక్షన్ హాల్ వద్ద బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. పి. గన్నవరం మండలంలోని ముంగండ గ్రామం లోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ సన్నిధి నుండి పి. గన్నవరం నియోజకవర్గానికి చెందిన కూటమి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సుమారు 50 కార్లలో తాడేపల్లికి భారీ ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ముందుగా అంబటి భూలక్ష్మ కోటేశ్వరరావు దంపతులు శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ముంగండ లోని దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్, భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా పి.గన్నవరం మూడు రోడ్ల కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాడేపల్లిలో ప్రమాణ స్వీకారం చేసిన అంబటి భూలక్ష్మ ని రాష్ట్ర సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమల బోర్డు చైర్మన్ తమ్మి రెడ్డి శివ శంకర్రావు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, రాష్ట ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, తదితర ప్రముఖులు సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మ, కూటమి నాయకులు దాసరి వీర వెంకట సత్యనారాయణ, గిడ్డి ఆనందరావు, మైపాల తాతాజీ, సంసాని పెద్దిరాజు, శేరు శ్రీను, ఆదిమూలం సూరయ్య కాపు, పప్పుల సాయిబాబు, గుత్తుల రామకృష్ణ, పితాని రాంబాబు, మట్టపర్తి వెంకటేశ్వర రావు, చెల్లుబోయిన వెంకటేశ్వర రావు, చీకట్ల రామకృష్ణ, నారిన సత్తిపండు, బొరుసు సూరిబాబు, నేలపూడి చిట్టికుమారి దుర్గారావు, పెచ్చెట్టి వెర్రియ్య, సాయి, నిమ్మకాయల శేషు, బొరుసు సుబ్బరాజు, పైడి బుజ్జి, యాండ్రా శ్రీను, గుడాల వెంకటరమణ, అరిగేల సూరిబాబు, నాగబత్తుల సుబ్బారావు, యర్రంశెట్టి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు

## వెలిచేరులో పొలం పిలుస్తుంది ..



**ఆత్రేయపురం,జనవరి, 07,(ప్రభాత వార్త )** రైతులకు నానో యూరియా, ప్రకృతి వ్యవసాయం పై వెలిచేరు రైతు సేవ కేంద్రం నందు. బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి ఎం. వి. రామారావు, మండల వ్యవసాయ అధికారి పట్టాభి రామయ్య లు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కొత్తపేట వ్యవసాయ సహాయ సంచాలకులు పదవి నుండి పదోన్నతి పై జిల్లా వ్యవసాయ అధికారిగా వెళ్లిన రామారావుని వెలిచేరు గ్రామ సర్పంచ్ వేముల శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు నాగిరెడ్డి సత్యనారాయణ, పంచాయతీ సెక్రటరి శ్రీమతి ఎ. యామిని కలిసి సత్కరించారు.ఈ కార్యక్రమానికి , నీటి సంఘం అధ్యక్షులు నాగిరెడ్డి వర ప్రసాద్, కూటమి నాయకులు ఘంటా శివ రామ కృష్ణ, కొప్పుల ప్రసాద్, పలువురు గ్రామ పెద్దలు, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ ఉధ్యాన సహాయకురాలు _. రేణుక రాఘవి రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి " పాత్రికేయులు"..: ఎమ్మెల్యే గిడ్డి..



**అంబాజీపేట, జనవరి 7, (ప్రభాతవార్త):** ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పాత్రికేయులు పనిచేస్తారని, నిజాన్ని నిర్భయంగా వార్తా కదనాన్ని వెల్లడించే విలేకరి వృత్తి కత్తి మీద సాము లాంటిదని పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ (ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) అక్రిడిటేషన్ కమిటీ సభ్యునిగా నియమితులైన అంబాజీపేట "తాజా" ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పళ్ళ సూర్యప్రకాశరావు (బాబ్జి)ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ బుధవారం అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో విలేకరి సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం నూతనంగా అక్రిడిటేషన్ జిల్లా కమిటీ సభ్యునిగా నియమితులైన బాబ్జి ని ఎమ్మెల్యే సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ తనకు అక్రిడిటేషన్ జిల్లా కమిటీలో సభ్యునిగా నియమితులయ్యేందుకు సహకరించిన ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకట్రావు, కార్యదర్శి జి.ఆంజనేయులు, నేషనల్ ఎలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్ కార్యదర్శి వాతాడ నవీన్ రాజ్, రాష్ట్ర కోశాధికారి మట్టపర్తి శ్రీనివాస్, నాయకులు సమయమంతుల హరిప్రసాద్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.బాబ్జిని అభినందించిన వారిలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు,ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబు,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు,కొర్లపాటి గోపి,వాసంశెట్టి పెదబాబు,మట్టపర్తి హరి,పత్తి దత్తుడు,నాగవరపు నాగరాజు,ఎంపీడీవో బి.మమత, తహసిల్దార్ బి. చినబాబు, వివిధ శాఖల అధికారులు అభినందించారు.

## ఎక్స్ఐఎన్ఎన్ఓ సమ్మిట్ 2026 పోస్టర్ ఆవిష్కరణ



**ఏలేశ్వరం, జనవరి 07,(ప్రభాతవార్త)** ఏలేశ్వరం పోలీస్ స్టేషన్లో ?ఎక్స్ఐఎన్ఎన్ఓ సమ్మిట్ 2026కు సంబంధించిన అధికారిక పోస్టర్ను బుధవారం ఏలేశ్వరం పోలీస్ స్టేషన్లో లిపెద్దాపురం డివిజన్ డీఎస్పీ శ్రీహరి రాజు గారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లిలిప్రతిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏలేశ్వరం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ గారు మాట్లాడుతూ, ?"నేటి డిజిటల్ యుగంలో సైబర్ సెక్యూరిటీ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ)పై అవగాహన ప్రతి యువకుడికి, విద్యార్థికి అత్యంత అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో ఈ తరహా పెద్ద స్థాయి టెక్నాలజీ సమ్మిట్ నిర్వహించడం అభినందనీయం.ఎక్స్ఐఎన్ఎన్ఓ సమ్మిట్ 2026 యువతకు సరైన దిశానిర్దేశం చేస్తుంది" అని తెలిపారు.అలాగే, ఈ సమ్మిట్లో లిలిసైబర్ నేరాలపై అవగాహన, డిజిటల్ భద్రత, (ఏఐ) వినియోగం,స్టార్టప్ అవకాశాలు వంటి అంశాలు చర్చించబడతాయని పేర్కొన్నారు. ప్రతి యువకుడు, విద్యార్థి ఈ సమ్మిట్లో తప్పనిసరిగా పాల్గొని తమ భవిష్యత్తును సురక్షతంగా, సాంకేతికంగా ముందుకు తీస్కుళ్లాలని సూచించారు.స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ ఎక్స్ఐఎన్ఎన్ఓ సమ్మిట్ జనవరి 25, 2026 ఏలేశ్వరం వేదిక ఫంక్షన్ హాల్ లో నిర్వహించబడనుంది.గ్రామీణ యువతలో ఉన్న ప్రతిభను వెలికి తీసి, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్టార్టప్స్ రంగాల్లో అవకాశాలను అందించే వేదికగా ఈ సమ్మిట్ నిలవనుందని నిర్వాహకులు తెలిపారు.ఈ భారీ సమ్మిట్ను గ్రామీణ ఆంధ్రప్రదేశ్లో నిర్వహించేందుకు ముందుకు వచ్చిన స్పార్క్ సంస్థను ఆయన అభినందించారు. స్పార్క్ చైర్మన్ సందీప్, సంస్థ సి ఈ ఓ ప్రదీప్ ను అభినదించారు.గ్రామీణ యువతలో ఉన్న ప్రతిభను వెలికి తీసి, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్టార్టప్స్ రంగాల్లో మార్గదర్శకంగా నిలిచే వేదికగా ఎక్స్ఐ ఎన్ఎన్ఓ సమ్మిట్ 2026 నిలవనుందని నిర్వాహకులు తెలిపారు.రిజిస్ట్రేషన్ కొరకు స్పార్క్ ను సంప్రదించగలరు.

## పలు గ్రామాల్లో మరణించిన వారికి చేయూత: పోలిశెట్టి ఫౌండేషన్



**గంగవరం, జనవరి 7,( ప్రభాతవార్త):** పోలిశెట్టి లక్ష్మ సుబ్బారావు మెమోరియల్ ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా పవన్ కళ్యాణ్ స్ఫూర్తి తో, డొక్కా సీతమ్మ ఆసరా పథకం తరపున బుధవారం గంగవరం మండలం లో మరణించిన వారి కుటుంబాలను పరామర్శించి బియ్యం,నిత్యవసర సరుకులు అందించినట్లు పోలిశెట్టి పెద్దబాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే పామర్రు గ్రామంలో తాతపూడి మావుళ్లమ్మ, కూళ్ల గ్రామానికి చెందిన గుండపు పోతురాజు, పలివెల శాంతమ్మ, సుందరపల్లి గ్రామానికి చెందిన మద్దా జగన్నాథం, మద్రి భాగ్యవతి,సుందరపల్లి లక్ష్మ, పాణింగపల్లి గ్రామానికి చెందిన ఇతకోటి అభిషేక్,గంగవరం గ్రామానికి చెందిన కొంకిపూడి నాగమణి,బట్లపాలిక గ్రామానికి చెందిన కావూరి గోవింద్ ,శేరిలంక గ్రామానికి చెందిన కొండేపూడి సుబ్బారావు కుటుంబ సభ్యులను ట్రస్ట్ ఛైర్మెన్ పోలిశెట్టి చంద్రశేఖర్ ఆదేశాలు మేరకు జనసేన పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్, నియోజకవర్గం ట్రస్ట్ కోఆర్డినేటర్ గుబ్బల శ్రీనివాస్, జనసేన పార్టీ_.గంగవరం మండల అధ్యక్షులు చిత్రా రాజకుమార్, పోలిశెట్టి పెదబాబు పరామర్శించి వారికి ట్రస్ట్ ద్వారా నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల జనసేన కార్యకర్తలు, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వైసీపీని మరింత బలోపేతం చేద్దాం



**మామిడికుదురు.జనవరి 07(ప్రభాతవార్త )** వైఎస్ ఆర్సీపీ అనుబంధ కమిటీలు,మండల కమిటీల ఏర్పాటుతో పార్టీని మరింత బలోపేతం చేద్దామని ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కుడుపూడి విద్యాసాగర్, కార్యదర్శి బొంతు శ్రీనివాస్ పేర్కొన్నారు. పాశర్లపూడిలో మాజీ సర్పంచ్ మొల్లేటి త్రిమూర్తులు స్వగృహం వద్ద మండల పార్టీ అధ్యక్షులు కొమ్ముల రాము అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీల నియామకంపై చర్చించారు.కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్రజాస్వామిక విధానాలను ఎండగట్టాలన్నారు.కేవలం కక్ష సాధింపు తప్ప రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షమం ఎక్కడా కనపడడంలేదన్నారు.వాస్తవ పరిస్థితులను ప్రజలు గమనిస్తున్నారన్నారు.సమావేశంలో పార్టీ నేతలు తోరం సూర్య భాస్కర్, నెల్లి దుర్గాప్రసాద్, జక్కంపూడి వాసు, మట్టపర్తి శివ, పొలమూరి గోపాల్, బాలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రో కార్టింగ్ ఎండురన్స్ ఛాంపియన్షిప్కు టీములు సన్నద్ధం



**గండేపల్లి జనవరి 7 (ప్రభాతవార్త):** ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఆదిత్య ప్రో కార్టింగ్ ఎండురన్స్ "ఛాంపియన్ షిప్ 2026 సీజన్-6" పోటీలు మూడవ రోజు పలు టెక్నిక్ అంశాలలో టెక్నికల్ టీమ్ పరిశీలిస్తూ సాగింది. వివిధ కళాశాలల నుంచి వచ్చిన టీమ్ లు ట్రయిల్ రన్ నిర్వహిస్తూ టీమ్ సభ్యులు విద్యార్థులలో ఉత్సాహాన్ని ఉత్కంఠను నింపుతూ ఉండగా ఆదిత్య క్యాంపస్ లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మొదటి రోజు ప్రారంభ కార్యక్రమం అనంతరం టెక్నికల్ తనిఖీ , కాస్ట్ ప్లాన్, బిజినెస్ ప్లాన్ మొదలగు స్టాటిక్ ఈవెంట్స్ నిర్వహించారు. మూడవ రోజు బ్రేకింగ్ టెస్ట్, యాక్సిల్ రేషన్, స్కిడ్ పాడ్, ఆటో క్రోస్ టెస్ట్ మొదలు డైనమిక్ ఈవెంట్స్ జరిగాయి.గురువారం నాలుగో రోజున ఎండురన్స్ మధ్యాహ్నం ఉత్కంఠ భరితంగా జరుగు తాయని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ యస్ రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ ఈ అండ్ ఎస్ డాక్టర్ ఎ.రమేష్, రిజిస్టర్ డాక్టర్ జి. సురేష్, డాక్టర్ డి. కిషోర్ , స్టూడెంట్స్ ఆఫైర్స్, వివిధ విభాగాల డీన్లు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్,ఎస్ డి వి వి .యస్ .భీమేశ్వర రెడ్డి, కోఆర్డినేటర్స్. ఎం రాహుల్ భారతి బి , యం .శంకర్ సాయి రామ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆదిత్య అసిస్టెంట్ ప్రొఫెసర్ బందనాదంకు డాక్టరేట్



**గండేపల్లి జనవరి 7(ప్రభాతవార్త):** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఆర్టిఫిసియల్ ఇంటెలిజెంట్ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న"శౌరి రాయలు బందనాదం" అమృత విశ్వ విద్యాపీఠం డీమ్డ్ టు బి యూనివర్సిటీ చెన్నై నుండి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత విశ్వ విద్యాపీఠం డీమ్డ్ టు బి యూనివర్సిటీ చెన్నై కి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఆర్.ప్రసన్న కుమార్ నేతృత్వంలోని "శౌరి రాయలు బందనాదం" సమర్పించిన "థీసిస్ శీర్షిక: "ఏన్ హెన్సెన్గ్ క్లౌడ్ స్టోరేజ్ సెక్యూరిటీ త్రు బ్లాక్ చైన్ - బేస్డ్ డిసెంట్రలిజ్డ్ ఆడిటింగ్ " అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు.బందనాదం భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ . డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో. ఎం.బి. శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్.డా. ఎస్. రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి.సురేష్, విభాగాధిపతి. డా. మాగంటి వెంకటేష్ వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది బందనాదం కి అభినందనలు తెలిపారు.

## ఏలేశ్వరం 7వ వార్డులో శానిటేషన్ డ్రైవ్



**ఏలేశ్వరం, జనవరి 07,(ప్రభాతవార్త)** ఏలేశ్వరం నగరపంచాయతీ లో గల మెజారిటీ కౌన్సిలర్స్ సూచనల మేరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ లో భాగంగా 7 వ వార్డులో జరుగుతున్న పనులను పైల వెంకట ప్రియ దీప్తి మరియు పైల సుభాష్ చంద్ర బోస్ గారు మున్సిపల్ కమీషనర్ తో కలసి అక్కడ ఉన్న ప్రదేశం అంతా శానిటేషన్ డ్రైవ్ ద్వారా శుభ్రపరచమని ఆదేశాలు ఇచ్చారు . ఈ కార్యక్రమంలో పైల అయ్యప్ప , సిరిపురపు సత్తిబాబు కండాబతుల చిన్ని ,నండ ఈశ్వరరావు,పైల ప్రసాద్,కాకర వెంకట్రావు గారు,పాకలపాటి సోమరాజు గారు,జామి అజయ్,కర్రోతు దుర్గ,జామి హరీష్,గెద్ద భార్గవ్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి.. సిఐ భీమరాజు..



**అంబాజీపేట, జనవరి 7,(ప్రభాతవార్త):** గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు నాణ్యమైన ప్రాథమిక చికిత్స అందించేందుకు గ్రామీణ వైద్యులు కృషి చేయాలని, పేద ప్రజల అనారోగ్యంతో వ్యాపారం చేయవద్దని పి.గన్నవరం సీఐ ఆర్. భీమరాజు సూచించారు. అంబాజీపేట షాదీఖానాలో ఆర్ఎంపీ,పీఎంపీల మండల సమావేశం సంఘ మండల అధ్యక్షులు ఎం.డీ.రఫీ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సీఐ భీమరాజు మాట్లాడుతూ గ్రామాల్లో కొంత మంది ఎటువంటి ప్రాక్టీసు,సర్టిఫైట్లు లేకుండా వైద్యం చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి ఆర్ఎంపీ, పీఎంపీల సంఘలో చేర్చుకోకుండా వారిపై చర్యలు తీసుకోవావాలన్నారు. ఎటువంటి ధృవపత్రాలు లేకుండా వైద్యం చేస్తున్న వారిని ప్రోత్సహించకుండా వారిపై తగు చర్యలు తీసుకోవాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీల సంఘ అధ్యక్షుడు కంబాల బాబారావు సీఐ భీమరాజును కోరారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో రోగులకు ఎనలేని సేవలందించిన వైద్యులను ఘనంగా సత్కరించారు.ఈ సమావేశంలో కార్యదర్శి గుత్తుల సత్యనారాయణ, వై.త్రిమూర్తులు, నాగేశ్వరరావు, ఎండీ.సురాజ్, అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ పరమహంసకు ఘన సత్కారం



**నిడదవోలు, జనవరి 7(ప్రభాతవార్త):**నిడదవోలు పట్టణ పోలీస్ స్టేషన్ లో ఎస్ ఐ- 2 గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి ఇటీవల పదవి విరమణ పొందిన గోనబోయిన రామకృష్ణ పరమహంసను బుధవారం ఘనంగా సత్కరించారు. స్థానిక లైన్స్ క్లబ్ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన ఈ సత్కార కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు వర్తక వాణిజ్య సంఘాల వారు ప్రజా సంఘాల వారు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని పరమహంస సేవలను కొనియాడారు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని పరమహంస దంపతులను పూలమాలలతోనూ జ్ఞాపికలతోను ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో "నిడదవోలు జర్నలిస్ట్ ఫెడరేషను యూనియన్ సభ్యులు పాల్గొని పరమహంస దంపతులను ప్రత్యేకంగా సన్మానించి ఆయనసేవలను కొనియాడారు.

## అభిమాన నేతకు అందిన చిత్రపటం



**కడియం జనవరి 7 (ప్రభాత వార్త):** తాడేపల్లి వైఎస్ఆర్సిపి కేంద్ర కార్యాలయంలో "మాజీ ముఖ్యమంత్రివర్యులు, వైయస్ జగన్మోహన్ రెడ్డిని"రాజమహేంద్రవరం రూరల్ మాజీ కోఆర్డినేటర్, రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మరియు ఇటీవల జగనన్న జన్మదిన సందర్భంగా ధవళేశ్వరానికి చెందిన వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యుడు, జగనన్న వీరాభిమాని మిరప రమేష్ "తనసొంత రక్తంతో" జగన్ చిత్రాన్ని తానే స్వయంగా గీసి శుభాకాంక్షలు తెలియజేస్తూ తన అభిమానాన్ని చాటుకున్నాడు ఈ విషయం తెలిసిన గిరజాల బాబు వెళ్లి స్వయంగా అభినందించారు ఆ సమయంలో చిత్రకారుడు రమేష్ జగనన్న దగ్గరికి తీసుకుని వెళ్లవలసిందిగా కోరాడు ఆ కోరిక మేరకు కేంద్ర కార్యాలయంలో ఈ విషయాన్ని తెలియజేసి వారి అనుమతి మేరకు మంగళవారం వైయస్ జగన్మోహన్ రెడ్డి ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రత్యేకంగా మిరప రమేష్ ను పరిచయం చేస్తూ అతను తన సొంత బ్లడ్ తో గీసిన ఆర్ట్ ను అందజేశారు, ఈ సమయంలో వీరి వెంట ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్ కానుబోయిన సాగర్ తదితరులు ఉన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps